సత్యమేవ జయతే


# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 350

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'





"రంగు రంగుల మేనిఫెస్టోతో ప్రజలను మోసం చేసి, అధికారంలోకి వచ్చాక దానిని చెత్తబుట్టలో వేసే చంద్రబాబులా నాయకుడు ఉండాలా? లేక మాట ఇచ్చాక, ఎంత కష్టమైనా, నష్టమైనా మాట మీద నిలబడే నాయకుడు కావాలా? నాయకుడంటే ప్రతి కార్యకర్తా కాలర్ ఎగరేసి అదిగో మా నాయకుడు అని చెప్పుకోవాలి. ప్రజా సేవలో ఉన్న ప్రతి ఒక్కరికీ మరో రెండు మెట్లు ఎక్కే అవకాశం కల్పించే బాధ్యత నాది. - సీఎం వైఎస్ జగన్



బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం మేదరమెట్ల సమీపంలో జరిగిన సిద్ధం సభకు తరలివచ్చిన అశేష జనసందోహంలో ఓ భాగం

# ఓటును సంధించండి

## జమ్మిచెట్టుపై దాచిన ఈ అస్త్రాన్ని బయటకు తీయండి

### పేదల అభ్యున్నతికి అడ్డుపడుతున్న పెత్తందారులపై ప్రయోగించండి

### మేదరమెట్ల సిద్ధం సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- నాకు అధికారమంటే వ్యామోహం లేదు..
- ప్రతి చరిత్ర పుస్తకంలో నా పేరు ఉండాలి..
- ప్రతి పేదవాడి ఇంట్లో నా ఫొటో ఉండాలన్నదే కోరిక
- పేదల తలరాతలు మార్చాలన్నదే నా కల, నా లక్ష్యం
- బాబు సైకిల్‌కు చక్రాలు లేవు.. అది తుప్పు పట్టింది
- దాన్ని తోయడానికి వేరే పార్టీలు కావాలి
- అందుకే దత్తపుత్రుడితో కలిసి ఢిల్లీలో మోకరిల్లారు
- దత్తపుత్రుడు సైకిల్ దిగమంటే దిగుతాడు.. ఎక్కమంటే ఎక్కుతాడు
- త్వరలో మేనిఫెస్టో.. చేయగలిగిందే చెబుతాం
- 2014 ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి మోసం చేశారు.. ఇప్పుడు మళ్లీ అదే డ్రామాకు సిద్ధమయ్యారు
- బాబు మాటలు నమ్మితే సంక్షేమాభివృద్ధి దూరం
- మీ బిడ్డ మాట ఇచ్చాడంటే చేస్తాడంతే
- ప్రతి గడప నుంచి స్టార్ క్యాంపైనర్లు బయటకు రావాలి
- ఈ మార్పు కొనసాగాలంటే మీ బిడ్డ మళ్లీ సీఎం అవ్వాలని ఇంటింటా చెప్పండి
- పార్టీలోని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా


2 లో





## రాజకీయ కుంభమేళా!

- సార్వత్రిక ఎన్నికలకు ముందే కనిపిస్తున్న వైఎస్సార్‌సీపీ సునామీ.. మేదరమెట్ల సభకు దక్షిణ కోస్తాలో 44 నియోజకవర్గాల నుంచి పోటెత్తిన జనప్రవాహం
- ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసిపోయిన సభా ప్రాంగణం


11 లో


### సోషల్ మీడియాలోనూ సిద్ధం సంచలనం

### మనవడిని చూద్దామని వచ్చా..

- ఉదయం 7గంటలకే సభా ప్రాంగణానికి వచ్చిన అవ్వ

### దివ్యాంగుడిని.. అయినా దిగులులేదు


- వివరాలు 11లో




ఇదంజగత్



అన్నీ వదులుకోవడానికి సిద్ధపడే మనతో పొత్తు పెట్టుకున్నార్సార్!

# మనబడి 'ఐబీ'కి అనుకూలం

### అంతర్జాతీయ ప్రతినిధుల కితాబు

- రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల పరిశీలన.. సదుపాయాలపై సంతృప్తి
- ఇంటర్నేషనల్ బాకలారియెట్ బోధనకు అనువుగా ఉన్నట్లు ప్రకటన
- బహుభాషా బోధన, టీచర్–విద్యార్థి మధ్య అనుబంధంపై ప్రశంస
- 2025 జూన్‌లో ఒకటో తరగతి నుంచి ఐబీ బోధనకు ఏర్పాట్లు



ఇటీవల విజయవాడ రూరల్‌లోని వెంకటాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఐబీ ప్రతినిధి

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన, బహు భాషలు మాట్లాడే విద్యార్థులు, చదువులో తమ అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు తొట్రుపాటు లేకుండా ఆత్మవిశ్వాసంతో ఉపాధ్యాయులను ప్రశ్నించే తీరు.. ఎదుటివారితో మర్యాదగా మాట్లాడేతత్వం, పిల్లల్లో సహకార గుణం, క్లాస్‌రూమ్‌లో విద్యార్థులు –టీచర్ల మధ్యనున్న అన్యోన్యత తదితర అంశాలు అంతర్జాతీయ విద్యావేత్తలను ఆశ్చర్యపరిచాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2025 జూన్ మొదలు ఐబీ సిలబస్‌ను ఒకటో తరగతి నుంచి ప్రభుత్వం అమలుచేయనున్న నేపథ్యంలో.. ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) ప్రతినిధులు ఫిబ్రవరి 26 నుంచి ఈనెల ఏడో తేదీ వరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా.. ఇప్పటికే రాష్ట్రంలో అమలుచేస్తున్న ఏపీ విద్యా సంస్కరణలు, విద్యార్థుల్లో నేర్చుకునే తత్వం వారిని ఆశ్చర్యపరిచాయి. తాము పరిశీలించిన పాఠశాలల్లో చక్కటి వాతావరణం, మెరుగైన మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పాఠశాల పరిశుభ్రతపై కేంద్రీకృత పరిశీలన, పాఠశాలల పనితీరు..


మిగతా 5వ పేజీలో ▶


## 14న వైఎస్సార్‌సీపీలో చేరుతున్నా

- పార్టీ విజయానికి సంపూర్ణ మద్దతు అందిస్తా
- కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వెల్లడి

**కిర్లంపూడి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఈ నెల 14న వైఎస్సార్‌సీపీలో చేరుతున్నానని కాపు రిజర్వేషన్ ఉద్యమ పోరాట సమితి నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ప్రకటించారు. కాకినాడ జిల్లా


మిగతా 12వ పేజీలో ▶




మీడియాతో మాట్లాడుతున్న కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం

## సాత్విక్-చిరాగ్ జోడీదే టైటిల్



■ ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత జోడీ పురుషుల డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. పారిస్‌లో జరిగిన ఫైనల్లో సాత్విక్ –చిరాగ్ శెట్టి జోడీ లీ జె హుయ్–పో సువాన్ యాంగ్ (చైనీస్ తైపీ) జంటపై గెలిచింది. - 14లో

## రూ.266 కోట్లతో కడప విమానాశ్రయం అభివృద్ధి

- టెర్మినల్ భవనం, అభివృద్ధి పనులకు వర్చువల్‌గా ప్రధాని మోదీ శంకుస్థాపన
- ఏడాదికి 25 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యానికి తగినట్లుగా విస్తరణ
- ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి వైఎస్సార్, వైఎస్ జగన్ ఎనలేని కృషి
- ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


12 లో




సభలో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

## భార్యను చంపి.. చెత్త డబ్బాలో పెట్టి

- ఆస్ట్రేలియాలో హైదరాబాదీ దారుణం.. మృతురాలి స్వస్థలం ఏఎస్‌రావు నగర్
- కొడుకును నగరంలో వదిలి వెళ్లిన నిందితుడు
- విక్టోరియా పోలీసుల ఎదుట లొంగుబాటు


3 లో




### నేను డిఫరెంట్

తాను భిన్నమైన వ్యక్తినని... సాధారణ నాయకుల్లా హామీలిచ్చి అమలు చేయకుండా తప్పించుకోనని ప్రధాని మోదీ అన్నారు.


వివరాలు 6లో ▸




### 15కల్లా ఈసీల నియామకం!

కేంద్ర ఎన్నికల సంఘంలో ఖాళీగా ఉన్న 2 కమిషనర్ పోస్టులను ఈ నెల 15 నాటికి భర్తీ చేసే అవకాశముందని సమాచారం.


వివరాలు 6లో ▸




### నీట్ దరఖాస్తు గడువు పెంపు

వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ యూజీ దరఖాస్తు గడువును ఎన్‌టీఏ ఈనెల 16 వరకు పెంచింది.


వివరాలు 6లో ▸




### తృణమూల్ ఒంటరి పోరు

పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 42 లోక్‌సభ స్థానాలకు అధికార తృణమూల్ కాంగ్రెస్ ఆదివారం తమ అభ్యర్థులను ప్రకటించింది.


వివరాలు 6లో ▸

# ఓటును సంధించండి



## జమ్మిచెట్టుపై దాచిన ఈ అస్త్రాన్ని బయటకు తీయండి
## పేదల అభ్యున్నతికి అడ్డుపడుతున్న పెత్తందారులపై ప్రయోగించండి
## మేదరమెట్ల సిద్ధం సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

**సాక్షి** ప్రతినిధి, గుంటూరు : జమ్మి **చెట్టు**పై దాచిన ఓటు అనే అస్త్రాన్ని **బయ**టకు తీసి పేదల అభ్యున్నతికి **అడ్డుపడుతున్న** పెత్తందారులపై సంధించాల్సిన **సమయం** ఆసన్నమైందని వైఎస్సార్‌సీపీ **అధ్యక్షుడు, ము**ఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ధర్మ, అధర్మాల మధ్య.. విశ్వసనీయతకు, వంచనకు మధ్య జరగబోయే ఎన్నికల కురుక్షేత్ర యుద్ధంలో తమ స్వార్థం కోసం రాష్ట్రాన్ని అన్యాయంగా విడగొట్టిన పార్టీలు, రాష్ట్ర ద్రోహుల పార్టీలు, ప్రజల చేతుల్లో చిత్తుగా ఓడిపోయిన పార్టీలు, వ్యక్తులే మనకు పోటీ అని.. రాష్ట్రంలో ఇంటింటికీ మంచి చేసిన మనం.. 5 కోట్ల మంది ప్రజల అండదండలతో 'సిద్ధం' అంటున్నామని చెప్పారు. తనకు అధికారం అంటే వ్యామోహం లేదని, పేదల ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే తన లక్ష్యమని పునరుద్ఘాటించారు. బాపట్ల జిల్లా మేదరమెట్ల జాతీయ రహదారి వద్ద ఆదివారం జరిగిన సిద్ధం సభలో గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేస్తూ దిశా నిర్దేశం చేశారు. 'బహుశా మరో నాలుగు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వచ్చేస్తుంది. చంద్రబాబు పార్టీ, చంద్రబాబు జేబులో ఉన్న మరో పార్టీ, వీరంతా మన మీద, మన పేదల భవిష్యత్ మీద దాడి చేయడానికి రెడీగా ఉన్నారు. ఈ పార్టీల్లో సైన్యాధిపతులే తప్ప ఏ పార్టీలో కూడా సైన్యం లేదు. ఇందులో కొన్ని పార్టీలకు గత ఎన్నికల్లో నోటాకు వచ్చినన్ని ఓట్లు కూడా రాలేదు. వారి వెనుక ప్రజలు లేరు.. చేసిన మంచి చెప్పుకునే పరిస్థితి లేదు కాబట్టి అరడజను పార్టీలతో, అరడజను ఎల్లో మీడియా సంస్థలతో పొత్తులతో, ఎత్తులతో, జిత్తులతో ఎక్కే గుమ్మం, దిగే గుమ్మంగా వారు రాజకీయం నడుపుతున్నారు. నాకు చంద్రబాబుకు ఉన్నట్టుగా పది మంది నటించే పొలిటికల్ స్టార్లు లేరు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 లేదు. అబద్ధాలకు రంగులు పూసే ఎల్లో మీడియా లేదు. రకరకాల పార్టీలతో పొత్తులు లేవు. ఒంటరిగానే ఎన్నికలకు వెళ్తున్న నాకు ఉన్నదల్లా నక్షత్రాలు ఎన్నున్నాయో అంత మంది పేదింటి స్టార్ క్యాంపెయినర్లు ప్రతి ఇంట్లో ఉన్నారని స్పష్టం చేశారు. త్వరలోనే మేనిఫెస్టో విడుదల చేస్తామని, చేయగలిగిందే చెబుతాం.. చెప్పింది చేస్తాం అని తెలిపారు. 'జగన్ మాట ఇచ్చాడంటే చేస్తాడంతే, తగ్గేదేలే.. 2019లో మాట ఇచ్చాను. మీ బిడ్డ వస్తే మంచి రోజులు వస్తాయని చెప్పాను. ఈ మంచి కొనసాగాలంటే మళ్లీ జగనన్నను తెచ్చుకుందామని ప్రతి ఇంట్లో చెప్పండి' అని పిలుపునిచ్చారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

> మన పార్టీ, మన ప్రభుత్వం నిండుగా విరగకాసిన మామిడి చెట్టులా ఉంటే, చంద్రబాబు పార్టీ అందర్నీ మోసం చేసి.. వెన్నుపోట్లు పొడిచి, గత పాపాలకు ఫలితం అనుభవిస్తూ తెగులు పట్టిన చెట్టులా ఉంది. మన ఎమ్మెల్యేలు, నాయకులు ప్రతి నియోజకవర్గంలో గడపగడపకూ ప్రజల వద్దకు వెళ్లి చేసిన మంచిని చెబుతూ తిరుగుతుంటే చంద్రబాబు మాత్రం రామోజీ గడప, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ గడప, టీవీ5 గడప, ఢిల్లీలో ఇతర పార్టీల గడపలు.. ఇలా ఓ అరడజను గడపలు.. ఐదేళ్లుగా తన మనుషులను పంపి, తానూ తిరుగుతున్నాడు. ఇదీ చంద్రబాబు మార్క్ రాజకీయం. మీ జగన్ మార్క్ రాజకీయంలో విలువలున్నాయి. విశ్వసనీయత అన్న పదానికి అర్థం ఉంది. నిబద్ధత ఉంది. సిద్ధాంత బలం ఉంది. ఇంటింటికీ మంచి చేశాము అన్న చరిత్ర ఉంది. అన్నింటికీ మించి ప్రజల మీద, అక్కచెల్లెమ్మల మీద నమ్మకం ఉంది. ప్రతి ఇంట్లో చిక్కటి చిరునవ్వులు కనిపించే పరిస్థితులున్నాయి.



> బిందువూ బిందువూ సింధువైనట్లు నా మీద, మన పార్టీ మీద నమ్మకంతో చేయి చేయి కలిపి ప్రభంజనంలా తరలి వచ్చిన మీ అందరితో ఈ మేదరమెట్లలో ఓ జన సముద్రం కనిపిస్తోంది. ఇంటింటి అభివృద్ధిని, సామాజిక వర్గాల సంక్షేమాన్ని, పేదలందరి ఆత్మగౌరవాన్ని, మొత్తంగా రాష్ట్ర ప్రగతిని ఇలాగే కాపాడుకుని మరో ఐదేళ్లు ఈ ప్రయాణాన్ని కొనసాగించేందుకు మద్దతు పలికేందుకు వచ్చిన ఈ ప్రజా సైన్యానికి, ఇక్కడున్న ప్రతి గుండె చప్పుడుకూ మీ జగన్, మీ అన్న, మీ తమ్ముడు, మీ బిడ్డ సెల్యూట్ చేస్తున్నాడు. సిద్ధం అంటే ఓ ప్రజా సముద్రం. ఇప్పటికే ఉత్తరాంధ్ర సిద్ధం. ఉత్తర కోస్తా సిద్ధం. రాయలసీమ సిద్ధం. ఈరోజు దక్షిణ కోస్తా కూడా సిద్ధం.

## ఢిల్లీలో మోకరిల్లిన చంద్రబాబు



- జాతీయ రాజకీయాలను తానే ఏలానని, స్టీరింగ్ కమిటీ చక్రం తానే తిప్పానని, ప్రధానుల్ని, రాష్ట్రపతుల్ని తానే నిర్ణయించానని ఒకప్పుడు చంద్రబాబు ఊదరగొట్టేవాడు. ఈరోజు ఏపీలో మనం చేసిన ఇంటింటి అభివృద్ధి, మంచి వల్ల మనకున్న ప్రజా బలం ముందు నిలబడలేక, మనతో నేరుగా తలపడలేక, ఏపీలో తన సైకిల్ చక్రం తిరగడం లేదని ఢిల్లీకి దత్తపుత్రుడితో కలిసి వెళ్లి పడిగాపులుగాసి, ఢిల్లీలో మోకరిల్లుతున్న పరిస్థితులు చూస్తున్నాం. జగన్ వల్ల ప్రతి ఇంటికి మంచి జరిగి, మేనిఫెస్టోలో చెప్పింది చేయబట్టే చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరుగెత్తి ఇన్ని పొత్తుల కోసం పాకులాడుతున్నాడు. ఇంత మందితో పొత్తుల కోసం అగచాట్లు పడుతున్నాడు.
- చంద్రబాబునాయుడు సైకిల్‌కు ట్యూబుల్లేవు. టైర్లు లేవు. చక్రాలే లేవు. తుప్పు పట్టిన పరిస్థితిలో ఉంది. ఈ సైకిల్‌ను తొక్కటానికి, తోయటానికి చంద్రబాబుకు వేరే పార్టీలు కావాలి. బాబు పేరు చెబితే ఒక్క మంచీ, ఒక్క స్కీము కూడా వినపడదు, కనిపించదు. పొత్తుల్లో భాగంగా ముందుగా ఒక ప్యాకేజీ ఇచ్చి దత్తపుత్రుడిని తెచ్చుకున్నాడు. ఈ ప్యాకేజీ స్టార్ అయితే, సైకిల్ సీటు తనకు కావాలని అడగడు. తన వారికి సీట్లు ఇవ్వకపోయినా అడగనే అడగడు. ఎందుకు తక్కువ సీట్లు ఇస్తున్నావని కూడా అడగడు. తాను తాగుతున్న టీ గ్లాస్ కూడా బాబుకే ఇచ్చేస్తాడు. చంద్రబాబునాయుడు సిట్ అంటే కూర్చుంటాడు. స్టాండ్ అంటే నిలబడతాడు. ఎక్కడ సైకిల్ దిగమంటే అక్కడ దిగుతాడు. ఎప్పుడు సైకిల్‌ను తోయమంటే అప్పుడు తోస్తాడు. పొత్తుల్లో ఉండమంటే ఉంటాడు. విభేదించినట్లు డ్రామాలాడమంటే రక్తికట్టించేట్టు డ్రామా ఆడతాడు.



> పేదవాడి భవిష్యత్ మార్చడం కోసమే మీ బిడ్డకు అధికారం కావాలని అడుగుతున్నా. అధికారం అంటే వ్యామోహం లేదు. అధికారం పోతుందన్న భయం ఎప్పుడూ ఉండదు. మీ బిడ్డ పేరు ప్రతి చరిత్ర పుస్తకంలో ఉండిపోవాలన్నదే కోరిక. ప్రతి పేద వాడి ముఖంలో చిరునవ్వులు చూడటం కోసం, చనిపోయిన తర్వాత కూడా మీ బిడ్డ ఎప్పుడూ పేదవాడి గుండెల్లో బతికుండటం కోసం మీ బిడ్డకు అధికారం కావాలి. దాని కోసమే మీ బిడ్డ అధికారం అడుగుతున్నాడు. మంచి చేయడం కోసం మంచి మనసుతో మీ బిడ్డ సంకల్పిస్తున్నాడు.



## మరోసారి అదే డ్రామా.. అవే పొత్తులు

- వెనకటికి చంద్రబాబు లాంటి నాయకుడిని ఎవరో అడిగారట.. అయ్యా.. పరిపాలన చేసేవారు కలకాలం గుర్తుండాలంటే ఎలాంటి పనులు చేయాలి అని అడిగారట. అప్పుడు ఆ బాబు.. ప్రజలకు అన్నం పెడితే అరిగిపోతుంది. చీర కొనిపెడితే చిరిగిపోతుంది. ఇల్లు కట్టిస్తే కూలిపోతుంది. కర్రు కాల్చి వాత పెడితే మాత్రమే ప్రజలకు కలకాలం గుర్తుంటుందని చెప్పాడట. ఎంత మందితో పొత్తులు పెట్టుకున్నా చంద్రబాబు పరిస్థితి సున్నా. ఈ సున్నా ఇంటూ ఎన్ని పార్టీలున్నా దాని విలువ గుండు సున్నానే. ఇప్పుడు చంద్రబాబు ముగ్గురితో కలిసి పొత్తు అంటున్నాడు. ఈ ముగ్గురూ కలిసి 2014లో ఇలాగే పొత్తుగా ఏర్పడి ఒకే స్టేజీ మీద కూర్చుని మీటింగులు పెట్టారు. ఒకే ప్రకటనలో తన ఫొటోతో పాటు దత్తపుత్రుడు, మోదీ ఫొటోలు వేసుకుని సంతకం పెట్టి.. ఇంటింటికీ చంద్రబాబు ఈ కరపత్రం (చూపిస్తూ) పంపించాడు.
- రైతులు, డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ, మహిళల రక్షణకు ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్, మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు డిపాజిట్, ఇంటింటికీ ఉద్యోగం లేదా అది వచ్చే దాకా నెలనెల రూ.2 వేలు నిరుద్యోగ భృతి, రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్ చేనేత, పవర్ లూమ్స్ రుణాలు మాఫీ, అర్హులందరికీ మూడు సెంట్ల స్థలం, పక్కా గృహాలు మంజూరు, సింగపూర్‌కు మించి రాష్ట్రం అభివృద్ధి, ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మాణం.. అంటూ హామీలు ఇచ్చాడు. ఇందులో ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. మరోసారి ఇదే డ్రామా, ఇవే పొత్తులు, ఇంతకన్నా ఎక్కువ హామీలు ఇస్తూ మళ్లీ మోసం చేసేందుకు మీ అందరి ముందుకు వస్తున్నాడు.
- చంద్రబాబు చూపిస్తున్న ఈ పొత్తులతో ఎవరికైనా ప్రయోజనం కలిగిందా? అంటే ఎవరికి మంచి చేయకపోగా ప్రజలకు మంచి చేసిన జగన్‌ను టార్గెట్ చేయడం మాత్రమే వీళ్ల ఏకైక ఎజెండాగా కనపడుతోంది. అధికారంతో ప్రజలను దోచుకోవడానికి, దోచుకున్నది పంచుకోవడానికి మాత్రమే చంద్రబాబుకు అధికారం కావాలి. నరకలోకానికి, నారా లోకానికి రమ్మంటే ఎవరూ రారు కాబట్టి ఎంట్రెన్స్‌లో స్వర్గం చూపించి, లోపలికి వెళ్లాక మోసం చేసి నరకం చూపించే మార్కెటింగ్ టెక్నిక్ చంద్రబాబుకు అలవాటు. అందుకే కర్ణాటకలో నుంచి కొన్ని, తెలంగాణ నుంచి కొన్ని హామీలని కలిపి కిచిడీ మేనిఫెస్టో తెచ్చాడు. చంద్రబాబు చేసే వాగ్దానాలకు శకుని చేతిలో పాచికలకు తేడా ఏమైనా ఉందా? చంద్రబాబు కేరక్టర్‌కు భిన్నంగా మనందరి ప్రభుత్వం కరోనా కష్ట సమయంలో కూడా ఏమాత్రం సాకులు చూపకుండా పేదలందరికీ మేనిఫెస్టోలో చెప్పిన మాట ప్రకారం సంక్షేమ పథకాలన్నీ ఇంటింటికీ అందించాం.

> **మన ఫ్యాన్ గిర్రున తిరిగేం**దుకు కావాల్సిన కరెంటు ఇతర పార్టీల **నుంచి, ఇతరులతో** పెట్టుకున్న పొత్తుల నుంచి రాదు. నేరుగా **ప్రజలు ఆశీర్వదిస్తే వస్తుంది**. వారి గుండెల్లో ప్రేమ నుంచి వస్తుంది. **మన ఫ్యాన్‌కు కరెంటు** మనందరి ప్రభుత్వం ఇంటింటికీ చేసిన **మంచి నుంచి** వస్తుంది. మనం అందించిన నవరత్నాల **నుంచి వస్తుం**ది. లంచాలు లేని, వివక్ష లేని పాలన **నుంచి వస్తుం**ది. మాట తప్పకుండా మేనిఫెస్టోను ఓ **బైబిల్, ఖు**రాన్,భగవద్గీతగా భావించి 99 శాతం **హా**మీలు అమలు చేసిన నిజాయితీ నుంచి మన ఫ్యాన్‌కు కరెంటు వస్తుంది.



## మళ్లీ జగనన్నను తెచ్చుకుందాం

- మళ్లీ జగనన్ననే తెచ్చుకుందామని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండి. బాబు అనే మాయలేడి వలలో పడొద్దని చెప్పండి. అన్న పొత్తుల్ని నమ్ముకోలేదు, అన్న మనల్నే నమ్ముకున్నాడు, ఆ దేవుడిని నమ్ముకున్నాడు.. అన్న ఒంటరిగానే సింహంలా మనందరికీ తోడుగా నిలబడ్డాడు.. అని ప్రతి ఇంటింటికీ వెళ్లి చెప్పండి. మళ్లీ మన అన్నను గెలిపించేందుకు చేయి చేయి కలిపి.. మనమంతా ఒక్కటవుదాం అని చెప్పండి. ఇంటింటికీ పింఛన్, ఇళ్ల నిర్మాణం, అమ్మ ఒడి, చేయూత, రైతు భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన కొనసాగాలంటే అన్న వస్తేనే జరుగుతుందని చెప్పండి. గవర్నమెంట్ బడి, గవర్నమెంట్ ఆస్పత్రి బాగుపడుతుందని, నవరత్నాల్లోని అన్ని పథకాలు కొనసాగుతాయని చెప్పండి.
- ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తు మీద అసెంబ్లీకి ఒక ఓటు, పార్లమెంటుకు ఒక ఓటు వేస్తేనే **మళ్లీ** అన్న సీఎం అవుతాడని చెప్పండి. చంద్రబాబుకు ఓటు వేయడం అంటే.. మీకు అందే **పథ**కాలన్నింటి రద్దుకు మీరే ఆమోదం తెలిపినట్టే అవుతుందని కూడా చెప్పండి. అప్పుడు **మళ్లీ** జన్మభూమి కమిటీలు.. లంచాలు, వివక్షల రాజ్యం, అవ్వలు, తాతలు, రైతన్నలు క్యూలో **నిలబ**డే పరిస్థితి, గవర్నమెంట్ ఆఫీసుల **చుట్టూ తిరిగే పరిస్థితి** వస్తుందని చెప్పండి. పొరపాటు**న చంద్రబాబుకు** ఓటేయడం అంటే మీ ఇంటికి వచ్చి **పెన్షన్ ఇస్తున్న వల**ంటీర్ వ్యవస్థ రద్దుకు, ఇంగ్లిష్ మీడి**యం రద్దుకు మీరే ఓ**టు వేసినట్లు అని చెప్పండి. గవర్నమెం**ట్ బడిని మళ్లీ కార్పొ**రేట్లకు అమ్మేయడం, వైద్యం కోసం **అప్పుల పాలు కావ**డం అని చెప్పండి. బాబుకు ఓటు **వేయడం అంటే చంద్రము**ఖిని మనమే వెళ్లి నిద్ర లేపి మన ఇంటికి **తెచ్చుకున్నట్టే అని ప్రతి ఇంట్లో** చెప్పండి. ఫ్యాన్ ఇంట్లోనే ఉండాలి, **సైకిల్ ఇంటి బయటే ఉండాలి, తా**గేసిన టీ గ్లాసు సింక్‌లోనే ఉండాలి **అని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండి. ఇవన్నీ వివ**రించి ఇంత మంచి చేశాం కాబట్టి 2019**కి మించిన మెజారిటీ.. 175కు 175 ఎమ్మెల్యేలు,** 25కు 25 ఎంపీలు తప్పక వస్తాయి. **ఇలా గెలవడానికి మనమంతా సిద్ధమేనా? (సిద్ధం అని కేకలు)**



## ఇదీ నా కల, లక్ష్యం



- ఆంధ్రప్రదేశ్‌లో **మనం ప్రారంభించిన** పరిపాలన ఓ స్వర్ణ**యుగానికి దారి** తీస్తోంది. 90 శా**తం ప్రజలు** తెల్లకార్డుల మీద **జీవించే** పరిస్థితి నుంచి **ప్రతి కుటుం**బం పేదరికం సం**కెళ్లను తెం**చుకుని అడుగు**లు ముందుకు** వేసే పరిస్థితి రా**వాలన్నది నా** కల. అలా చే**యాలన్నది నా** లక్ష్యం. ప్రతి ఇం**టి నుంచి** క్వాలిటీ చదువు**లు, గొప్ప** చదువులు, అం**తర్జాతీయ స్థాయి** చదువులు చది**వేలా పేద పిల్లలకు** అవకాశం కల్పిం**చడం, తద్వారా** వారి బతుకులు **మార్చాలన్నది నా** కల, నా లక్ష్యం. **ప్రతి అక్కచెల్లెమ్మ తన** కాళ్ల మీద తాను **నిలబడేట్టుగా** చేయాలన్నది నా **కల, నా లక్ష్యం. ఏ** ఒక్క రైతన్న వ్య**వసాయం వల్ల** నష్టపోయానని **చెప్పే పరిస్థితి రాకుం**డా మార్చాలన్న**ది నా కల, నా లక్ష్యం.**
- ఎస్సీ,ఎస్టీ, బీసీ, **మైనార్టీ, ఏ పేద** కూడా పేదరికం **వల్ల** ఎదగలేకపోయా**డన్న పరిస్థితిని** మార్చాలన్నది **మీ బిడ్డ కల. మీ బిడ్డ** సంకల్పం. మీ **బిడ్డ లక్ష్యం. వైద్యం** కోసం ఏ ఒక్కరూ **మరణించే** పరిస్థితి, అప్పుల **పాలయ్యే పరిస్థితి** రాకూడదనేది నా **కల. ఆ దిశగా** అడుగులు వేయ**డం నా లక్ష్యం.** వీటన్నింటినీ నెరవేర్చే దిశగా అడుగులు వేయడానికి మాత్రమే మీ బిడ్డకు అధికారం కావాలి.
- చదువుల పరంగా, వ్యవసాయం పరంగా, వైద్యం పరంగా మార్పులు తీసుకొచ్చాం. అక్కచెల్లెమ్మల సాధికారత విషయంలో ఎప్పుడూ చూడని రీతిలో అడుగులు వేశాం. సామాజిక న్యాయానికి అర్థం చెప్పాం. పారిశ్రామికంగా, మౌలిక సదుపాయాల పరంగా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల పరంగా ఏపీని నంబర్ వన్ దిశగా అడుగులు వేయిస్తున్నాం. ఈ ప్రయాణం మధ్యలో ఉంది. ఈ ప్రయాణం ముందుకు పోవాలి. పేదవాడి భవిష్యత్ మారాలన్నదే నా కల. ఇదే లక్ష్యం.

### కార్యకర్తలకు అండగా నిలబడతా

- కార్యకర్తలకు, అభిమానులకు, వలంటీర్లకు ఒకే ఒక మాట చెబుతున్నా. ఇన్ని పదవులు, ఇన్ని హోదాలు భారతదేశ రాజకీయ చరిత్రలో మరే ఇతర పార్టీ ఎప్పుడూ ఇవ్వలేదు. మన పార్టీలో ఉన్న ప్రతి కార్యకర్త, ప్రతి అభిమాని, ప్రతి వలంటీర్.. అందరూ నా కుటుంబ సభ్యులే. వారికి కచ్చితంగా మంచి జరుగుతుంది. మంచి జరిగేలా చేసేందుకు మీ బిడ్డ ఉన్నాడు. వారు మరో రెండు మెట్లు ఎదిగేందుకు ఎన్నడూ లేనన్ని కార్పొరేషన్లు, చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు మొదలు, ఎమ్మెల్యేలు.. ఎంపీలుగా గెలిపించుకుని అవకాశాలిచ్చిన పార్టీ ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే.
- కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామం తీసుకున్నా 87 శాతం ఇళ్లకు మంచి జరిగింది. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో మీరందరూ మీ సచివాలయ పరిధిలో జరిగిన మంచి గురించి చూస్తున్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి సచివాలయం పరిధిలో ఏకంగా రూ.20 కోట్లకుపైగా లబ్ధి కలిగింది. ఆ డబ్బు నేరుగా నా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి వెళ్లినట్లు కనిపిస్తోంది. ఊళ్లు మారాయి. బడులు, ఆస్పత్రులు బాగుపడ్డాయి. వ్యవసాయం మారింది. ప్రతి అక్కచెల్లెమ్మ ముఖంలో చిరునవ్వు కనిపిస్తోంది. అందుకే వై నాట్ 175.. వై నాట్ 25 ఎంపీ స్థానాలు అని గట్టిగా అడుగుతున్నా.
- ఈ ఎన్నికల యుద్ధంలో చంద్రబాబు ప్రచారాలు, ఈనాడు రోత రాతలు, ఏబీఎన్, టీవీ5 ఎల్లో మీడియా తప్పుడు కథనాలు, అబద్ధాలు, మోసాలు.. వీటన్నింటి నుంచి ఇంటింటి అభివృద్ధిని, పేదవాడి భవిష్యత్‌ను కాపాడేందుకు మీరంతా కూడా సిద్ధమేనా.. (సెల్ ఫోన్లలో టార్చ్ వెలిగించి చేతులు పైకెత్తి సిద్ధమే అంటూ నినదించారు). ఈ ఎన్నికల్లో శ్రీకృష్ణుడి పాత్ర మీది. ప్రజలందరిదీ. అర్జునుడి పాత్ర మీ బిడ్డది. మీ అన్నది, మీ తమ్ముడిది.

## 'సిద్ధం' హైలైట్స్

- పలువురు వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు పార్టీ జెండా రంగులు, చేతిపై సిద్ధం పచ్చబొట్లతో కనిపించారు.
- సభలో సిద్ధం కరపత్రాలను కార్యకర్తలు పెద్దఎత్తున పంపిణీ చేశారు.
- దివంగత వైఎస్సార్‌కు భారతరత్న ఇచ్చి పార్లమెంట్ సెంట్రల్ హాలులో విగ్రహం ఏర్పాటు చేయాలని మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.
- సభకు చిన్న పిల్లలు, యువకులతోపాటు వృద్ధులు సైతం పార్టీ జెండాలను చేతబూని తరలివచ్చారు.
- కొందరు దివ్యాంగులు వందలాది కిలోమీటర్లు నుంచి సిద్ధం సభకు తరలివచ్చారు.
- సభ ప్రాంతంలో ఎయిర్ బెలూన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
- సిద్ధం, నువ్వే మా భవిష్యత్తు జగనన్న పేరుతో టీ షర్టులను ధరించి వేలాది మంది సభకు వచ్చారు.
- ఉదయం నుంచే సభా ప్రాంగణానికి అభిమానులు, కార్యకర్తల రాక మొదలైంది.
- ముఖ్యమంత్రి కోసం ఎదురుచూస్తూ మండుటెండలోనూ నిరీక్షించారు.
- సీఎం జగన్‌ను చూసేందుకు తెలంగాణ నుంచి కూడా అభిమానులు వచ్చారు.
- సభా ప్రాంగణంతో పాటు చెన్నై –కోల్‌కతా రహదారి కిక్కిరిసిపోవడంతో రాకపోకలు స్తంభించాయి.
- పార్టీల పొత్తులతో చంద్రబాబు... ప్రజల బలంతో మనం ఈ సంగ్రామానికి సిద్ధమా? అని జగన్ ప్రశ్నించగా జనం కేకలు, ఈలలతో ప్రతిస్పందించారు. ప్రతిపక్ష పార్టీలకు సైన్యాధ్యక్షులు ఉన్నారని, మనకు సైన్యమే ఉందని అన్నప్పుడు హర్షధ్వానాలు చేశారు.
- రాష్ట్రాన్ని విడగొట్టిన పార్టీ, గత ఎన్నికలలో చిత్తుగా ఓడిన పార్టీ, నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చిన పార్టీ ఒక వైపు ఉంటే ఐదు కోట్ల మంది అండదండలు మనకు ఉన్నాయని అన్నప్పుడు జనం జై జగన్ అంటూ నినదించారు.
- ప్రతిపక్ష పార్టీలకు పది మంది స్టార్ క్యాంపెయినర్లు ఉంటే నాకు మీరే స్టార్ క్యాంపెయినర్లు అని సీఎం జగన్ ప్రజలనుద్దేశించి పేర్కొన్నప్పుడు ఈలలతో స్పందించారు. మళ్లీ మా సీఎం నువ్వే అంటూ నినాదాలు చేశారు.
- చంద్రబాబు సైకిల్‌కు ట్యూబ్‌లు, చక్రాలు లేవని వ్యాఖ్యానించినప్పుడు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు.

## ఓటు విలువ ఇంటింటా వివరించాలి

- ఇవాళ నేరుగా మీ బిడ్డ బటన్ నొక్కుతున్నాడు. నా అక్కచెల్లెమ్మల కుటుంబాలకు అక్షరాలా రూ.2.65 లక్షల కోట్లు నేరుగా వెళ్లింది. నాన్ డీబీటీ పద్ధతిలో ఇళ్ల స్థలాలు, ఇతరత్రా లబ్ధితో మనం చేసిన ఖర్చు రూ.1.10 లక్షల కోట్లు. మొత్తంగా రూ.3.75 లక్షల కోట్లు ఖర్చు చేశాం. అంటే ఏటా రూ.75 వేల కోట్లు. ఇలా ఇంటింటి అభివృద్ధిని చూసి తట్టుకోలేక ఈర్ష్యతో రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని ఇదే ఈనాడు, ఇదే చంద్రబాబు ఎన్నో సందర్భాల్లో వాదించారు. ఇప్పుడు అదే నోటితో.. చెప్పేవన్నీ అబద్ధాలే కదా.. హద్దులెందుకు అని చంద్రబాబు ఆరు వాగ్దానాలు అంటూ వదిలారు. వీటిపై ఏటా మనం ఖర్చు చేస్తున్న దానికి రెట్టింపు అవుతుంది. అప్పుడు రాష్ట్రం ఏమవుతుందో మరి? దీని గురించి అసెంబ్లీలో సుదీర్ఘంగా చర్చించాం. బాబు మేనిఫెస్టోను నమ్మడం అంటే బంగారు కడియం ఇస్తానన్న పులిని నమ్మినట్లుగా ప్రజలందరూ మోసపోతారు.
- ఈ 58 నెలల్లో ప్రజల కోసం 130 సార్లు మీ బిడ్డ బటన్ నొక్కాడు. దేశ చరిత్రలో ఇది ఒక రికార్డు. ఈ ప్రయోజనాలు అందుకున్న ప్రతి ఒక్క కుటుంబం మనకు స్టార్ క్యాంపెయినర్‌గా బయటకు రావాలి. వంద మందికి చెప్పి ఓటు వేయించాలి. ఇందులో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, వలంటీర్ల పాత్ర ఎంతో కీలకం. ఈ ఎన్నికల్లో వేసే ఓటు వచ్చే ఐదేళ్ల వారి భవిష్యత్‌ను ఎలా మారుస్తుందో వివరించాలి.

# భార్యను చంపి.. చెత్త డబ్బాలో పెట్టి

- ఆస్ట్రేలియాలో హైదరాబాదీ దారుణం
- మృతురాలి స్వస్థలం ఏఎస్‌రావు నగర్
- కుమారుడిని నగరంలో వదిలి వెళ్లిన నిందితుడు
- విక్టోరియా పోలీసులకు లొంగిపోయిన వైనం


భర్త అశోక్‌రాజ్, కుమారుడితో శ్వేత (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన వివాహిత శ్వేత ఆస్ట్రేలియాలో దారుణ హత్యకు గురైంది. పాయింట్ కుక్ ప్రాంతంలోని మిర్కా వేలో ఇటీవల ఈ దారుణం చోటు చేసుకుంది. విక్టోరియా బిక్లీలోని కచ్చా రోడ్డు పక్కన చెత్త డబ్బాలో ఉన్న మృతదేహాన్ని విక్టోరియా పోలీసులు గుర్తించారు. తర్వాత హతురాలి భర్తే వచ్చి లొంగిపోవడంతో అతన్ని అరెస్టు చేశారు. మీడియా కథనాల ప్రకారం .. నగరంలోని ఏఎస్ రావు నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నేత బాలశెట్టి గౌడ్ కుమార్తె మధుగాని చైతన్య అలియాస్ శ్వేత కొన్నేళ్ల క్రితం వరికుప్పల అశోక్ రాజ్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. ఇతను కూడా హైదరాబాద్ వాసే అని తెలుస్తోంది. కాగా వీరి పెళ్లిని ఇరుపక్షాల కుటుంబాలూ అంగీకరించలేదని సమాచారం.

**కత్తితో పొడిచి, బెడ్‌షీట్‌లో చుట్టి..**

వివాహానంతరం అశోక్‌రాజ్, శ్వేత ఆస్ట్రేలియాలో ఉంటున్నారు. వీరికి మూడేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. అయితే కొన్నాళ్లుగా భార్యభర్తల మధ్య విభేదాలు నెలకొన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల తమ ఇంట్లోనే శ్వేతను కత్తితో పొడిచి చంపిన అశోక్ శవాన్ని బెడ్‌షీట్‌లో చుట్టి ఆకుపచ్చ రంగు చెత్త డబ్బాలో పెట్టాడు. తన వాహనంలో ఆ డబ్బాను పెట్టుకుని మిర్కా వేకు 82 కిమీ దూరంలో ఉన్న బిక్లీ ప్రాంతంలోని ఓ నిర్మానుష్యమైన కచ్చా రోడ్డు పక్కన పొదల్లో పడేశాడు. అనంతరం తన కుమారుడిని తీసుకుని హైదరాబాద్ వచ్చాడు. బాలుడిని తమ ఇంట్లో వదిలేసి మళ్లీ ఆస్ట్రేలియా వెళ్లిపోయాడు. ఈ లోపు బిక్లీ ప్రాంతానికి చెందిన స్థానికులు అనుమానాస్పదంగా పడి ఉన్న చెత్త డబ్బాను గుర్తించారు. దీంతో విక్టోరియా పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం పరీక్షలకు పంపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన నేపథ్యంలోనే హతురాలు శ్వేత అని, ఆమె భర్త తన కుమారుడితో కలిసి ఇటీవలే హైదరాబాద్ వెళ్లినట్లు గుర్తించారు. అయితే హైదరాబాద్ నుంచి ఆస్ట్రేలియా తిరిగి వెళ్లిన అశోక్ విక్టోరియా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. దీంతో వారు అశోక్‌ను అరెస్టు చేశారు.

**సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా..**

శ్వేత మృతదేహంతో కూడిన డబ్బా పడున్న మార్గం పెద్దగా వినియోగంలో ఉండదని, రోజుకు కేవలం రెండుమూడు వాహనాలు మాత్రమే తిరుగుతూ ఉంటాయని బిక్లీలోని స్థానికులు అక్కడి మీడియాకు చెప్తున్నారు. మిర్కా వే ప్రాంతంలో తరచుగా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనే శ్వేత... ఇరుగుపొరుగు వారికి అవసరమైనప్పుడు, కీలక రోజుల్లో భోజనం తదితరాలను అందజేసేదని తెలుస్తోంది. దీంతో ఆమె హత్య విషయం తెలిసిన స్థానికులు షాక్‌కు గురయ్యారు. శ్వేత వ్యవహారశైలిని ప్రతి ఒక్కరూ స్మరించుకుంటున్నారని ఆస్ట్రేలియన్ మీడియా వెల్లడించింది. ఆమె మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించే అవకాశం లేదని, అక్కడే అంత్యక్రియలు జరుగుతాయని తెలుస్తోంది.

## వైఎస్ జగన్ పాలనలో
# ప్రభుత్వ ఉద్యోగులకు ఎంతో మేలు

- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి
- పి.గన్నవరంలో 'థాంక్యూ సీఎం సర్' నినాదాలతో భారీ ర్యాలీ


సీఎం జగన్‌కు కృతజ్ఞతగా పి.గన్నవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులతో వెంకట్రామిరెడ్డి

పి.గన్నవరం: సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు ఎంతో మేలు జరిగిందని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆయన అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 1.36 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారని కొనియాడారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏపీజీఈఎఫ్) వైస్ చైర్మన్ విప్పర్తి నిఖిల్ కృష్ణ ఆధ్వర్యాన ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో మూడు రోడ్ల సెంటర్ నుంచి దుర్గమ్మ గుడి వరకూ వివిధ శాఖల ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగులకు అండగా నిలిచి, గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసినందుకు 'థాంక్యూ సీఎం సార్' అంటూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. కరోనా వంటి కష్టకాలంలో ఆర్థిక శాఖ అధికారులు వద్దన్నా కొత్త పీఆర్‌సీ ప్రకారం పే స్కేల్ అమలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 50 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను సీఎం జగన్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతోపాటు రాష్ట్రాభివృద్ధికి పాటు పడుతున్న ప్రభుత్వంపై ఎల్లో మీడియా తప్పుడు కథనాలు రాస్తోందని వెంకట్రామిరెడ్డి మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రజలకు వాస్తవాలు చెప్పడానికి 'మన ప్రభుత్వం – మన ప్రగతి' కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

## వికేంద్రీకరణ వైపే ఏపీ ప్రజలు

**బహుజన పరిరక్షణ సమితి నేతల స్పష్టీకరణ**

తాడికొండ: వికేంద్రీకరణ, 3 రాజధానులకు ప్రజలు సిద్ధమని మేదరమెట్ల సభతో తేటతెల్లమైందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 3 రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 1260వ రోజుకు చేరాయి. దీక్షల శిబిరంలో పలువురు మాట్లాడుతూ..కరోనా కష్ట కాలంలోనూ రెండేళ్ల పాటు సీఎం జగన్ అందించిన పాలన దేశంలోనే ఏపీ నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బహుజనులంతా సన్నద్ధమై సీఎంగా వైఎస్ జగన్ విజయం కోసం కృషి చేస్తామని చెప్పారు. రాజధాని పేరుతో తన సామాజికవర్గానికి పెద్దపీట వేసిన చంద్రబాబు.. లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు మాదిగాని గురునాథం, పెద్దింటి విజయ్, పులి దాసు, కుమ్మరవల్లి కిషోర్ బాబు, ఈపూరి ఆదాం, బొలిమేర శామ్యూల్, కారుమూరు పుష్పరాజు, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

## విశాఖ చేరిన పూరీ–విశాఖ వందేభారత్ రైలు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): పూరీ–విశాఖపట్నం–పూరీ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం ఉదయం 11.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంది. పూరీ–విశాఖపట్నం మధ్య ఈ రైలు ట్రయల్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుంది. దీన్ని ఈ నెల 12వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.



విశ్వాసం: సత్యం ఏమిటో తెలుసుకోవాలని కోరుకోక పోవడం!
– ఫ్రెడరిక్ నీషే



సాక్షి

సోమవారం, 11 మార్చి 2024

# మల్లెల వేళ... వెన్నెల మాసం

'వసంతం' అన్న మాటే ఎంత మృదువుగా చెవిని తాకుతుంది! ఆ మాటలో ఒక్క పరుషాక్షరం కానీ, ద్విత్వాక్షరం కానీ, సంయుక్తాక్షరం కానీ లేవు. ఎందుకుంటాయి? వసంతమంటే, ప్రకృతి మోహపరవశయై రంగురంగుల పూలతో సిగను అలంకరించుకుని నూతన సృష్టికి సంసిద్ధమయ్యే కాలం కదా! స్త్రీపురుషుల ఎదలో తీపి ఊహలు రేపి లలితలలితం చేసే మధుమాసం కదా! వేదాలలో సామంగా, ఛందస్సులలో గాయత్రిగా, మాసాలలో మార్గశీర్షంగా తనను చెప్పుకున్న కృష్ణ పరమాత్మ; ఆరు ఋతువులలోనూ సర్వశ్రేష్ఠం కనుకనే కుసుమాకరమైన వసంతమూ తానేనన్నాడు. సమృద్ధికి సంకేతమైన ఆమని, ఋతుపతి, కామవల్లభము, పికబాంధవము, పూలకారు అనిపించుకునే వసంతఋతువుకు రారాజు మన్మథుడైతే; అతని చెలికాడూ, సేనానీ వసంతుడట! అరవిందం, అశోకం, మామిళ్ళు, కొత్త మల్లెలు, నీలోత్పలాలనే అయిదూ మన్మథుని బాణాలట! అవి ప్రేయసీప్రియుల ఎడదను తాకి వలపు పులకలతో తారెత్తిస్తాయట!

ఆదికవి నుంచి ఆధునికుని వరకూ వసంత రుతుగానం చేయని కవికోకిల ఎవరుంటారు? సీతావియోగ దుఃఖంతో అడవుల వెంబడి పడిపోతున్న రాముణ్ణి వసంతశోభ ఆకర్షించడమే కాదు, మరింతగా దుఃఖవివశుణ్ణి చేసినట్టు వాల్మీకి వర్ణిస్తాడు. పంపాతీరానికి చేరేసరికి ఆ సరస్సు పద్మాలు, ఉత్పలాలు, చేపలతో కనువిందు చేసింది. అందులోని నీళ్ళు వైడూర్యంలా స్వచ్ఛంగా మెరిసిపోతున్నాయి. చుట్టుపక్కల అడవి అంతటా ఎత్తైన చెట్లు, పర్వతాలు పచ్చదనంతో ముచ్చట గొలుపుతున్నాయి. పూర్తిగా పుష్పించి ఉన్న చెట్లను లతలు గాఢాలింగనం చేసుకుని ఉన్నాయి. రకరకాల చెట్ల మధ్యలో నీలి, పసుపురంగు గడ్డిభూములు రంగురంగుల పూలదుప్పటి కప్పుకున్నట్టున్నాయి. ఆహ్లాదకరమైన పిల్లగాలితో ఎల్లెడలా పూలు, పండ్ల పరిమళాన్ని గుప్పిస్తూ వసంతం ఎంతో కొత్తగానూ, స్వాతిశయంతోనూ భాసించింది. మేఘాల్లోంచి పడే వర్షంలా అదేపనిగా పూలవాన కురుస్తోంది. ఆదికవిది ఎంత సుసూక్ష్మ పరిశీలనంటే, కొన్ని పూలు అప్పటికే రాలిపోగా, కొన్ని రాలి పోతూపోతూ ఉన్నాయట. ప్రతిచోటా గాలి పూలతో పరాచికాలు ఆడుతూనే ఉందట. కాళిదాసు ఋతుసంహార కావ్యాన్ని గ్రీష్మంతో ప్రారంభించి వసంతంతో ముగిస్తాడు. అప్పుడు చెట్లు పూల తోనూ, నీళ్ళు పద్మాలతోనూ, స్త్రీలు ప్రియసమాగమ కాంక్షతోనూ, గాలి పూలగంధంతోనూ, సాయంత్రాలు సుఖం గొలిపేలానూ, పగళ్ళు పరమరమ్యంగానూ ఉండి సమస్తమూ సుమనోహరంగా ఉందంటాడు. మగకోకిల బాగా చిగిర్చిన మామిడి చిగుళ్ళు మెక్కి మదించి తనకు ప్రియమైన ఆడకోకిలను ముద్దాడుతున్నట్టూ; తుమ్మెద కమలాల్లోని పూదేనె గ్రోలుతూ ఝుంకారం చేస్తూ ఆడుతుమ్మెదను ఆకర్షించే నర్మవ్యాపారాలు చేస్తున్నట్టూ వర్ణిస్తాడు.

ప్రతిపద్య చమత్కృతికి పెట్టిన పేరైన చేమకూర వెంకటకవి తన 'విజయవిలాస' కావ్యంలో వసంతుడికీ, చంద్రుడికీ మధ్య స్పర్ధను కల్పించి తన ఊహావైభవాన్ని అంచులు దాటిస్తాడు. వసంతుడు వస్తూనే మోడువారిన చెట్లను చిగురింపజేసి రసవంతమైన ఫలపుష్పాలతో నలువైపులా సుగంధాలను వ్యాపింపజేసినా, అవి వట్టి చెట్లే కదానని చెప్పి చంద్రుడు మెచ్చలేదట. ప్రసన్న, సుకుమారమైన తన వెన్నెలజల్లుతో ఏకంగా రాళ్ళనే కరిగింపజేశాడట. చేమకూరకు మరింత చవిని జోడించే మరో పద్యం మన్మథుడి జైత్రయాత్రను చెబుతుంది. రాజు ఎక్కడికైనా వెడుతున్నప్పుడు సూర్యచంద్రుల బొమ్మలున్న పొడవాటి కర్రలను పట్టుకుని పరిచారకులు ముందునడవడం పరిపాటి కాగా; మన్మథుడు జగజ్జేత కనుక తూర్పు, పడమటి కొండలపై ప్రకాశించే సూర్యచంద్రులనే నేరుగా రాజలాంఛనం చేసుకుని దిగ్విజయానికి బయలుదేరాడట. వసంతాగమనాన్ని ఎలా పోల్చుకోవాలో విశ్వనాథవారు తన 'ఋతుసంహార' కృతిలో అందంగా ఏకరవుపెడతారు. కౌగిలింత వేళ ఉద్రిక్త అయిన ప్రియురాలి ఎద చెమర్చినా, చన్నీటిస్నాన సౌఖ్యం వల్ల ముక్కుపుటాలలో చెమరింపు పుట్టినా, పేరంటానికి వెళ్ళే పిన్నబాలిక వాలుజడలో మల్లెమొగ్గ కనబడినా, వంగిన వేపకొమ్మకు కావి చిగురుపట్టి పక్క ఈనెకు పూతపట్టినా, హఠాత్తుగా ఓ రోజున పొద్దెక్కినవేళ దూరపు కోన నుంచి కోకిలస్వరం వినిపించినా వసంతం అడుగుపెట్టిందన్న మధురోహ కలుగుతుందంటారు. ఆపైన, కొత్తగా జతకట్టిన కోకిలమ్మ పెంటికై నూత్నయవ్వనోద్వేగంతో వేగిపోతూ వసంతవనాంత వీథిలో ముక్కున చిదమని మామిడి చిగురు లేదంటారు. శేషేంద్ర ఏం తక్కువ! 'ఎక్కడ చూసినా స్వచ్ఛకాంతులీనుతూ సంతోషంలో ముంచే జాజులు, మల్లెలు, తీగసంపెంగలు, కొదమ గులాబులతో విశ్వదిశాంతరాళాన్ని సుమసముద్రం చేస్తున్నది– ఇదేనా మధుమాసమంటే' అని తన 'ఋతుఘోష'లో ఆశ్చర్య, పారవశ్యాలను అక్షరీకరిస్తారు. 'ఈ ఆకాశమూ, ఈ మహా సముద్రాలూ, ఈ భూమండలమూ, ఈ తరుప్రపంచమూ ఈ విశ్వమంత అంతర్గత శోభతో ఉద్రూతలూగిస్తున్నాయి; ఊహావిహంగం ఉత్కంఠతో ఎగిరిపోవాలనుకుంటోం'దంటారు. విశ్వమందిరంలో కన్నులపండువగా కొలువైన పురుషునికీ; పూవులతో, ఎర్రని చిగుళ్లతో సింగారించుకుని సొంపుగులికే ప్రకృతికీ మధ్య రాసక్రీడగా వసంతారంభ కాలాన్ని రూపుకడతారు. ఇంకోవైపు, జీవజాల మనే ఒడ్లను ఒరుసుకుంటూ ప్రవహించే ఈ వాసంతరస స్రవంతి వేళ, ప్రియురాలితో కలసి సరస్తీ రాలకు, పూపొదల చాటుకు, తోటలకు వెళ్ళే అవకాశం లేకుండా మధ్యాహ్నకాలాల్లో చేలల్లో మగ్గి పోయే శ్రామికజనాలపై జాలితో కరిగినీరవుతారు.

వసంతం మామూలుగా కాదు, ఉత్సవంలా వచ్చి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. జీవుల మనుగడను ఆహ్లాదపు ఊయెల ఎక్కించి ఊపి విడిచిపెడుతుంది. వసంతానుభవపు మత్తుకు, గమ్మత్తుకు చిత్తు కాని జీవి ప్రపంచంలోనే ఉండడు. మన్మథుడా మజాకానా! ఆయన జగత్తుకే రారాజు కదా!!

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.పాడ్యమి ప.1.10 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.2.06 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ప.12.45 నుండి 2.13 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.34 నుండి 1.22 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.45 వరకు, **అమృతఘడియలు:** రా.9.37 నుండి 11.10 వరకు.

**సూర్యోదయం :** 6.16
**సూర్యాస్తమయం:** 6.04
**రాహుకాలం :** ఉ.7.30 నుండి 9.00 వరకు
**యమగండం :** ఉ.10.30 నుండి 12.00 వరకు

# పరమ కంగాళీ కథానాయకుడు

కామెంట్



కరణ్ థాపర్

**ఒక దేశానికి హైకమిషనర్‌గా, విదేశాంగ కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తి నుంచి తన వృత్తిపరమైన అనుభవాల రచనలను ఆశిస్తాం. కానీ కృష్ణన్ శ్రీనివాసన్ ఈ సంప్రదాయానికి పూర్తి భిన్నంగా డిటెక్టివ్ రచయితగా అవతరించారు. అయితే ఒకటి, ఆ రచనల్లోనూ ఆ యా పాత్రలు ఆ వృత్తి తాలూకు జీవితాన్ని ప్రతిఫలిస్తాయి. ఒక్కోసారి అవి రచయిత వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా కూడా కనిపించవచ్చు. క్రిస్ రచనల్లోని అపరాధ పరిశోధకుడు పదవీ విరమణ పొందిన సోమాలియా రాయబారి. పేరు మైఖేల్ మార్కో. మనకు తెలిసిన హీరో ఎలా ఉంటాడో అలా ఉండడు. తెర వెనుక ఉండి కథ నడిపిస్తాడు. అధికారాలు ఉండవు. కానీ అనధికార యుక్తి సామర్థ్యాలతో నేర రహస్యాలను ఛేదిస్తుంటాడు. అతడు తొడుక్కునే సూట్లు నలిగి ఉంటాయి. అతడి 'టై'లు నిటారుగా ఉండవు. షూ లేసులు వదులుగా కట్టి ఉంటాయి. క్రిస్ అతడిని 'రెట్రో–కేయాటిక్' (పాతకాలపు పరమ కంగాళీ) అంటాడు. మాజీ విదేశాంగ కార్యదర్శుల నుంచి మీరు ఇలాంటి రచనలను ఊహించనే లేరు.**

ఒక పుస్తకం ఆ పుస్తక రచయిత వ్యక్తిత్వాన్ని ఎంత వరకు వెల్లడిస్తుందో మీరెప్పుడైనా ఆలోచించారా? బహుశా ఆ రచయిత గురించి ముందే మీకు తెలిసి ఉంటే తప్ప మీరెప్పటికీ ఆ వైపుగా ఆలోచించరు. ఒకవేళ అలా ఆలోచిస్తే కనుక ఆ వచ్చే ఫలితం మిమ్మల్ని ఆశ్చర్యానికి గురి చేయగలిగినదై ఉంటుంది. కృష్ణన్ శ్రీనివాసన్ విషయంలో సరిగ్గా ఇలాగే జరుగుతుంది.

క్రిస్, అదే... కృష్ణన్ శ్రీనివాసన్... నలభై ఏళ్లుగా నాకు మిత్రుడు. మొదట లాగోస్‌లో మేము కలుసుకున్నాం. అప్పుడాయన హై కమిషనర్. నేను లండన్ పత్రిక 'ది టైమ్స్'కు కరస్పాండెంట్. ఆయన విదేశాంగ కార్యదర్శిగా ఎదిగాక మా స్నేహం కూడా వికసించి విప్పారింది.

రాయటం అనేది క్రిస్‌కి సంతోషం కలిగించే సంగతని నాకు తెలుసు కానీ, అపరాధ పరిశోధన రచనల్లో ఆయన ఆరితేరినవారని నాకెన్నడూ అనిపించలేదు. పదవీ విరమణ అనంతరం క్రిస్ ఏడు పుస్తకాలు రాశారు. మాజీ విదేశాంగ కార్యదర్శుల నుంచి మీరు ఇలాంటివి ఊహించనే లేరు. లేక, నేనేమైనా పొరపడ్డానా?


క్రిస్ రచనల్లోని అపరాధ పరిశోధకుడు పదవీ విరమణ పొందిన సోమాలియా రాయబారి. పేరు మైఖేల్ మార్కో. మనకు తెలిసిన హీరో ఎలా ఉంటాడో అలా ఉండడు అతడు. తెర వెనుక ఉండి కథ నడిపిస్తాడు. అధికారాలు ఉండవు. కానీ అనధికార యుక్తి సామర్థ్యాలతో నేర రహస్యాలను ఛేదిస్తుంటాడు. అతడు తొడుక్కునే సూట్లు నలిగి ఉంటాయి. అతడి 'టై'లు నిటారుగా ఉండవు. షూ లేసులు వదులుగా కట్టి ఉంటాయి. క్రిస్ అతడిని 'రెట్రో–కేయాటిక్' (పాతకాలపు పరమ కంగాళీ) అంటాడు. అంతేకాదు, క్రిస్ చెబుతున్న దానిని బట్టి... అతడి దుస్తులను అందుడైన ఒక టైలర్ వాడుకగా కుడుతుంటాడు.

మార్కో... జేమ్స్ బాండేమీ కాదు. అందమైన స్త్రీల కోసం అతడు కానీ, అతడి కోసం ఆ అందమైన స్త్రీలు కానీ పరుగులు పెట్టటం ఉండదు. అతడు అలవాటుగా సేవించే మద్యం టమాటా రసం. 'మార్టినీ'ని ఏం చేసుకోవాలో అతడికి తెలియదు. అయితే "అతడి నిశిత దృష్టికి సంబంధించి పైపైన కనిపించేదంతా మనల్ని పక్కదారి పట్టించేదే". అతడు ప్రతీదీ చూస్తాడు, అత్యంత ఆశ్చర్యాన్ని కలిగించే ముగింపులకు వచ్చేస్తాడు. అతడిని ఊహించుకుంటే నాకు అగాథా క్రిస్టీ అపరాధ పరిశోధక నవలల్లోని మిస్ మాపుల్ అనే కల్పిత పాత్ర స్ఫురించింది.

మార్కో వంటి ఒక వ్యక్తిని క్రిస్ ఆరాధిస్తాడని నేనెప్పుడూ ఊహించలేదు. అతడి పట్ల గొప్ప ఇష్టంతో అతడి గురించి రాస్తాడని కూడా అనుకోను. క్రిస్ స్నేహితులుగా నేను ఎరిగిన వారంతా మార్కో తరహాకు పూర్తిగా భిన్నమైనవారు. నిజానికి క్రిస్ కూడా అలాంటి వ్యక్తిని వ్యతిరేకిస్తాడు.



కృష్ణన్ శ్రీనివాసన్





నేను కనుగొన్న మరొక సంగతి... క్రిస్ చూపు మిక్కిలి లోతైనదని. వస్త్రధారణను బట్టి ఎలాంటి వారో చెప్పగల నైపుణ్యం ఆయనకు ఉంది. ఆయన తాజా పుస్తకం 'రైట్ యాంగిల్ టు లైఫ్' లోని ఒక పురుష పాత్ర వర్ణన ఎలా ఉందో చూడండి: "రెండు రోజులుగా గడ్డం గీయని ఆకర్షణీయమైన ముఖం, పదునైన చెంప ఎముకలు, లేత గోధుమ రంగు కళ్లు, నుదుటిపై పడుతున్న దట్టమైన ముంగురులు, టమాటా రంగు ఓపెన్ నెక్ డ్రెస్ మీదకు తటస్థ వర్ణంలోని పియాహ్ కార్డాన్ లినన్ జాకెట్, చర్మానికి అంటుకుపోయే చినోస్ ప్యాంట్స్, సాక్సు వేయని స్వేడ్ లోఫర్స్ పాదరక్షలు... ఒక్క మాటలో ఒక మేల్ మోడల్ టైప్" అంటూ... మనిషిని సాక్షాత్కరింపజేసినట్లే రాస్తాడు క్రిస్.

స్త్రీ పాత్రలను క్రిస్ మరింత మెరుగ్గా వర్ణిస్తాడు. తాజా పుస్తకంలో... తన కథ చెప్పుకుంటూ పోయే వ్యాఖ్యాన పాత్ర కోయెల్ దేవ్... తనను తాను దృశ్యమానం చేసుకుంటూ: "ఒక చక్కటి సాధారణ వస్త్రధారణలోకి నేను మారిపోయాను. హారీమ్ ప్యాంట్స్ మీదకు పొడవాటి చేతుల వి–నెక్ సిల్కు బ్లవుజ్, దాని పైన డెనిమ్ జాకెట్ తొడుక్కుని, సెయింట్ వాలెంటైన్ లెదర్ షూజ్ ధరించాను. నా ముత్యాల చెవి దుద్దులు తీసి పెట్టుకున్నాను. బెల్లా వీటా స్ప్రేను మెడపైన, చెవుల వెనకాల చిమ్మినట్లుగా చల్లుకున్నాను. క్లినిక్ ప్లమ్ లిప్‌స్టిక్‌తో నా పెదవులను అద్దుకున్నాను" అని చెప్పుకుంటూ పోతారామె.

క్రిస్ తనకు అప్పగించిన రాయబార విధుల్ని ఏ విధంగా పూర్తి చేసిందీ రాసి పంపేటప్పుడు కూడా ఇదే విధమైన వివరణాత్మకతను పాటించేవారా అని నేనిప్పుడు ఆశ్చర్యానికి లోనవుతున్నాను. తను సంభాషించిన వారిని ఇంత సూక్ష్మంగానే వర్ణించి ఉంటారా? ఆయన విదేశాంగ కార్యదర్శిగా ఉన్నప్పుడు మీరు ఆయన ఎదురుగా కూర్చొని ఉండగా మిమ్మల్ని కూడా ఇంతే నిశితంగా అంచనా వేయడాన్ని మీరు పసిగట్టారా?

ఏమైనా ఇది కేవలం తేరిపార చూడటం మాత్రమే కాదు. సరిగ్గా అంచనా వేయటం కూడా! ఒక మూసలో కాక, వ్యక్తులకు వేర్వేరుగా ఉండే ప్రత్యేక సూక్ష్మాంశాలను కొద్దిమంది రచయితలు మాత్రమే వడకట్టగలరు. చాలామంది లేస్–అప్స్(లేసులు పైకి కనబడేట్టుగా ఉండే షూలు)కు, మొకసిన్స్(లేసులు ఉండని షూలు)కు వ్యత్యాసాన్ని గుర్తించగలరు. కానీ ఎంతమందికి ఆక్స్‌ఫోర్డ్ షూజ్‌కి, బ్రోగ్స్ షూజ్‌కి తేడా తెలిసుంటుంది?

నేనేం చెబుతున్నదీ మీకు అర్థం కావడం మొదలైందా? క్రిస్ తాజా రచనలోని కాల్పనికత ఆయన వ్యక్తిత్వంలోని ఒక కోణాన్ని బహిర్గతం చేసింది. అది – మీరాయన్ని కేవలం రాయబారిగా, లేక సాయంత్రపు పార్టీలను ఇష్టపడే విలాస పురుషుడిగా మాత్రమే చూస్తుంటే కనుక మీరెప్పటికీ తెలుసుకోలేనిది!

ఒక కాక్‌టైల్ పార్టీని ఆయన వర్ణించిన తీరు అలాంటి పార్టీల పట్ల ఆయన ఎంతగా జాగ్రత్తగా ఉంటారో సూచనప్రాయంగా తెలియజేస్తుంది. ఇది గమనించండి: "అతిథులు మెల్లగా దగ్గరయ్యారు. తెచ్చిపెట్టుకున్న హృదయపూర్వకతల్లో కలిసిపోయారు. ప్రతి ఒక్కరూ తిరగడమే పనిగా తిరుగుతున్నారు. మళ్లీ మళ్లీ వాళ్లే వాళ్లే నిర్లక్ష్యంగా కలిపిన చేతుల్లోంచి జారి పడుతున్న పేకముక్కల్లా ఉన్నారు. పానీయాలు, నోటితో కొరికి తినగలిగినంత పరిణామంలోని నంజుళ్లు ఉన్న ట్రేలను మౌనంగా అందిస్తున్న వెయిటర్‌లు, వారి వెనుక – అయోమయ వివరీకరణలు, అస్పష్ట ఉపోద్ఘాతాలు, అర్థరహితంగా చెప్పిందే చెప్పడాలు, నిర్జీవ కరచాలనాలు, జవాబులే లేని వాకబులు, ఉత్సాహపూరిత వాతావరణ ప్రస్తావనలు, హఠాన్మౌనాలు, చిత్తశుద్ధి లేని కుశల ప్రశ్నలు..."

నిజంగానే నేను క్రిస్‌కి పార్టీలంటే ఇష్టం అనుకున్నాను. ఎంత పొరపడ్డాను! కానీ నేను చెప్పినట్లుగా – ఒక మనిషిలో మొదట మీరు అర్థం చేసుకున్న దాని కంటే చాలా ఎక్కువే ఉందని తెలుసుకోడానికి మీరు ఆ మనిషి రాసిన పుస్తకం చదవాలి. సమస్యేమిటంటే ఈసారి క్రిస్ ఎదురైనప్పుడు నేనేమి ధరించాలో నాకు తెలీదు. అలాగే నేనేం చెప్పాలన్నది కూడా!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

### ఏం లాభం?



చెడ్డ మనుషులు సమాజానికి హాని కలిగిస్తారు. కానీ సోకాల్డ్ మంచి మనుషుల స్వార్థం లేదా ఆర్మ్–చైర్ నైతికత సమాజానికి ఇంకా ఎక్కువ నష్టం కలిగిస్తాయి.

– స్వామి సమర్పణానంద, ఆధ్యాత్మిక గురువు

### పెళ్లి మంచిది!



మంచి అమ్మాయిని పెళ్లి చేసుకుంటే మగవాళ్ల జీవితం గొప్పగా ఉంటుంది. సోషల్ డేటా ఇదే చెబుతోంది. అమ్మాయిలకు కూడా ఇది బాగుంటుంది. దీనికి భిన్నంగా చెబుతున్నవాళ్లు సత్యం చెప్పడం లేదని అర్థం.

– లైలా రోజ్, యూఎస్ అబార్షన్ల వ్యతిరేక యాక్టివిస్ట్

### అందరి కోసం...



హక్కులు, సమానత్వం, స్వేచ్ఛ, సార్వభౌమత్వం లాంటి పాశ్చాత్య భావనలు ఎప్పుడూ ప్రపంచం మొత్తానికి ఉద్దేశించినవి కావు. వలసవాద ఉద్యమాల సుదీర్ఘ పోరాటమే విశ్వజనీన విలువల కోసం నిలబడింది, రక్తమోడింది! అది ఇంకా కొనసాగుతూనే ఉంది.

– జాసన్ హికెల్, ప్రొఫెసర్

### తెలియకా?



జనాలు విమానాల్లో ఆల్కహాల్ ఎందుకు తాగుతారో అర్థం కాదు. వాళ్లు అప్పటికే డీహైడ్రేట్ అయివుంటారు. శరీరంలోని కణాలు ఆ ఉన్న కొన్ని నీటి బిందువుల కోసం తహతహలాడుతున్నప్పుడు వాటిని కూడా ఎందుకు లేకుండా చేయడం?

– మెలిస్సా చెన్, జర్నలిస్ట్

### ఇప్పటికీ అదే ఫీలింగ్...



నేను 1990ల నుంచీ బీజేపీ ఎకోసిస్టమ్‌లో ఉన్నాను. అద్వానీ రథయాత్రకు మద్దతు నిచ్చాను. నాకు అప్పుడు ఎదురైన అత్యంత సాధారణ ప్రశ్న: ఆ జనంతో ఈ 'భోంగ్' (విద్యావంతులైన మధ్యతరగతి బెంగాలీలకు వాడే పదం) ఎలా ఉండగలడు? హిందూ అనుకునేది ఏదైనా వెనుకబాటు, తిరోగమనం అనే భావన అందులో ఇమిడివుంది. అలాంటి (వామపక్ష) దుర్మతులు ఇంకా ఉన్నాయి. వాళ్ల ఉనికి క్రమంగా లేకుండా పోతున్నప్పటికీ, భోంగ్ లెఫ్టిస్టులు తమను తాము అధికులమని భావిస్తారు.

– స్వపన్ దాస్‌గుప్తా, రాజ్యసభ మాజీ ఎంపీ

### ట్రోల్ ఆర్మీ



మొత్తం సోషల్ మీడియా మీద, అది ఏ వేదికైనా సరే, పూర్తిగా బీజేపీ ఆధిపత్యం కొనసాగుతోంది. ఒక విజ్ఞత గల అభిప్రాయం ఏదైనా పెట్టడం కష్టమవుతోంది. వెంటనే ట్రోల్ సైన్యం దాడికి దిగుతుంది. ఈ సైన్యం ఏమీ ఉచితంగా పనిచేయడం లేదు, దానికోసం వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు.

– గౌరవ్ గర్గ్, ఆంట్రప్రెన్యూర్

### ఇక్కడికా వెళ్లేది?



నేను ఈమధ్యే గోవా వెళ్లాను. నా పరిశీలనలు: 1. అన్నీ ఖరీదెక్కువ. ట్యాక్సీ కిరాయి నుంచి హోటళ్ల దాకా. పైగా 'తీసుకో లేదంటే వదిలెయ్' వైఖరి. 2. ఆహారం ఘోరం (నేను ఇంకా కోలుకుంటున్నాను). కొన్ని మినహా వదిలేస్తే అంతటా అపరిశుభ్రత. 3. రాష్ట్రం నడిచేదే టూరిజం మీద అయినప్పటికీ టూరిస్టులకు సౌకర్యాలు తక్కువ.

– సందీప్ థాపర్, టీవీ ప్యానెలిస్ట్

ఇన్ బాక్స్

## విరాళాలు ఇవ్వడమే కాదు...

ఇటీవల కాలంలో పలు సందర్భాలను పురస్కరించుకుని పూర్వ విద్యార్థులు వారి వారి పాఠశాలలు, కళాశాలలకు భారీగా నిధులు సమకూరుస్తున్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి అండగా నిలుస్తున్నారు. మారుతున్న కాలానికి దీటుగా తాము చదువుకున్న సంస్థలు కూడా ఎదగాలనే తపనతో, నేటి తరం బంగారు భవిష్యత్తు కోసం కొండంత అండగా నిలిచి స్ఫూర్తినిస్తోంది. ప్రైవేట్ రంగంలో పేరు పొందిన బిట్స్, మేనేజ్మెంట్ కోర్సు సంస్థల పూర్వ విద్యార్థులు ఇంకొంచెం ముందుకు వెళ్ళి ఆ యా సంస్థల ప్రస్తుత విద్యార్థులకు మంచి ఉద్యోగం లభించేలా సహాయం అందిస్తున్నారు. మార్కెట్‌లో ఉద్యోగ, ఉపాధి కల్పనలో స్తబ్ధత, మాంద్యం, అననుకూల వాతావరణ పరిస్థితుల్లో వారి వారి సంస్థలకు అండగా ఉండి కొండంత భరోసాను కల్పిస్తున్నారు.

పూర్వ విద్యార్థులు చేస్తున్న ఈ కృషిని అభినందించాల్సిందే. అయితే ఆ యా సంస్థల మానవ వనరులు కాలగమనంలో ఎదుగుతూ వివిధ రంగాలలో సమాజంలో చూపిన ప్రభావం గురించి అక్షర బద్ధం చేయటం కూడా చాలా అవసరం. అది భావి తరాలకు స్ఫూర్తినిస్తుంది. ప్రభుత్వ సంస్థలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో చదువుకున్న సగటు, దిగువ మధ్యతరగతితో పాటు అట్టడుగు వర్గాల పిల్లలు అసమానంగా ఎదిగిన తీరును రికార్డ్ చేసి భద్రపరచడం గురించి ఆలోచించాలి. అలా కాకుండా నిర్లక్ష్యం వహిస్తే వేటగాడు రాసినదే చరిత్రగా మిగిలిపోతుంది. అలూమ్నీ సంఘాలూ, అలూమ్నీ ట్రస్టులూ తప్పనిసరిగా ఈ పనికి పూనుకోవాలి.

ఈ విషయంలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఒక అడుగు ముందుకు వేసి ఆదర్శంగా నిలిచింది. ఆ కళాశాల ప్లాటినం జూబ్లీని పురస్కరించుకుని 'ఐవీ సుబ్బారావు స్మారక కమిటీ' పేరుతో కొందరు పూర్వ విద్యార్థులు 75 సంవత్సరాల కళాశాల చరిత్రను 'ఒక నేల.. అనేక ఆకాశాలు'గా తీసుకు వచ్చి నవ చరితకు శ్రీకారం చుట్టారు. మూడు సంకలనాలు తీసుకు వచ్చారు. వీరిని రోల్ మోడల్‌గా తీసుకుని అన్ని సంస్థలూ ఈ పని చేపట్టాలి.

– వలేటి గోపీచంద్, హైదరాబాద్

# తెలుగు భాష గౌరవం పెరగాలంటే...

అభిప్రాయం



వాగుమూడి లక్ష్మీ రాఘవరావు

మన తెలుగు సాహిత్యంలో, తెలుగు భాషలో వేద పురాణేతిహాసాల పారిభాషిక పదజాలం, పూజాది కార్యక్రమాలకు సంబంధించిన పారిభాషిక పదజాలం, వ్యవసాయ సంబంధ పారిభాషిక పదజాలం, కుల వృత్తులకు సంబంధించిన పారిభాషిక పదజాలం కొంత ఉంది. అయితే ఇది ఆధునిక సమాజానికి ఏమాత్రం సరిపోదు. ఆధునిక సమాజంలో రకరకాల వైద్య సంబంధ, విద్యా సంబంధ, బ్యాంకు సంబంధ, షాపులకు సంబంధించిన, మరెన్నో విషయాలకు సంబంధించిన పారిభాషిక పదాలు ఆంగ్లంలోనే ఉంటున్నాయి. నేటి జనం ఆయా పదజాలం మొత్తం అనుభవంలోకి తెచ్చుకుంటే చాలు, అంతో ఇంతో కొంత ఆంగ్లం మాట్లాడటం వచ్చేస్తుంది. ఇలాంటి నేపథ్యంలో ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండాలన్న వాదన అశాస్త్రీయం. పేదవాడు ఈ ఆధునిక ప్రపంచంలో తన బిడ్డలు మోసపోకూడదని ఇంగ్లీషు మీడియంలో చదివించడానికి సిద్ధపడితే అది అశాస్త్రీయం అంటున్నారు. అలా అనేవారు మాత్రం తమ బిడ్డలకు ఇంగ్లీష్ మీడియం విద్యను అందిస్తున్నారు.

ఈ వాస్తవాలను కళ్ళార చూస్తుంటే మన సంప్రదాయ తెలుగు కవులూ, రచయితలూ వివిధ రంగాలకు చెందిన స్థితిపరులూ పక్షపాత ధోరణిలో వ్యవహరిస్తున్నారని సులభంగా తెలిసిపోతుంది. మన గత తెలుగు పండితులు ఎక్కువ శాతం తమ భావాజాలాన్ని పద్య, గద్య, గేయ ప్రక్రియల్లో కుప్పించినంతగా, సశాస్త్రీయ తెలుగు పారిభాషిక పదజాలాన్ని సృష్టించడానికి తమ దృష్టి పెట్టలేదన్నది అక్షర సత్యం. ఎందరెందరో మహానుభావులు తెలుగు సాహితీ ప్రపంచంలో శతావధానులుగా, అష్టావధానులుగా రకరకాల ప్రక్రియలలో పుస్తకాలు రాసి వివిధ బిరుదులతో కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించారు. కానీ గణిత, భౌతిక, రసాయన, జీవ శాస్త్రాదుల అభివృద్ధికి వీరి మేధ ఉపయోగపడలేదు. ఆ యా సైన్స్, టెక్నాలజీ రంగాలలో ముందుకు వెళ్లాలంటే ఇంగ్లీష్ భాషలోనే



సంబంధిత పుస్తకాలు ఉంటాయి. అందుకే ఆంగ్ల మాధ్యమం ఈ పోటీ ప్రపంచంలో పిల్లల మనుగడకు ఎంతో ఉపయోగపడుతుంది. సంస్కృత భాష ప్రభావంతో తెలుగు భాషా సాహిత్యం మహోన్నతంగా అభివృద్ధి చెందింది. అయితే నేల విడిచి సాము చేసి నట్లు మూలాలను విడిచి భావజాల సమరాలతో కాలం గడిపింది.

మనకు ఎందరెందరో ఋషులు, మహర్షులు, బ్రహ్మర్షులు, దేవర్షులు ఉన్నారు. వారు చెప్పినవన్నీ గొప్ప అనుకోవడం ఎంత పొరపాటో, వారు చెప్పిన దానిలో ఏం లేదనుకోవడం అంతకు మించిన పొరపాటు అవుతుంది. వారు చెప్పిన అంశాల మూలాల్లోకి వెళ్ళి, ఆ మూలాలను తెలుగు పద్యాల్లోనూ, కవితలలోనూ, పాటలలోనూ, వచనాల్లోనూ నేటి విద్యార్థులకు అందించగలిగితే తెలుగు భాషకు మంచి గౌరవమే దక్కుతుంది. ఇంగ్లీషు మీడియానికి దీటుగా నిలబడుతుంది. అలా కాకుండా పూర్వీకులు చెప్పిన పద్యాలనే చెబుతాము. వారి భావాలనే ఆధునిక సమాజానికి అనుకూలంగా చెబుతాము అంటే నేటి విద్యార్థులు అవి వినడానికి సిద్ధంగా లేరు. భారతదేశ విద్య విదేశీ సంస్కృతికి బానిసవుతుందని కొందరు ఆవేశపరులు ఆంగ్లాన్ని దుమ్మెత్తిపోస్తూనే వారి బిడ్డలను మాత్రం ఇంగ్లీష్ మీడియంలోనే చదివిస్తున్నారు.

భారతదేశం మన మాతృభూమి. ఇది అన్ని సంస్కృతులనూ సశాస్త్రీయంగా చూసిన భూమి. కాలాన్ని నమ్మిన భూమి. కొందరు కట్టుకథలు ఎన్ని పుట్టించినా అవి కాలం ముందు తలవంచక తప్పదు. కాబట్టి విద్యా ప్రపంచాన తెలుగు భాషకు గౌరవం పెరగాలంటే ఇంగ్లీష్ మీడియం తప్పక ఉండాలి.

అప్పుడే మన తెలుగు పండితుల పరిశోధన, మేధా సామర్థ్యాలు కేవలం కవిత్వంలోనే కాక, తెలుగు భాష పారిభాషిక పద రచనకు ఉపకరిస్తాయి. కేవలం సాహిత్యానికి ఉపయోగ పడే భాషకు మనుగడ తక్కువ అని ఏనాడో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అన్నారు.

వ్యాసకర్త విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు
మొబైల్: 98494 48947

## ఇది శుభాల మాసం

రమజాన్ మాసం వచ్చేసింది. ఇది వరాల వసంతం. పవిత్ర రమజాన్‌లో అన్నీ శుభాలే. మొదటి పదిరోజులు కారుణ్య భరితమైనవి కాగా రెండవ పదిరోజులు క్షమాపణ దినాలు. ఇక మూడవ పది రోజులు నరకాగ్ని నుండి విముక్తి ప్రసాదించేవి. ఉపవాసం ప్రారంభం కాగానే దైవకారుణ్యం వర్షించడం మొదలవుతుంది. పదకొండో రోజు (రెండవ దశ)లోకి ప్రవేశించగానే దైవం తన దాసుల తప్పులను క్షమించి వేస్తాడు. మూడవ దశలోకి చేరుకోగానే నరక భయం నుండి విముక్తి కలుగుతుంది.



దైవాదేశాలను పాటిస్తూ, సత్కార్యాలు ఆచరిస్తూ, దుర్మార్గాలకు దూరంగా ఉండే వారికి ప్రతి నెల, ప్రతి రోజు, ప్రతి క్షణమూ కారుణ్య భరితమే. అయితే రమజాన్‌లో మాత్రం దైవ కారుణ్యం విశేషంగా వర్షిస్తుంది. అందుకని ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మనస్ఫూర్తిగా, ఆత్మసంతోషంతో వ్రతం పాటించాలి. నియమబద్ధంగా నమాజులు చేయాలి. తరావీహ్‌లు ఆచరించాలి. నఫిల్ ఆరాధనల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పవిత్ర ఖురాన్‌ను అర్థం చేసుకుంటూ చదివే ప్రయత్నం చెయ్యాలి.

ఒక విద్యార్థి పరీక్షల తరుణంలో ఎలా శ్రమిస్తాడో విశ్వాసులు రమజాన్‌లో అలా శ్రమించాలి. చదువును నిర్లక్ష్యం చేసి పరీక్షలను పట్టించుకోకపోతే విద్యార్థి ఎలా నష్టపోతాడో, రమజాన్ శుభ తరుణంలో అలక్ష్యంగా వ్యవహరిస్తే విశ్వాసులు కూడా అలాగే నష్టపోతారు. అందుకని ఉపవాసం ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకొని పాటించాలి. కళ్ళు–చెవులూ, కాళ్ళు–చేతులూ, నోరూ... అన్ని అవయవాలూ ఉపవాసం ఉండాలి. కేవలం పస్తులుండడమే 'రోజా' కాదు. 'రోజా' స్థితిలో కళ్ళు చెడు చూడకూడదు. చెవులు చెడు వినకూడదు. నోరు అసభ్యం పలకకూడదు. కాళ్ళు చేతులతో చెడువైపుకు వెళ్ళకూడదు. మనసులో చెడు తలంపులు రాకూడదు. అప్పుడే 'రోజా' పరిపూర్ణమవుతుంది. ఇలాంటి 'రోజా' మాత్రమే సత్ప్రభావాన్ని చూపగలుగుతుంది. భావి జీవితానికి దిక్సూచిగా నిలవగలుగుతుంది.

ఇలాంటి స్థితినే పవిత్ర ఖురాన్ 'తఖ్వా' అని పేర్కొంది. కనుక పూర్తి స్పృహతో, చైతన్య స్ఫూర్తితో, పరలోక ప్రతిఫలాపేక్షతో వ్రతం పాటించాలి. దైవం అందరికీ రమజాన్ శుభాలనూ సమృద్ధిగా ప్రసాదించాలని కోరుకుందాం.

– ఎమ్.డి. ఉస్మాన్ ఖాన్
(పవిత్ర రమజాన్ మాసం ప్రారంభమవుతున్న సందర్భంగా)

## క్లుప్తంగా...

### వైభవంగా అమరేశ్వరుని దివ్య రథోత్సవం



**అమరావతి:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమరావతి క్షేత్రంలోని శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి వారి దివ్యరథోత్సవం ఆదివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. అమరావతి, ధరణికోట గ్రామాలకు చెందిన చింకా, ఆలపాటి, కోనూరు, కామిరెడ్డి వారి వంశస్తులు తమ గుర్రాలకు రంగులు వేసి ఊరేగింపుగా తెచ్చి స్వామివారికి సమర్పించారు. ఈ గుర్రాలను రథంపై ముందు భాగంలో అలంకరించారు. ఉభయదేవేరులతో కూడిన అమరేశ్వరుడిని గాలిగోపురంలో ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం సర్వాంగసుందరంగా అలంకరించిన దివ్యరథంపై ఉభయదేవేరులతో అమరేశ్వరుని కొలువుదీర్చారు. స్వామి వారి రథోత్సవాన్ని ఆలయ ఈవో గోపీనాథ శర్మ, వైఎస్సార్ సీపీ నాయకురాలు నంబూరు వసంతకుమారి ప్రారంభించారు. మేళతాళాలు, విచిత్ర వేషధారణల నడుమ వైభవోపేతంగా రథోత్సవం సాగింది. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో అమరావతి భక్తజనసంద్రమైంది.

**108 అంబులెన్స్‌కు దారిచ్చిన భక్తులు**

అమరేశ్వరుని దివ్యరథోత్సవం క్రోసూరు జంక్షన్ నుంచి తిరిగి దేవాలయానికి వస్తుండగా గీతామందిరం వద్ద అమరావతి సీహెచ్‌సీ నుంచి వస్తున్న 108 అంబులెన్స్‌కు భక్తులందరూ దారివ్వాలని కోరడంతో ఒక్కసారిగా వేలాది మంది భక్తులు దారి వదిలి తమలో ఉన్న మానవత్వాన్ని చాటుకున్నారు.

### ప్రధాని చేతుల మీదుగా రేపు పలు ప్రాజెక్టులు ప్రారంభం

**రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్**



**రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ):** ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈనెల 12న దేశవ్యాప్తంగా రూ.85 వేల కోట్ల విలువైన పలు రైల్వే ప్రాజెక్టులను వర్చువల్ పద్ధతిలో జాతికి అంకితం చేయనున్నట్లు విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. విజయవాడలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయవాడ డివిజన్‌లో తణుకు, భిక్కవోలు, ఏలూరులో ఆధునీకీకరించిన గూడ్స్‌షెడ్స్, గూడూరు–బిట్రగుంట మూడోలైన్, బిట్రగుంట–కరవది–చీరాల సెక్షన్‌లో మూడోలైన్, 67 స్టేషన్‌లలో ఓస్‌ఓపీ (వన్‌స్టేషన్–వన్ ప్రొడక్ట్) స్టాల్స్ జాతికి అంకితం చేస్తారన్నారు. విజయవాడ డివిజన్‌లో రూ.150 కోట్లతో 15 గూడ్స్ షెడ్స్ ఆధునీకరణ పనులకు ఇటీవలే రైల్వేశాఖ అనుమతులు మంజూరు చేసినట్టు డీఆర్‌ఎం చెప్పారు. దేశవ్యాప్తంగా మరో 66 ఓఎస్‌ఓపీ (వన్ స్టేషన్–వన్ ప్రొడక్ట్) స్టాల్స్, మూడు గతిశక్తి టెర్మినల్స్, గూడ్స్ షెడ్‌లు, పీఎం ఔషధ కేంద్రం, రెండు రైల్ కోచ్ రెస్టారెంట్‌లు, 12 సెక్షన్లలో రెండో లైన్, మూడో లైన్, బైపాస్ ప్రాజెక్టులను కూడా జాతికి అంకితం చేయనున్నారని ఆయన వివరించారు. సమావేశంలో ఏడీఆర్‌ఎం ఎం. శ్రీకాంత్, సీనియర్ డీసీఎం వి. రాంబాబు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీల చించివేత

**చెరుకుపల్లి:** మహా శివరాత్రి సందర్భంగా బాపట్ల జిల్లాలోని చెరుకుపల్లి గోవాడ రోడ్డు మార్గంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీకి చెందిన 30 ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి బ్లేడుతో కోసి చించేశారు. ఇది హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ పేర్కొన్నారు. పార్టీకి గ్రామాల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకే ఇటువంటి పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇటువంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడిన వ్యక్తులను పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### 'సిద్ధం' సభలో అపశృతి

- ముందుకుపడి మున్సిపల్ కార్మికుడు మృతి
- సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి.. రూ.10లక్షల సాయం ప్రకటన

**అద్దంకి:** బాపట్ల జిల్లా కొలిశపాడు మండలం మేదరమెట్ల సమీపంలోని పి.గుడిపాడు వద్ద ఆదివారం జరిగిన 'సిద్ధం'భారీ బహిరంగసభలో అపశృతి చోటుచేసుకుంది. సభా ప్రాంగణంలో ఒక గ్యాలరీ నుంచి ఇంకో గ్యాలరీకి వెళ్తున్న ఒంగోలు మున్సిపల్ కార్మికుడు ఊదరగుడి మురళీకృష్ణ (35) అకస్మాత్తుగా ముందుకుపడి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అతనిని హుటాహుటిన ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచాడని.. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉంటే.. మురళీకృష్ణ మృతిపై సీఎం వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేసి ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మృతుని కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సాయాన్ని అందించాలని ఆదేశించారు.

# టీడీపీకి పొత్తు'పోటు'

**రాష్ట్రవ్యాప్తంగా నిరసన సెగ**

- అభ్యర్థుల ఖరారుపైనా శ్రేణుల్లో ఆందోళన
- డబ్బులు ఖర్చుచేయించి వెన్నుపోటు పొడిచారంటూ గగ్గోలు
- కాకినాడ రూరల్‌లో శెట్టిబలిజ నేత పెంకే శ్రీనివాసబాబా కన్నీళ్లు
- పోలవరం నియోజకవర్గంలో కార్యకర్త ఆత్మహత్యాయత్నం
- తంబళ్లపల్లెలో బైక్ ర్యాలీకి నేతల డుమ్మా
- యలమంచిలిలోనూ కార్యకర్తల నిరసన
- గుంతకల్లులో గుమ్మనూరు గోబ్యాక్ అంటూ ర్యాలీ




గుంతకల్లులో నిరసన ర్యాలీలో పాల్గొన్న టీడీపీ మహిళా నాయకులు



కాకినాడలో కన్నీరు పెట్టుకుంటున్న బీసీ నేత శ్రీనివాస బాబా

**కాకినాడ రూరల్/బుట్టాయగూడెం/బి.కొత్తకోట/అచ్యుతాపురం(యలమంచిలి)/గుంతకల్లు/భీమడోలు :** తెలుగుదేశం పార్టీలో పొత్తులతోపాటు అభ్యర్థుల ఖరారు నిరసనల సెగ రేపుతున్నాయి. ఇన్నాళ్లూ పార్టీ కోసం డబ్బులు ఖర్చుపెట్టి పనిచేస్తే ఇప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబు తమను వెన్నుపోటు పొడిచారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో శెట్టిబలిజ నేత, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్‌ఆర్‌ఐ పెంకే శ్రీనివాసబాబా ఆదివారం తన నివాసంలో రెండువేల మంది కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పొత్తులో భాగంగా కాకినాడ రూరల్ సీటును జనసేనకు ఇచ్చిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ దంపతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో టీడీపీ అధిష్టానం సత్యనారాయణకు కాకినాడ రూరల్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పదవిని, ఆయన అనుచరుడు కటకంశెట్టి బాబీకి కో కో–ఆర్డినేటర్ పదవిని కట్టబెట్టింది. దీనిపై తొలి నుంచి పార్టీ కోసం కష్టపడుతున్న తనకు కనీస సమాచారం ఇవ్వలేదని పెంకే శ్రీనివాసబాబా ఆవేదన వ్యక్తం చేశారు. అదేమని అడిగితే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పార్టీ నేత యనమల రామకృష్ణుడు తన ముఖంలో కరిష్మా లేదని అవమానించారని శ్రీనివాసబాబా కార్యకర్తల సమక్షంలో కన్నీటిపర్యంతమయ్యారు. పార్టీ కోసం హైదరాబాద్‌లో ఆస్తులూ అమ్ముకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా చంద్రబాబు తనకు ప్రాధాన్యం ఇవ్వకుండా వేరేవారికి పదవులు కట్టబెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజికన్యాయం గురించి మాట్లాడే జనసేన అధినేత పవన్ కల్యాణ్ బీసీల సీటు లాక్కున్నారని విమర్శించారు. టీడీపీపై నమ్మకం పోయిందని, చంద్రబాబు నుంచి పిలుపు వస్తుందేమోనని, వారం పది రోజులు వేచి చూసి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని శ్రీనివాసబాబా వెల్లడించారు. టీడీపీ నేత కాకరపల్లి చలపతిరావు, మరికొందరు నేతలు మాట్లాడుతూ శ్రీనివాసబాబాతో ఇండిపెండెంట్‌గా పోటీ చేయించి టీడీపీకి తమ సత్తాచాటుతామని పేర్కొన్నారు.

- ఏలూరు జిల్లా పోలవరం సీటును జనసేనకు కేటాయిస్తున్నారని వస్తున్న వార్తలపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు వర్గం ఆందోళన చెందుతోంది. ఈ మేరకు కార్యకర్తలు ఆదివారం బుట్టాయగూడెం, రెడ్డిగణపవరం గ్రామాల్లో నిరసన వ్యక్తం చేశారు. అంతర్వేదిగూడేనికి చెందిన ఆండ్రు శ్యామ్‌కుమార్ అనే కార్యకర్త ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. మిగతా కార్యకర్తలు పెట్రోల్ బాటిల్ లాక్కుని నిలువరించారు.
- అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి బి.కొత్తకోటలో ఆదివారం నిర్వహించిన బైక్ ర్యాలీకి ఆ పార్టీ నేతలు డుమ్మా కొట్టారు. జయచంద్రారెడ్డి అభ్యర్థిత్వాన్ని మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గీయులతోపాటు ముఖ్యమైన నాయకులు వ్యతిరేకిస్తున్నారు. అభ్యర్థిని మార్చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ర్యాలీ సమయంలో జయచంద్రారెడ్డి వర్గీయులు జ్యోతిచౌక్‌లో కాల్చిన టపాకాయలు పేలకపోవడంతో వాటిని అలాగే వదిలేశారు. అవి కొంతసేపటికి పేలి ప్రజలపై నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. కొన్ని రవ్వలు రోడ్డుపైనే ఉన్న టెలిఫోన్ స్తంభంపై పడటంతో తీగలు కాలిపోయాయి. స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పారు.
- అనకాపల్లి జిల్లా యలమంచిలి టీడీపీలో ముసలం పుట్టింది. ఇక్కడ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావుకు సీటు లేకపోవడంతో కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా అధిష్టానంపై నిప్పులు చెరుగుతున్నారు. యలమంచిలిలో జరిగిన సమావేశంలో జై ప్రగడ అంటూ నినాదాలు చేస్తూ ఫర్నిచర్ ధ్వంసం చేశారు. అలాగే అనకాపల్లి నియోజకవర్గంలోనూ ఇన్‌చార్జ్ పీలా గోవింద్‌కు సీటు ఇవ్వకపోవడంతో అక్కడి కార్యకర్తలూ గుర్రుగా ఉన్నారు. వారిని సముదాయించేందుకు పార్టీ నేతలు యత్నిస్తున్నారు. యలమంచిలిలో పదేళ్లపాటు పార్టీ పటిష్టత కోసం పనిచేసిన ప్రగడను కరివేపాకులా పక్కన పెట్టేయడం వెనుక మాజీ ఎంపీ, ఎమ్మెల్యేల హస్తం ఉన్నట్టు కార్యకర్తలు అనుమానిస్తున్నారు. కార్యకర్తల నిరసనలతో పార్టీ అధిష్టానం తలపట్టుకుంటోంది.
- అరాచక నేత, పేకాట, లిక్కర్ డాన్ గుమ్మనూరు జయరాం గో బ్యాక్ అంటూ అనంతపురం జిల్లా గుంతకల్లులో ఆదివారం టీడీపీ శ్రేణులు నిరసన ర్యాలీ చేపట్టాయి. స్థానిక బీరప్ప గుడి సర్కిల్ నుంచి ప్రధాన రహదారి మీదుగా గాంధీచౌక్ వరకు ప్రదర్శన సాగింది. గుమ్మనూరు అభ్యర్థిత్వాన్ని అంగీకరించేది లేదని తేల్చిచెప్పారు. చంద్రబాబు స్థానికుల మనోభావాలను పట్టించుకోకుండా జయరాంకు టికెట్ ఇస్తే ఓడించి తీరతామని మహిళా నాయకులూ స్పష్టం చేశారు.
- ఏలూరు జిల్లా ఉంగుటూరు టీడీపీ సీటును గన్ని వీరాంజనేయులుకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పార్టీ శ్రేణులు మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయానికి కార్లలో తరలివెళ్లారు. అక్కడ ప్లకార్డులతో నినాదాలు చేశారు. చంద్రబాబు అందుబాటులో లేనందున పార్టీ ప్రతినిధి షరీఫ్‌కు వినతిపత్రం అందించి వెనుదిరిగారు. ఉంగుటూరు సీటును జనసేనకు కేటాయిస్తున్నట్టు ప్రచారం జరగడంతో కొద్దిరోజులుగా టీడీపీ కార్యకర్తలు రగిలిపోతున్నారు.

## మనబడి 'ఐబీ'కి అనుకూలం

▶ మొదటి పేజీ తరువాయి

సమీక్షలో రోజువారి యాప్స్ వినియోగం, కేంద్రీకృత మానిటరింగ్ సిస్టం, టోఫెల్ శిక్షణ, కంటెంట్ అనుసంధానం , అటల్ టింకరింగ్ ల్యాబ్స్, గ్రంథాలయాల వినియోగం, మెరుగైన అసెస్‌మెంట్, యూనిఫారం, ద్విభాషా పాఠ్యపుస్తకాలు, పోషకాలతో కూడిన నాణ్యమైన మధ్యాహ్న భోజనం, టాయిలెట్ల నిర్వహణపై ఆ ప్రతినిధులు ప్రభుత్వాన్ని, విద్యాశాఖను అభినందించారు.

**విద్యార్థుల్లో నేర్చుకునే తత్వంపై అభినందన..**

ఇంటర్నేషనల్ బాకలారియెట్ సిలబస్ అమలుచేసే స్కూళ్లలో విద్యార్థుల వ్యక్తిగత ప్రొఫైల్‌కు అధిక ప్రాధాన్యతనిస్తారు. బహు భాషలు, విద్యేతర అంశాలపై దృష్టిపెడతారు. వివిధ రకాల భాషలు మాట్లాడే పిల్లలు ఒకేచోట కలిసి ఉన్నప్పుడు ఒకరికొకరు సహకరించుకునే గుణం తప్పనిసరిగా ఉండేలా చూస్తారు. ఇలాంటి వాతావరణాన్ని ఏపీ ప్రభుత్వ స్కూళ్లల్లో గుర్తించినట్లు వారు తెలిపారు. తెలుగు, ఉర్దూ, తమిళం, కన్నడ, ఒరియాతో పాటు సవర, కొండ, కోయ, సుగాలి, ఆదివాసి, కువి వంటి గిరిజన భాషలు మాట్లాడే పిల్లలు కలిసి ఉన్నప్పుడు వారివారి భాషలను గౌరవించుకోవడం, ఇతర భాషలను నేర్చుకునేందుకు ఆసక్తి చూపడాన్ని ఐబీ ప్రతినిధులు గమనించి అభినందించారు. తరగతి గదులలో బహుభాషావాదం, ఉపాధ్యాయ–విద్యార్థి సంబంధం, విద్యార్థుల మధ్య ఆత్మవిశ్వాసం, పాఠశాల విద్యా వ్యవస్థపై సమాచారాన్ని పంచుకోవడంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతరులు ఆసక్తి చూపిన తీరు ఐబీ విద్యా విధానానికి దగ్గరగా ఉన్నట్లు ఆ ప్రతినిధులు తెలిపారు. ఇక ఐబీ అమలు విషయంలో ఏపీ పాఠశాల విద్యాశాఖకు అవసరమైన మౌలిక సదుపాయాలున్నాయని, ఉపాధ్యాయులకూ తగిన అర్హతలు ఉన్నాయన్నారు. ఇక్కడి విద్యార్థులు ప్రపంచ పోకడలను అర్థంచేసుకునేందుకు, అవకాశాలను అందుకునేందుకు ఐబీ పాఠ్యాంశాలను సులభంగా అనుసరించగలరన్న నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు. మరోవైపు.. ఐబీ బృందం పర్యటనకు సంబంధించిన పూర్తి నివేదికను జూన్‌లో ప్రభుత్వానికి అందజేయనుంది. నివేదిక ఆధారంగా ఉపాధ్యాయులకు, విద్యాశాఖ సిబ్బంది శిక్షణనివ్వాలని అధికారులు నిర్ణయించారు.

## కడప శిల్పారామానికి సరికొత్త హంగులు

**వైఎస్సార్ విగ్రహం, సిట్టింగ్ షెల్టర్లు ప్రారంభం**

**కడప కల్చరల్:** వైఎస్సార్ జిల్లా, కడపలోని శిల్పారామానికి సరికొత్త హంగులు చేకూరాయి. రాష్ట్ర శిల్పారామాల సీఈఓ శ్యాం సుందర్‌రెడ్డి ఆదివారం ఇక్కడ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సమీపంలో నిర్మించిన గజబౌ (సిట్టింగ్ షెల్టర్లు)ను ప్రారంభించారు. అందులో ప్రజలకు సిట్టింగ్ సౌకర్యాన్ని పరిశీలించారు. శిల్పారామంలో ఖాళీగా ఉన్న ప్రాంతంలో లాన్ (పచ్చిక బయలు)ను కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప వాసుల ఆహ్లాదం కోసం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో శిల్పారామాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అంచెలంచెలుగా దాన్ని అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం సంప్రదాయ వేదికపై ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్ప్రింట్ వ్యాలీ పాఠశాల విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామాల రాష్ట్ర ఏఓ మునిరాజు, జిల్లా ఏఓ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## వలంటీర్ మానవత్వం

- మైసూరు వెళ్లి లబ్ధిదారుతో ఈ–కేవైసీ చేయించిన వలంటీర్



శ్యామలాంబతో ఈ–కేవైసీ చేయిస్తున్న వలంటీర్ శివనాగశంకర్

**గన్నవరం రూరల్:** ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందాలనే సీఎం వైఎస్ జగన్ ఆశయాన్ని ఓ వలంటీర్ నెరవేర్చాడు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం వీరపనేనిగూడెంలో తోలేటి సత్యనారాయణ, శ్యామలాంబ దంపతులు నివసిస్తున్నారు. శివాలయంలో అర్చకుడైన సత్యనారాయణకు సొంత ఇల్లు లేదు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణకు స్థానిక జగనన్న కాలనీలో 114వ నంబర్ ప్లాటును వైఎస్ జగన్ ప్రభుత్వం కేటాయించింది. ఇటీవల సత్యనారాయణ భార్య శ్యామలాంబ స్థానిక సచివాలయంలో ఇంటి స్థల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు హాజరయ్యారు. ఆ తర్వాత అనారోగ్యంగా ఉండటంతో.. కర్ణాటకలోని మైసూరులో నివసిస్తున్న కుమార్తె శ్వేత వద్దకు సత్యనారాయణ, శ్యామలాంబ వెళ్లారు. ఇంటి పట్టా ఈ–కేవైసీ కోసం వీరపనేనిగూడెం బయలుదేరిన శ్యామలాంబ ప్రయాణం మధ్యలో అనారోగ్యం తలెత్తడంతో వెనక్కి వెళ్లిపోయారు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ నారగాని శివనాగశంకర్ ఈ నెల 5న మైసూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్యామలాంబ వద్దకు వెళ్లి ఈ–కేవైసీ చేయించాడు. వలంటీర్‌ను సర్పంచ్ జేజమ్మ, కార్యదర్శి బాపూజీ, ఉపసర్పంచ్ నాగసాంబిరెడ్డి, సహచర వలంటీర్లు, సచివాలయం సిబ్బంది, శ్యామలాంబ కుమార్తె శ్వేత అభినందించారు.

## వరదరాజస్వామి ఆలయం కింద విగ్రహాలు

**మహావిష్ణు, శ్రీదేవి, భూదేవి విగ్రహాలు లభ్యం**



తవ్వకాల్లో బయటపడిన విగ్రహాలు

**పలమనేరు(చిత్తూరు జిల్లా):** పలమనేరు మండలంలోని కూర్మాయి గ్రామంలో వెలసిన పురాతన శ్రీకూర్మ వరదరాజ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆదివారం తవ్వకాలు జరుపుతుండగా, గర్భగుడికి ఈశాన్య దిశలో మహావిష్ణు, శ్రీదేవి, భూదేవి విగ్రహాలు బయటపడ్డాయి. వీటిని గమనించిన గ్రామస్థులు విగ్రహాలను నీటితో శుభ్రం చేసి పూజలు జరిపి, ఆలయం వద్ద ఉంచారు. ఈ ఆలయం శతాబ్దాల క్రితం నిర్మించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఇటీవలే ఈ పునర్నిర్మాణం కోసం ఎండోమెంట్ రూ.1.2 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పుడు వెలుగు చూసిన విగ్రహాలు పంచలోహాలతో చేసినవని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ విషయాన్ని దేవదాయశాఖ అధికారులు పరిశీలించి ధ్రువీకరించాల్సి ఉంది.

## ముగిసిన గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు

**4 రోజుల్లో 20 లక్షల మందికిపైగా భక్తుల హాజరు**



**గుంటూరు రూరల్:** ఏసుక్రీస్తు ఆయన భక్తులను లెబనోను శిఖరమువలే ఉన్నతంగా తీర్చిదిద్దుతాడని హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ తెలిపారు. 4 రోజులుగా గుంటూరు నగర శివారులోని హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరుగుతోన్న 47వ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు ఆదివారంతో ముగిశాయి. ఈ ప్రార్థనల్లో దేశ విదేశాల నుంచి 20 లక్షల మందికిపైగా పాల్గొని క్రీస్తు నామాన్ని ఘనపరుస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చివరి రోజు పాస్టర్ జాన్‌వెస్లీ క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందిస్తూ క్రీస్తుని భక్తులు పరిశుద్ధాత్మని పొంది పరిశుద్ధంగా ఉండాలన్నారు. బ్రదర్ అబ్రహాం క్రీస్తు సందేశాన్ని అందిస్తూ ఏసుక్రీస్తు మునుపటికంటే అధికంగా ఆయన భక్తులను హెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నాడన్నారు. 4 రోజుల పాటు క్రీస్తు నామాన్ని ఘనపరుస్తూ 47వ హోసన్నా అంతర్జాతీయ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు విజయవంతం చేసి క్రీస్తు నామాన్ని ఘనపరిచేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్స్ ప్రెడిపాల్, పాస్టర్ రాజు, పాస్టర్ రమేష్, మినిస్ట్రీస్ పాస్టర్స్ పాల్గొన్నారు.

## టీడీపీ, జనసేన రౌడీమూకల విధ్వంసకాండ

- అర్ధరాత్రివేళ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల 20 బైక్‌లు ధ్వంసం
- గ్రామస్తులు కేకలు వేయడంతో తమ బైక్‌లు వదిలి పారిపోయిన రౌడీమూకలు
- బాపట్ల జిల్లా పుట్టావారిపాలెంలో ఘటన



టీడీపీ, జనసేన రౌడీమూకలు వదిలివెళ్లిన బైక్‌లు

**చెరుకుపల్లి:** బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం పుట్టావారిపాలెంలో తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన రౌడీలు విధ్వంసం సృష్టించారు. మద్యం తాగి గొడ్డళ్లు, ఇనుపరాడ్లు చేతపట్టుకుని అర్ధరాత్రి వేళ వైఎస్సార్‌సీపీకి చెందినవారి బైక్‌లను ధ్వంసం చేశారు. పుట్టావారిపాలెంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సుమారు 100 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి మద్దతు పలుకుతున్నాయి. ఈ క్రమంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కొందరు రౌడీలు మద్యం తాగి శనివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో గొడ్డళ్లు, ఇనుప రాడ్లు పట్టుకుని వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్నవారి ఇళ్ల వద్దకు వెళ్లి హల్‌చల్ చేశారు. ఇళ్ల ముందు నిలిపిన 20 బైకులను ధ్వంసం చేశారు. గ్రామస్తులు కేకలు వేయడంతో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన రౌడీలు తమ బైక్‌లను వదిలి పారిపోయారు. గ్రామస్తులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి 11 బైక్‌లు, ఇనుపరాడ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ దురాగతానికి పాల్పడిన రౌడీమూకలను కఠినంగా శిక్షించాలని ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండలరెడ్డి, స్థానిక సర్పంచ్ మొగలిపువ్వు కోటేశ్వరరావు పోలీసులను కోరారు.

## శ్రీవారి సేవలో సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేంద్ర

**తిరుమల:** తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేంద్ర ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. కాగా, శ్రీవారిని దర్శించుకున్న వారిలో మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం ఉన్నారు.

## శ్రీశైలంలో శాస్త్రోక్తంగా పూర్ణాహుతి

**ముగింపు దశకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు**



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

**శ్రీశైలం టెంపుల్:** శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరాయి. ఆదివారం పూర్ణాహుతి క్రతువు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి యాగశాలలో అర్చకులు, వేదపండితులు చండీశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం రుద్రహోమ పూర్ణాహుతి, వసంతోత్సవం, అవభృందం, త్రిశూలస్నానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవాల ముగింపు సూచికంగా ధ్వజ పతాక అవరోహణ చేశారు. అనంతరం సదస్యం–నాగవల్లి కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో డి.పెద్దిరాజు పాల్గొన్నారు.

## నంది, కామధేను వాహనాలపై ముక్కంటి విహారం

**వేడుకగా శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు**



శ్రీకాళహస్తి పురవీధుల్లో నంది,కామధేను వాహనంపై ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లు

**రేణిగుంట(తిరుపతి జిల్లా):** శ్రీకాళహస్తీశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆది దంపతులు అధికార నంది, కామధేను వాహనాలపై పట్టణ పురవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. వాహనాల ముందు మేళతాళాలు, కళా నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాత్రి గజ, సింహ వాహనాలపై స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. పట్టణంలోని పెండ్లి మండపం వద్ద స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా తిరుమల, కాణిపాకం, శ్రీశైలం ఆలయాల నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణోత్సవ సమయంలో వివాహం చేసుకోనున్న పలు జంటలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తాళిబొట్లు, పట్టువస్త్రాలు అందజేశారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కల్యాణోత్సవ వేడుక నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## నీట్ దరఖాస్తు గడువు మార్చి 16 దాకా పెంపు

**న్యూఢిల్లీ:** వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష నీట్ యూజీ–2024 దరఖాస్తు గడువును మార్చి 16 దాకా పెంచుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్ణయం తీసుకుంది. పరీక్ష మే 5న జరగనుంది. ఇంగ్లిష్, హిందీ, తెలుగుతో పాటు 13 భాషల్లో పరీక్ష నిర్వహిస్తారు. నీట్‌కు ఈసారి రికార్డు స్థాయిలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. మార్చి 9 నాటికే ఏకంగా 25 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది కంటే ఇది 4.2 లక్షలు ఎక్కువ. గడువు పెంచడంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

## కాంగ్రెస్‌లోకి బీజేపీ ఎంపీ

**చండీగఢ్/న్యూఢిల్లీ/జైపూర్:** లోక్‌సభ ఎన్నికల వేళ హరియాణాలో బీజేపీకి చెందిన హిస్సార్ లోక్‌సభ సభ్యుడు బ్రిజేంద్రసింగ్ ఆదివారం పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఎంపీగా అవకాశమిచ్చినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ జేపీ నడ్డాలకు ఆయన కృతజ్ఞతలు తెలపడం విశేషం. హిస్సార్ నుంచి కాంగ్రెస్ తరఫున బ్రిజేంద్ర బరిలో దిగుతారని పార్టీ వర్గాల సమాచారం. మరోవైపు రాజస్తాన్‌లో కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రులు రాజేంద్ర యాదవ్, లాల్‌చంద్ కటారియాతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

## ఇండొనేసియాలో వరదలు... 19 మంది దుర్మరణం

**పడాంగ్:** ఎడతెరిపి లేని వర్షాలు, భారీ వరదలతో ఇండొనేసియా అతలాకుతలం అవుతోంది. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడ్డ ఉదంతాల్లో సుమత్రా దీవిలో కనీసం 19 మంది దుర్మరణం పాలయ్యారని అధికార వర్గాలు ఆదివారం వెల్లడించాయి. ఏకంగా 20 వేల పై చిలుకు ఇళ్లు పూర్తిగా నీటమునిగాయి. దాంతో పలు ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. లక్ష మందికి పైగా నిర్వాసితులయ్యారు. వారంతా ప్రభుత్వం ఏర్పాటు తాత్కాలిక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు.

## ‘సాదిక్’పై ఈడీ కేసు

**న్యూఢిల్లీ:** తమిళనాడుకు చెందిన డీఎంకే మాజీ నేత జాఫర్ సాదిక్ ప్రమేయమున్న అంతర్జాతీయ డ్రగ్స్ అక్రమ రవాణా వ్యవహారంపై ఈడీ ఆదివారం మనీ లాండరింగ్ కేసు నమోదు చేసింది. రూ.2,000 కోట్ల విలువైన 3,500 కిలోల మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులో సాదిక్‌పై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో శనివారం కేసు నమోదు చేయడం తెలిసిందే. సాదిక్‌తో ఆర్థిక లావాదేవీలు జరిపిన డీఎంకే కీలక నేతకు అతి త్వరలో సమన్లు జారీ చేసి ప్రశ్నించాలని ఎన్‌సీబీ నిర్ణయించింది.

# హస్త లా విస్తా.. బేబీ!

**బహుదూరపు బాటసారికి బై బై | అవసాన దశలో వోయేజర్–1**

**నక్షత్రాంతర వ్యోమనౌకలో సాంకేతిక సమస్య ● 2,440 కోట్ల కి.మీ. దూరంలో స్పేస్ క్రాఫ్ట్**

వోయేజర్–1. ఈ పేరే ఖగోళ శాస్త్రవేత్తలకు ఎనలేని స్ఫూర్తి. నింగికేసి ఉత్సాహంగా చూసేలా కొన్ని తరాలను పురిగొల్పిన ప్రేరణ శక్తి. అలుపెరుగని యాత్ర. కోట్లాది కిలోమీటర్ల జైత్రయాత్ర. అర్ధ శతాబ్ద కాలపు వైజ్ఞానిక పరిశోధనల సారం. మానవాళి కలలుగన్న ‘సుదూర’ లక్ష్యపు సాకార రూపం. గ్రహాంతర హద్దులను దాటి నక్షత్రాంతర రోదసిలోకెగసిగిన విశ్వవిఖ్యాత వ్యోమనౌక వోయేజర్–1. అంతరిక్షంలో ఇప్పటివరకు అత్యంత ఎక్కువ దూరం ప్రయాణించిన మానవ నిర్మిత వస్తువు ఇదే. 1977 సెప్టెంబరు 5న అమెరికా ప్రయోగించిన ఈ వ్యోమనౌకది 46 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం. ఈ జనవరి నాటికి అది భూమి నుంచి 2,440 కోట్ల కిలోమీటర్ల దూరాన ఉంది. ఇప్పుడీ వ్యోమనౌకకు అంతిమ ఘడియలు ఆసన్నమయ్యాయి. గత నవంబరు నుంచి భూమికి సరైన సమాచారమివ్వడం లేదు. నాసాకు పిచ్చి పిచ్చి సందేశాలు పంపుతోంది. ఎలా చూసినా వోయేజర్–1 చరిత్ర ఇక ముగిసిన అధ్యాయమేనని అనిపిస్తోంది. అద్భుతమేదైనా జరిగితే తప్ప అది మనకిక హస్త లా విస్తా (వీడ్కోలు) చెప్పినట్టే!

వోయేజర్–1లోని ఓ కంప్యూటర్లో సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో కాలిఫోర్నియాలోని పసడెనాలో జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీలో ఉన్న గ్రౌండ్ కంట్రోల్ కేంద్రానికి వ్యోమనౌక నుంచి అర్థరహిత సమాచారం అందుతోంది. వోయేజర్–1ను నిర్మించి ప్రయోగించినప్పటి నాసా సిబ్బందిలో చాలామంది కాలం చేశారు. దాంతో తాజా సమస్యను పరిష్కరించి వ్యోమనౌకను మళ్లీ గాడిన పెట్టేందుకు దాని నిర్మాణం తాలూకు పాత పత్రాలను ముందేసుకుని శాస్త్రవేత్తలు కొన్ని నెలలుగా కుస్తీలు పడుతున్నారు. ఈ సమస్య నుంచి వ్యోమనౌక బయటపడితే అద్భుతమేనని 2010 నుంచి ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్న సుజానే డాడ్ అన్నారు.

**ఫ్లైట్ డేటా సిస్టమ్ లోపాలు**

వోయేజర్–1లోని మూడు కంప్యూటర్లలో ఫ్లైట్ డేటా సిస్టమ్ (ఎఫ్‌డీఎస్)లో సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో ఇంజనీరింగ్, సైన్స్ డేటాను భూమికి పంపే సామర్థ్యాన్ని వోయేజర్–1 కోల్పోయింది. వోయేజర్–1, 2లలో ప్రయోగ సమయంలో రెండేసి ఎఫ్‌డీఎస్‌లున్నాయి. దురదృష్టవశాత్తు వోయేజర్–1 బ్యాకప్ ఎఫ్‌డీఎస్ 1981లో విఫలమైంది. దాన్ని రీ స్టార్ట్ చేసేందుకు నాసా చేసిన ప్రయత్నం ఫలించలేదు. రెండు వోయేజర్లలోని ప్లుటోనియం ఆధారిత అణు జనరేటర్లు 2025 కల్లా పనిచేయడం మానేస్తాయని నాసా అంచనా.

– జమ్ముల శ్రీకాంత్

**సౌరవ్యవస్థను దాటి ముమ్ముందుకు!**

హీలియోస్పియర్. సౌరవ్యవస్థ చుట్టూ సూర్యుడు నేరుగా ప్రభావం చూపే పొడవైన బుడగ లాంటి ప్రదేశం. దీని అంచును హీలియోపాజ్ అంటారు. వోయేజర్–1 2012లోనే ఈ హీలియోపాజ్‌ను దాటేసి నక్షత్రాంతర రోదసిలోకి ప్రవేశించింది. అలా ఇంటర్ స్టెల్లార్ స్పేస్‌లోకి అడుగిడిన తొలి మానవ నిర్మిత వస్తువుగా రికార్డుకెక్కింది. 2018లో వోయేజర్–2 కూడా ఇంటర్ స్టెల్లార్ స్పేస్‌లోకి ప్రవేశించింది. కాస్మిక్ కిరణాలు, నక్షత్రాంతర ప్రాంతంలోని అయస్కాంత క్షేత్రంలో అసాధారణ అలజడులు, ప్లాస్మా కణాలపై వోయేజర్–1 అధ్యయనం చేస్తోంది. భూమి నుంచి దానికి ఆదేశం పంపడానికి 22.5 గంటలు, దాన్నుంచి డేటా స్వీకరించడానికి మరో 22.5 గంటలు.. ఇలా సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికి రమారమి రెండు రోజులు పడుతోంది.



భూమి మీది జీవం, పలు భాషల్లో శుభాకాంక్షలు, ఆడియో–విజువల్ సందేశాలతో వోయేజర్–1 వ్యోమనౌకలో పంపిన గోల్డెన్ రికార్డు



**జంట విజయాలు...**

వోయేజర్ ప్రాజెక్టులో వోయేజర్–1, 2 భాగస్వాములు. వోయేజర్–2ను వోయేజర్–1 కంటే రెండు వారాల ముందు ప్రయోగించారు. నిజానికి వీటిది కేవలం నాలుగేళ్ల మిషన్. కానీ నేటికీ విజయవంతంగా కొనసాగుతోంది. వోయేజర్–2 ప్రస్తుతం పనిచేస్తున్నా దాన్నీ సాంకేతిక సమస్యలు వేధిస్తున్నాయి. పయనీర్–10, 11 వ్యోమనౌకల యాత్రలకు కొనసాగింపుగాం గురు, శని గ్రహాల అన్వేషణకు వోయేజర్ జంట నౌకలను పంపారు. వీటితో గురు గ్రహంపై పెద్ద ఎర్ర మచ్చ, శని వలయాలు, ఈ రెండు గ్రహాల కొత్త చంద్రుళ్లకు సంబంధించి ఎన్నో విశేషాలు వెలుగు చూశాయి. వోయేజర్–1 1979లో గురుగ్రహాన్ని 3.5 లక్షల కిలోమీటర్ల దూరం నుంచి తిలకించింది. దాని చంద్రుడు ‘అయో’పై క్రియాశీల అగ్నిపర్వతాలను గుర్తించింది. భూమి మినహా సౌర కుటుంబంలోని తక్కిన ఖగోళ వస్తువుల్లో అగ్నిపర్వత క్రియాశీలతను కనుగొనడం అదే తొలిసారి. 1990 ఫిబ్రవరి 14న సూర్యుడికి 600 కోట్ల కిలోమీటర్ల దూరం నుంచి ‘లేత నీలి చుక్క’లా కనిపిస్తున్న భూమి ఫొటోను వోయేజర్–1 కెమెరా బంధించింది. ఆ సింగిల్ పిక్సెల్ ఫొటో ‘మానవాళి తన కుతాను గీసుకున్న స్వీయ చిత్తరువు’లా అనిపిస్తుంది. ఇక యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలను సందర్శించిన ఏకైక వ్యోమనౌకగా వోయేజర్–2 పేరుగాంచింది. శిలాగ్రహాలైన బుధుడు, శుక్రుడు, భూమి, అంగారకుడిని అంతర గ్రహాలంటారు. వాయుమయ గురు, శని, యురేనస్, నెప్ట్యూన్లను బాహ్య గ్రహాలుగా పిలుస్తారు. 4 బాహ్య గ్రహాలను దగ్గరగా సందర్శించిన ఏకైక వ్యోమనౌకగా వోయేజర్–2 1989లో రికార్డు సృష్టించింది.

# రాజ్యాంగాన్ని సవరిస్తాం!

**బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై వివాదం**
- తీవ్రంగా దుయ్యబట్టిన కాంగ్రెస్
- అవి వ్యక్తిగత వ్యాఖ్యలన్న బీజేపీ

**బెంగళూరు/న్యూఢిల్లీ:** రాజ్యాంగాన్ని సవరించేందుకు వీలుగా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మూడింట రెండొంతుల మెజారిటీ కట్టబెట్టాలంటూ ఆ పార్టీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి అనంతకుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. కర్ణాటకలోని కర్వార్‌లో బహిరంగ సభలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ‘‘రాజ్యాంగానికి కాంగ్రెస్ హయాంలో పలు మార్పుచేర్పులు చేసి అనవసర అంశాలతో నింపేశారు. ముఖ్యంగా హిందూ సమాజాన్ని అణగదొక్కే చట్టాలను చేర్చారు. ఇలాంటి తప్పిదాలన్నింటినీ సరి చేయాల్సి ఉంది. ఇందుకు పార్లమెంటు ఉభయ సభల్లోనూ బీజేపీకి మూడింత రెండొంతుల మెజారిటీ అవసరం’’ అని హెగ్డే అన్నారు. దీనిపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో మండిపడింది. రాజ్యాంగాన్ని తిరగరాసి సర్వనాశనం చేయాలన్న బీజేపీ, ఆరెస్సెస్ రహస్య అజెండా మరోసారి బట్టబయలైందని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. మున్ముందు ఎన్నికలతో నిమిత్తమే లేకుండా నియంతృత్వ పాలనకు తెర తీసేందుకు మోదీ సర్కారు ప్రయత్నిస్తోందని ఎక్స్‌లో ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని ఎలాగోలా సర్వనాశనం చేయాలన్న ప్రధాని మోదీ, సంఘ్ పరివార్ ఉద్దేశాలే హెగ్డే నోట వెలువడ్డాయని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. వారికి న్యాయం, సమానత్వం, పౌర హక్కులు, ప్రజాస్వామ్యమంటే అంతులేని విద్వేషమని ఆరోపించారు. ‘బీజేపీని ఓడిద్దాం, రాజ్యాంగాన్ని రక్షిద్దాం’ అంటూ కాంగ్రెస్ నేతలు తమ సోషల్ అకౌంట్లలో హాష్‌ట్యాగ్ జోడించారు. దాంతో ఈ వివాదంపై బీజేపీ ఆచితూచి స్పందించింది. హెగ్డే వ్యాఖ్యలు వ్యక్తిగతమని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అన్నారు. వాటిపై ఆయనను వివరణ కోరతామని తెలిపారు. హెగ్డే బీజేపీ సీనియర్ నేతల్లో ఒకరు. ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. కేంద్ర మంత్రిగా కూడా పని చేశారు. హిందూ అతివాద వ్యాఖ్యలతో ఆయన తరచూ వార్తల్లో నిలుస్తుంటారు.

# తృణమూల్ ఒంటరి పోరు

**బెంగాల్‌లో మొత్తం 42 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన**
- ఏడుగురు సిట్టింగులు ఔట్
- మహువాకు మళ్లీ చాన్స్
- మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్, సినీ నటి రచనా బెనర్జీకి అవకాశం

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 42 లోక్‌సభ స్థానాలకు అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆదివారం తమ అభ్యర్థులను ప్రకటించింది. తద్వారా వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయబోతున్నట్టు తేల్చేసింది. కాంగ్రెస్‌తో పొత్తు ఉంటుందని ప్రచారం జరిగినా అది ఉత్తదేనని స్పష్టమైంది. ఈసారి ఏడుగురు సిట్టింగ్ ఎంపీలను తృణమూల్ పక్కనపెట్టింది. మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్‌తో పాటు తెలుగు సహా పలు భాషల చిత్రాల్లో నటించిన రచనా బెనర్జీ వంటి కొత్తముఖాలకు అవకాశం కల్పించింది. 2022 ఉప ఎన్నికలో అసన్‌సోల్ నుంచి గెలిచిన బాలీవుడ్ నటుడు శత్రుఘ్న సిన్హాకు మరోసారి టికెటిచ్చారు. బసీర్హాత్‌లో సినీ నటి, సిట్టింగ్ ఎంపీ నుస్రత్ జహాన్‌ను తప్పించి మాజీ ఎంపీ హాజీ నూరుల్ ఇస్లాంను బరిలో దించారు. దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సందేశ్‌ఖాలీ ఈ నియోజకవర్గం పరిధిలోనే ఉంది. 23 మంది సిట్టింగుల్లో 16 మందికి టికెట్లు దక్కాయి. ఇద్దరు రాష్ట్ర మంత్రులు సహా 9 మంది ఎమ్మెల్యేలు లోక్‌సభ బరిలో దిగబోతున్నారు. గతేడాది లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురైన వివాదాస్పద ఎంపీ మహువా మొయిత్రాకు టికెట్ లభించింది. కృష్ణనగర్ నుంచే ఆమె మళ్లీ బరిలో దిగుతున్నారు. ఇక బహ్రాంపూర్ నుంచి ఐదుసార్లు నెగ్గిన కాంగ్రెస్ సీనియర్ నేత అధిర్ రంజన్ చౌదరిపై యూసుఫ్ పఠాన్ బరిలో దిగుతున్నారు. మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్ బర్ధమాన్–దుర్గాపూర్ స్థానం నుంచి పోటీ చేయబోతున్నారు. టికెట్లు రాని నేతలకు అసెంబ్లీ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని తృణమూల్ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. ఆమె ఆదివారం కోల్‌కతాలో భారీ బహిరంగ సభలో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తున్నామని, బీజేపీతోపాటు కాంగ్రెస్, సీపీఎం కూడా ప్రత్యర్థులేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు రెండు సీట్లే ఇస్తామని మమత గతంలో ఆఫర్ చేయడం, దానిపై ఆ పార్టీ స్పందించకపోవడం తెలిసిందే.

**మోదీకి భయపడే: కాంగ్రెస్**

బెంగాల్లో ఏకపక్షంగా మొత్తం లోక్‌సభ స్థానాలకూ తృణమూల్ అభ్యర్థులను ప్రకటించడంపై కాంగ్రెస్ మండిపడింది. ఇది ఏకపక్ష పోకడ అంటూ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. మమత బీజేపీకి సరెండరయ్యారని కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌధరి ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎక్కడ మళ్లీ ఈడీ, సీబీఐ దాడులు చేయిస్తారోనని భయపడే విపక్ష ఇండియా కూటమికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారన్నారు. మరోవైపు, తృణమూల్ జాబితా తమ పార్టీ మాజీలతో, బెంగాలేతరులతో నిండిపోయిందంటూ బీజేపీ ఎద్దేవా చేసింది.

## 15 కల్లా ఈసీల నియామకం!

**అదే రోజు పీఎం కమిటీ భేటీ**

**న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘంలో ఖాళీగా ఉన్న రెండు కమిషనర్ పోస్టులను ఈ నెల 15వ తేదీ నాటికల్లా భర్తీ చేసే అవకాశముందని అధికార వర్గాలు ఆదివారం వెల్లడించాయి. ఇందుకోసం ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని హై పవర్ కమిటీ 15న భేటీ అవుతుందని వివరించాయి. కమిటీలో ప్రధానితో పాటు ఒక కేంద్ర మంత్రి, లోక్‌సభలో విపక్ష నేత సభ్యులుగా ఉంటారు. మీటింగ్‌కు సంబంధించి సభ్యులకు శనివారమే నోటీసు పంపినట్టు సమాచారం. ఎన్నికల కమిషనర్ అనూప్ చంద్ర పాండే ఫిబ్రవరిలో రిటైరవడం, మరో కమిషనర్ అరుణ్ గోయల్ శనివారం ఆకస్మికంగా రాజీనామా చేయడం తెలిసిందే. దాంతో ముగ్గురు సభ్యులతో కూడిన ఎన్నికల సంఘంలో సీఈసీ రాజీవ్‌కుమార్ మాత్రమే మిగిలారు. కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు ఈసీ వచ్చే వారమే షెడ్యూల్ ప్రకటించనున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈసీలోని రెండు ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకు కేంద్ర న్యాయ మంత్రి, హోం శాఖ కార్యదర్శి, సిబ్బంది, శిక్షణ శాఖ కార్యదర్శితో కూడిన సెర్చ్ కమిటీ రెండు ప్యానెళ్లను రూపొందించాల్సి ఉంటుంది. రెండు పోస్టుల భర్తీ కోసం ఒక్కో ప్యానెల్‌లో ఐదు చొప్పున పేర్లుంటాయి. వాటి నుంచి రెండు పేర్లను ప్రధాని సారథ్యంలోని కమిటీ ఖరారు చేస్తుంది. వారిని కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్లుగా రాష్ట్రపతి నియమిస్తారు.

**గోయల్ రాజీనామా వెనక ఏం జరిగింది: విపక్షాలు**

అరుణ్ గోయల్ రాజీనామా వెనక కారణాలను బయట పెట్టాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. సీఈసీతో విభేదాలా, లేక మోదీ ప్రభుత్వంతోనా? లేదంటే కలకత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి అభిజిత్ గంగోపాధ్యయ తరహాలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై ఆయన పోటీ చేస్తారా?’’ అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. ఎన్నికల సంఘం వంటి స్వతంత్ర ప్రతిపత్తితో కూడిన రాజ్యాంగబద్ధ సంస్థలపై పెత్తనం చెలాయించాలని మోదీ సర్కారు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. స్వతంత్రంగా పని చేయాల్సిన ఈసీ అధికార బీజేపీ శాఖగా మారిందని శివసేన (ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ అన్నారు. టీఎన్ శేషన్ హయాంలో ఉన్న ఎన్నికల సంఘం ఇప్పుడు లేదన్నారు. గత పదేళ్లుగా ఎన్నికల సంఘం ప్రైవేట్ సంస్థగా మారుతోందని విమర్శించారు. ఎలక్షన్ కమిషన్‌లో బీజేపీ మనుషులను నియమించే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ముందు అరుణ్ గోయల్ రాజీనామాకు కారణాలేమిటో చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ నిలదీశారు.



ప్రమాణస్వీకారం తర్వాత ధన్‌ఖడ్, ముర్ము, మోదీతో ఖన్విల్కర్

**లోక్‌పాల్ ప్రమాణస్వీకారం**

లోక్‌పాల్ చైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ మాణిక్‌రావ్ ఖన్విల్కర్ (66) ఆదివారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు పాల్గొన్నారు.

# నేను డిఫరెంట్

**హామీలిచ్చి మరవడం నా నైజం కాదు: మోదీ**
- ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తున్నాం
- అభివృద్ధితో బుజ్జగింపు రాజకీయాలకు తెర: ప్రధాని

**ఆజంగఢ్:** తాను భిన్నమైన వ్యక్తినని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ‘‘సాధారణంగా రాజకీయ నాయకులు హామీలిచ్చి, వాటిని అమలు చేయకుండా తప్పించుకుంటూ ఉంటారు. నేను మాత్రం అలా కాదు’’ అని స్పష్టం చేశారు. ‘మోదీ భిన్నమైన (డిఫరెంట్) మట్టితో రూపొందాడు’ అన్నారు. గతంలో అధికారం చెలాయించిన ప్రభుత్వాలు ఎన్నో హామీలిచ్చాయని, కానీ వాటిని నిలబెట్టుకోలేదని విమర్శించారు. పథకాలను ప్రకటించి, వాటిని అమలు చేయకుండా ప్రజల కళ్లకు గంతలు కట్టాయన్నారు. 30–35 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వాలు చేసిన ప్రకటనలు, ఇచ్చిన హామీలను తాను సమీక్షించాని, అవి పెద్దగా అమల్లోకి రాలేదని తేలిందని వెల్లడించారు. ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం, శంకుస్థాపనలు చేయడం, ఎన్నికల తర్వాత హామీలిచ్చిన నాయకులు, ఆ శిలాఫలకాలు కనిపించకుండాపోవడం గతంలో ఒక తంతుగా ఉండేదన్నారు. ఈ విషయంలో తాను విభిన్నమైన వ్యక్తినని మోదీ వ్యాఖ్యానించారు. ఆయన ఆదివారం ఉత్తర ప్రదేశ్‌లోని ఆజమ్‌గఢ్‌లో పర్యటించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు సంబంధించి రూ.42,000 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఢిల్లీ, కడప, హుబ్బళ్లి, బెలగావి, కొల్హాపూర్ తదితర విమానాశ్రయాల్లో కొత్త టెర్మినల్ భవనాలకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. అభివృద్ధి విషయంలో యూపీ కొత్త శిఖరాలకు చేరుకుంటోందని, దాంతో విషం లాంటి బుజ్జగింపు రాజకీయాలు బలహీనపడుతున్నాయని చెప్పారు. బుజ్జగింపు, బంధుప్రీతి రాజకీయాల్లో చాలా ప్రమాదకరమన్నారు.

**ప్రాజెక్టులకు ఎన్నికలతో సంబంధం లేదు**

తాను ప్రారంభించిన, శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులకు రానున్న లోక్‌సభ ఎన్నికలతో సంబంధముందని ఎవరూ భావించొద్దని మోదీ అన్నారు. 2019 ఎన్నికల వేళ తానెన్నో ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశానని, అవి చాలావరకు పూర్తయ్యాయని గుర్తుచేశారు. 2047 నాటికి ‘వికసిత్ భారత్’ స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి కృషి చేస్తున్నానని తెలిపారు. అవినీతిని పరమావధిగా భావించే కుటుంబ పార్టీలు అధికారంలో ఉంటే అభివృద్ధి జరిగేది కాదన్నారు.

**ఈఎఫ్‌టీఏ ఒప్పందంపై హర్షం**

యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఈఎఫ్‌టీఏ)తో వాణిజ్య ఒప్పందంపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ అసోసియేషన్‌లో సభ్యదేశాలైన ఐస్‌ల్యాండ్, లీక్టెన్‌స్టీన్ నార్వే, స్విట్జర్లాండ్‌తో భారత్ కలిసి పని చేస్తుందని ప్రధాని అన్నారు.

## వచ్చే ఏడాదే ‘సముద్రయాన్’: కిరణ్ రిజిజు

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక సముద్రయాన్ ప్రాజెక్టును వచ్చే ఏడాది చివరికల్లా చేపడతమని కేంద్ర భూవిజ్ఞాన శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. సముద్ర గర్భంలో అన్వేషణ కోసం దేశంలోనే తొలి మానవ సహిత డీప్ ఓషియన్ మిషన్‌కు సముద్రయాన్ అని పేరుపెట్టారు. సముద్ర ఉపరితలం నుంచి 6 కిలోమీటర్ల లోతుకు సైంటిస్టులను పంపించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ ప్రాజెక్టులో భాగంగా ‘మత్స్య6000’ జలాంతర్గామి నిర్మాణం దాదాపు పూర్తయ్యిందని, ఈ ఏడాది ఆఖరుకల్లా పరీక్షించబోతున్నామని కిరణ్ రిజిజు తెలిపారు. సముద్రంలో 6 కిలోమీటర్ల లోతుకు కాంతి కూడా చేరలేదని, మనం జలాంతర్గామిలో సైంటిస్టులను పంపించబోతున్నామని వెల్లడించారు. సముద్రయాన్‌కు 2021లో కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ‘మత్స్య6000’ జలాంతర్గామిలో ముగ్గురు పరిశోధకులు ప్రయాణించవచ్చు. వచ్చే ఏడాది ఆఖర్లో హిందూ మహాసముద్రంలో వారు అన్వేషణ సాగించబోతున్నారు. ప్రపంచంలో ఇప్పటి వరకు అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, జపాన్ మాత్రమే ఇలాంటి ప్రాజెక్టులను విజయవంతంగా చేశాయి.

## పాకిస్తాన్ అధ్యక్షుడిగా జర్దారీ ప్రమాణం



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ 14వ అధ్యక్షుడిగా పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) నేత ఆసిఫ్ అలీ జర్దారీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఖాజీ ఫయిజ్ ఈసా ఆయనతో ప్రమాణం చేయించారు. జర్దారీ పాక్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి. ప్రమాణ స్వీకారోత్సవానికి పాకిస్తాన్ ప్రధానమంత్రి షహబాజ్ షరీఫ్, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ అసీమ్ మునీర్, జర్దారీ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. జర్దారీ 2008 నుంచి 2013 వరకు అధ్యక్షుడిగా పనిచేశారు. అధికార కూటమి ఉమ్మడి అభ్యర్థిగా ఆయన శనివారం అధ్యక్షుడిగా ఎన్నికైన సంగతి తెలిసిందే.

## నెతన్యాహూతో ఇజ్రాయెల్‌కు నష్టమే: బైడెన్

**విల్మింగ్టన్:** గాజాలో హమాస్‌పై యుద్ధం పేరిట ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ తన సొంత దేశానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ విమర్శించారు. నెతన్యాహూ అనాలోచిత చర్యల వల్ల ఇజ్రాయెల్‌కు లాభం కంటే నష్టమే ఎక్కువగా జరుగుతోందని అన్నారు. గాజాలో సాధారణ పౌరుల మరణాలను నియంత్రించడంలో నెతన్యాహూ దారుణంగా విఫలమవుతున్నారని ఆక్షేపించారు. బైడెన్ శనివారం మీడియాతో మాట్లాడారు. తిరుగుబాటుతో సంబంధం లేని పాలస్తీనియన్ల ప్రాణాలు కాపాడాలని, ఈ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఇజ్రాయెల్‌కు సూచించారు. గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మిలిటెంట్లు చేసిన దాడిని తాము ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. హమాస్‌ను వేటాడే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని వెల్లడించారు. కానీ, సాధారణ ప్రజలపై దాడి చేయడం సరైంది కాదని తేల్చిచెప్పారు. గాజాలో మరణాల సంఖ్య ఇజ్రాయెల్ చెబుతున్నదానికంటే ఎక్కువగానే ఉన్నట్లు తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. గాజాలో అమాయకుల మరణాలు ఇంకా పెరిగితే ఇజ్రాయెల్ అంతర్జాతీయ మద్దతును కోల్పోతుందని బైడెన్ కొన్ని రోజుల క్రితం హెచ్చరించిన సంగతి తెలిసిందే.

## హిమాచల్ ఎమ్మెల్యేల పిటిషన్‌పై విచారణ రేపు

**న్యూఢిల్లీ:** తమపై అనర్హత వేటును సవాలు చేస్తూ హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఆరుగురు కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలు పెట్టుకున్న పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరపనుంది. బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా విధిగా అసెంబ్లీకి హాజరై ఓటేయాలన్న పార్టీ విప్‌ను ధిక్కరించినందుకు వారిపై స్పీకర్ కుల్‌దీప్ సింగ్ పఠానియా అనర్హత వేటు వేయడం తెలిసిందే. వారంతా రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్‌కు ఓటేయడం, దాంతో కాంగ్రెస్ అభ్యర్థిగులాంనబీ ఆజాద్ అనూహ్య ఓటమి పాలవడం తెలిసిందే.

## పటేల్‌కు రాహుల్ నివాళులు

**గుజరాత్‌లో ముగిసిన న్యాయ్ యాత్ర**

**సూరత్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఆదివారం గుజరాత్ రాష్ట్రం సూరత్ జిల్లా బార్డోలీలోని స్వరాజ్ ఆశ్రమాన్ని సందర్శించారు. సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్‌కు ఘనంగా నివాళులర్పించారు. రాహుల్ యాత్ర గుజరాత్‌లో ముగిసింది. ఆయన 4 రోజుల్లో ఏడు జిల్లాలను చుట్టేశారు. 400 కిలోమీటర్లకు ప్రయాణించారు. సోమవారం యాత్రకు విరామం ఇచ్చారు. మంగళవారం మహారాష్ట్రలోని నందూర్బర్ జిల్లాలో యాత్ర పునఃప్రారంభం అవుతుంది. అక్కడ దళితుల సమ్మేళనంలో రాహుల్ పాల్గొంటారు. బార్డోలీ ఆశ్రమాన్ని స్వాతంత్ర్యోద్యమంతో సన్నిహిత సంబంధముంది. 1922లో సర్దార్ పటేల్ దీన్ని స్థాపించారు. మహాత్మాగాంధీ 1936, 1941లో ఈ ఆశ్రమంలో కొన్ని రోజులు బస చేశారు.

# పంజాబ్‌లో రైతుల ‘రైలురోకో’

**ఎంఎస్పీకి కేంద్రం తక్షణం చట్టబద్ధత కల్పించాల్సిందేనని డిమాండ్**



అమృత్‌సర్ శివార్లలో పట్టాలపై రైతులు, వారి కుటుంబీకులు

**చండీగఢ్:** పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతోసహా ఇతర సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంజాబ్‌లో రైతులు మళ్లీ ఆందోళనకు దిగారు. సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా పిలుపు మేరకు రైల్‌రోకోలో భాగంగా ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రైలు పట్టాలపై బైఠాయించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రైలురోకో జరగడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లోని 52 ప్రాంతాల్లో రైలురోకో నిర్వహించామని రైతులు వెల్లడించారు. డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, లేకపోతే తమ పోరాటం ఉధృతం చేస్తామని వారు తేల్చిచెప్పారు. రైలురోకోలో పలు రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రాణం తీసిన టెస్లా కారు రివర్స్

**అమెరికాలో విషాదం ● ఫార్‌మోస్ట్ గ్రూప్ సీఈఓ ఏంజెలా దుర్మరణం**



**వాషింగ్టన్:** అమెరికాతో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. డ్రైవింగ్ మోడ్‌లో ఉండాల్సిన టెస్లా కారును పొరపాటున రివర్స్ మోడ్‌కు మార్చడంతో అది చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అమెరికా రిపబ్లికన్ పార్టీ సెనెటర్ మిట్చ్ మెక్‌కానెల్ బంధువు, ప్రముఖ షిప్పింగ్ కంపెనీ ఫార్‌మోస్ట్ గ్రూప్ సీఈఓ ఏంజెలా చావో(50) మృతి చెందారు. శుక్రవారం రాత్రి ఆమె తన మిత్రులతో కలిసి టెక్సాస్‌లోని ఆస్టిన్ సమీపంలో ఉన్న తన ప్రైవేట్ అతిథి గృహానికి వెళ్లారు. 900 ఎకరాల్లో ఈ ఎస్టేట్ విస్తరించి ఉంది. మిల్లర్ సెలయేర్ ఇక్కడ ఈ ఎస్టేట్ గుండా ప్రవహిస్తోంది. ఏంజెలా చావో ఓ రెస్టారెంట్‌కు వెళ్లి, రాత్రిపూట టెస్లా కారులో తన అతిథి గృహానికి బయలుదేరారు. మధ్యలో త్రీ పాయింట్ మూలమలుపు వచ్చింది. దానిని దాటే క్రమంలో ఏంజెలా గందరగోళానికి గురై పొరపాటున కారును రివర్స్ మోడ్‌లోకి మార్చారు. దాంతో అది వేగంగా వెనక్కి వెళ్లి కొలనులో పడిపోయింది. ఏంజెలా భయాందోళనకు గురై స్నేహితురాలికి ఫోన్ చేశారు. వెంటనే గెస్ట్ హౌస్ మేనేజర్, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే కారు పూర్తిగా మునిగిపోయింది. అద్దాలు చాలా స్ట్రాంగ్‌గా ఉండటంతో వాటిని పగలగొట్టడం సాధ్యం కాలేదు. చివరికి కారును బయటకు తీసినా అప్పటికే ఏంజెలా ప్రాణాలు కోల్పోయారు. ఆమె అమెరికాలో ప్రముఖ బిలియనీర్, వెంచర్ క్యాపిటలిస్ట్ జిమ్ బ్రేయార్ సతీమణి. అమెరికా మాజీ రవాణాశాఖ మంత్రి ఎలాయినే చావోకు సోదరి అవుతారు.

# సాక్షి
# విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

సోమవారం । 11 । మార్చి । 2024






### అబాకస్ పోటీలు

పెనమలూరు: విశ్వం ఎడ్యూటెక్ సొల్యూషన్స్ కానూరులో ఆదివారం రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలు నిర్వహించింది. 750 పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.



### భారతీయ చిత్రకళ ప్రపంచానికే..

భారతీయ చిత్రకళ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. -8లో▸

### నేడు స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్, మండల స్థాయిలోనూ కార్యక్రమం కొనసాగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## న్యూస్‌రీల్

### ఘనంగా వసంతోత్సవం



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం వసంతోత్సవం ఘనంగా జరిగింది. ఆలయంలో ఉదయం 9 గంటలకు స్వామివార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు కల్యాణం చేసిన ఉదయ్‌కిరణ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కొండ కిందకు వచ్చిన తరువాత గ్రామంలో మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి రంగులు చల్లుకొని వసంతోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివార్ల విగ్రహాలతో పుణ్య కృష్ణానది తీరానికి భక్తులు చేరుకున్నారు. నది వద్ద ప్రత్యేక పూజలు చేసి త్రిశూల స్నానం చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి ధ్వజ అవరోహణ, మూగబలి, ద్వాదశ ప్రదక్షిణలు, స్వామివారి పవళింపుసేవ, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. సంతానం లేని వారికి నందీ ముద్దలు అందజేశారు.

### 13న ప్రధానమంత్రితో ముఖాముఖి

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ, ఎన్‌టీసీఎఫ్‌డీసీ పథకాల లబ్ధిదారులతో ప్రధానమంత్రి సు-రాజ్ ద్వారా ముఖాముఖీ కార్యక్రమం ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బి. చంద్రలీల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లాలోని ఆయా పథకాల లబ్ధిదారులు హాజరవుతారన్నారు. వీటితో పాటుగా జిల్లాకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, సంక్షేమశాఖాధికారులు పాల్గొనాలని ఆమె తెలిపారు. 13వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కలెక్టర్ రాజాబాబు, ఇతర అధికారులు హాజరుకానున్నట్లు ఆమె వివరించారు.

### నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



పెడన: పెడన పడమట వీధిలోని శ్రీవిఘ్నేశ్వర ప్రార్థన మందిరంలో ఆదివారం ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్(ఏఐడబ్ల్యూఎఫ్)కృష్ణాజిల్లా శాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇనమాల శివరాం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మంలో నూతన కార్యవర్గ సభ్యులకు శ్రీశైలం, తిరుపతి నిత్యాన్నదాన దేవాంగ సత్రాల అధ్యక్షుడు బొమ్మన దుర్గాప్రసాద్ నియామక పత్రాలు అందజేశారు. ఫెడరేషన్ జాతీయ గౌరవాధ్యక్షుడు నక్కిన చిన వెంకట్రాయుడు కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కృష్ణాజిల్లా శాఖ అధ్యక్షుడిగా పిచ్చుక ఫణి కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆకురాతి జనార్ధనరావు, కోశాధికారిగా తాళ్ల బాలాజీ బాధ్యతలు తీసుకున్నారు. ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, పెడన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భండారు ఆనందప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం చేనేత మనుగడ, చేనేత కార్మికుల సంక్షేమం, చేనేతలకు రాజకీయ ప్రాధాన్యత అంశాలు - భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో జాతీయ, రాష్ట్రంలోని వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### కిక్కిరిసిన ఇంద్రకీలాద్రి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. వరుస సెలవులు, మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తీర్థయాత్రలు చేసుకుంటున్న భక్తులు ఆదివారం ఇంద్రకీలాద్రికి చేరుకుని ఆది దంపతులను దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కనిపించింది. తెల్లవారుజామున పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. మరో వైపున అమావాస్య ఘడియల నేపథ్యంలో తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమంలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. మరో వైపున అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. అమ్మవారికి మహా నివేదన అనంతరం భక్తుల రద్దీ మరింత పెరిగింది. మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించగా పలువురు ఉభయదాతలు, భక్తులు ప్రముఖులు పాల్గొన్నారు.

# పేదింటికి శాశ్వత సంబరం

- 'వాంబే' ఇళ్ల రిజిస్ట్రేషన్లకు జీఓ నంబర్ 4, 32 జారీ
- 22ఏ నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగింపు
- జీవో నంబర్ 463 ప్రకారం నిరభ్యంతర ఆక్రమిత ఇళ్లకూ పట్టాలు
- విజయవాడలో మొత్తం 31,866 పేద కుటుంబాలకు లబ్ధి
- సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీకి ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఆ ఇళ్లు తమ పేరు మీదనే ఉంటాయి గానీ, హక్కులుండవు.. ఆపదవేళ అక్కరకు రావు.. దీంతో ఉండటానికి గూడు ఉందనేగానీ దాని వల్ల పూర్తి ప్రయోజనాలు పొందలేని దుస్థితి. అటువంటి వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గొప్ప మేలు చేసింది. ఆయా ఇళ్లకు శాశ్వత హక్కులు కల్పించేందుకు చర్యలు చేపట్టింది.

**పునరావాసం కింద ఇచ్చిన ఇళ్లకు..**

కృష్ణానది తీరం, కెనాల్‌బండ్, రోడ్ల మార్జిన్‌లు, జవహర్ బస్ టెర్మినల్ తదితర ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించి, వారికి పునరావాసం కింద విజయవాడ నగరపాలక సంస్థ అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో స్థలాలు కొని, పట్టాలు ఇచ్చింది. 1970–80 నుంచి ఉన్న ఆక్రమణలను తొలగించి 17,741వేల మందికి పైగా పట్టాలు పంపిణీ చేసింది. అయితే ఆ పట్టాలను లబ్ధిదారులు వారి తదనంతరం అనువంశికంగా పిల్లలు మాత్రమే అనుభవించే హక్కు కల్పించింది. కాగా ప్రభుత్వం ఓటీఎస్ పథకం కింద పేదలకు రిజిస్ట్రేషన్లు చేయడంతోపాటు వారు అమ్ముకొనే అవకాశం కల్పించింది. దీనిని దృష్టిలో ఉంచుకొని స్థానిక ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పునరావాసం కింద వీఎంసీ పరిధిలో పేదలకు ఇచ్చిన ప్లాట్లు అన్నింటినీ 22ఏ నుంచి తొలగించి శాశ్వత హక్కు కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన సీఎం, క్యాబినెట్ ఆమోదం తెలిపి 22ఏ జాబితా నుంచి తొలగించి, వారికి శాశ్వత హక్కు కల్పించేలా జీవో 04ను జారీ చేశారు.

**ఎక్కడ, ఎన్ని ఇళ్లు అంటే..**

విజయవాడ శివారు సెంట్రల్, వెస్ట్ ప్రాంతాల్లోని పాయకాపురం కాలనీలుగా పేరుగాంచిన ఊర్మిళ సుబ్బారావు నగర్, కేఎల్‌రావు నగర్, న్యూరాజరాజేశ్వరిపేట, వడ్డెర కాలనీ, అజిత్‌సింగ్‌నగర్, వాంబే కాలని, శాంతినగర్, ఎల్‌బీఎస్‌నగర్, పాయకాపురం, సుందరయ్య నగర్, రాధానగర్, రాజీవ్‌నగర్, ప్రజాశక్తి నగర్, ఎస్ఎస్‌సీ బోస్ నగర్ ప్రాంతాల్లో 21,027 పేదల ఇంటి స్థలాలకు సంబంధించి 22ఏ నిషేధిత ఆస్తుల జాబితాలోకి తొలగించి శాశ్వత హక్కులు కల్పించింది. జీవో నంబర్ 4, 32 ప్రకారం 7,210 ఇంటి ప్లాట్లకు నామమాత్రపు ఫీజుతో రిజిస్ట్రేషన్లు చేసింది.

### పునరావాసానికి పూర్తి హక్కులు



పాయకాపురంలో ఇళ్లు

| నియోజక వర్గం | లబ్ధిదారుల సంఖ్య |
|---|---|
| విజయవాడ సెంట్రల్ | 21,393 |
| విజయవాడ వెస్ట్ | 7,830 |
| విజయవాడ ఈస్ట్ | 2,643 |
| మొత్తం | 31, 866 |

**అసైన్డ్ పట్టాలకు..**

పదేళ్లు కలిగిన అసైన్డ్ పట్టాలకు సంబంధించి 2,643 మందికి శాశ్వత హక్కులు కల్పిస్తున్నారు. విజయవాడ ఈస్ట్ పరిధిలో గుణదల, మాచవరం, కుమ్మరి చెరువు, నల్లచెరువు, పటమటలో 1,120 ఎకరాలకు శాశ్వత హక్కులు కలుగుతున్నాయి. విజయవాడ సెంట్రల్‌లో అంబేడ్కర్ కాలనీ, దేవినేని గాంధీపురం, వెంకటేశ్వర నగర్, కాకానినగర్, పసుపుతోట, నేతాజీనగర్, నరసరాజునగర్, అంబేడ్కర్‌నగర్, గిరిపురం, నిజాంగేట్, నెహ్రూనగర్, ఉర్మిళానగర్‌లో 435 ఎకరాలకు విముక్తి కలుగుతోంది. విజయవాడ వెస్ట్ పరిధిలో విద్యాధరపురం, భవానీపురంలో 159 ఎకరాలకు శాశ్వత హక్కులు కల్పిస్తున్నారు.

### నిరభ్యంతర ఆక్రమణలకు..

నగరంలో నిరభ్యంతర ఆక్రమిత ఇళ్లకు ప్రభుత్వం శాశ్వత హక్కులు కల్పించింది. జీవో 463 ప్రకారం నగరంలో 9,125 ఇళ్ల నిర్మాణాలు చేసుకొన్న లబ్ధిదారులకు మేలు చేకూరుతోంది.

- విజయవాడ సెంట్రల్‌లో అంబేద్కర్‌కాలనీ, దేవినేని గాంధీపురం, వెంకటేశ్వరనగర్, కాకాని నగర్, పసుపుతోట, నేతాజినగర్, నరసరాజునగర్, అంబేద్కర్ నగర్, గిరిపురం, నిజాంగేట్, నెహ్రూనగర్‌లలో 1,150 మందికి లబ్ధి కలుగుతోంది.
- విజయవాడ వెస్ట్‌లో విద్యాధరపురం, భవానీపురం, వించిపేట, మల్లికార్జునపేటలో 6,452 మంది లబ్ధి చేకూరుతోంది.
- విజయవాడ ఈస్ట్ పరిధిలో గుణదల, మాచవరం, కుమ్మరి చెరువు, నల్లచెరువు, రెల్లీస్ కాలని, పటమటలో 1523 మంది మేలు కలుగుతోంది.
- గత 40 ఏళ్ల అపరిష్కృతంగా ఉన్న నందమూరినగర్ ఆర్‌అండ్‌బీ స్థల సమస్యకు పరిష్కారం చూపారు. భ్రమరాంబపురంలో 15.06 ఎకరాల్లో 1,189 ఇళ్ల నిర్మాణాలు, వీటితోపాటు కృష్ణలంక, విజయవాడ సెంట్రల్ ఇళ్ల నిర్మాణాలను రెగ్యులరైజ్ చేశారు.

### మరింత భరోసా..



పేరుకు సొంత ఇల్లు ఉన్నా దానిపై మాకు ఎటువంటి అధికారం లేకపోవడంతో పిల్లల చదువులు, పెళ్లిళ్లు, అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు దేనికి అక్కరకు వచ్చేవి కావు. గతంలో ఎంతమందికి దరఖాస్తులు చేసుకున్నా అసలు పట్టించుకోలేదు. జగనన్న హయాంలో మా అందరికీ మా ఇంటిపై పూర్తి హక్కును కల్పించడం చాలా సంతోషంగా ఉంది.

– షేక్ నాగుర్‌బీ, లబ్ధిదారురాలు

### పేద ఇళ్లకు శాశ్వత హక్కులు..



నగరంలో పేద ప్రజల ఇళ్ల రిజిస్ట్రేషన్ల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఆయన సానుకూలంగా స్పందించారు. విజయవాడ కార్పొరేషన్‌లో పునరావాస కాలనీల్లో పేదలకు ఇచ్చిన పట్టాలకు శాశ్వత హక్కులు కల్పిస్తున్నారు. వీటి ద్వారా వారి జీవన ముఖచిత్రం పూర్తిగా మారనుంది. నగరంలో 31,866 పేద కుటుంబాలకు లబ్ధి కలుగుతోంది. సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా ఇంటి పట్టాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– డాక్టర్ పి. సంపత్‌కుమార్, జేసీ, ఎన్టీఆర్ జిల్లా

### శ్రీకాళహస్తీశ్వర స్వామికి దుర్గమ్మ పట్టువస్త్రాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీకాళహస్తిలోని జ్ఞాన ప్రసూనాంబిక దేవి సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వార్లకు ఆదివారం దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను సమర్పించారు. శ్రీకాళహస్తిలోని స్వామివారి ఆలయంలో మహా శివరాత్రిని పురస్కరించుకొని ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఆలయ ఈవో కేఎస్ రామారావు, పాలక మండలి సభ్యులు, వేద పండితులు ఆదివారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. పట్టువస్త్రాలు సమర్పించేందుకు శ్రీకాళహస్తికి చేరుకున్న దుర్గగుడి అధికారులు, అర్చకులను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని, స్వామి వార్లను దర్శించుకున్న అనంతరం ఆలయ అర్చకులకు పట్టువస్త్రాలను సమర్పించారు.

### నేడు ఇంటర్వ్యూలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థలో ఉన్న వివిధ ఖాళీలను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఆప్కాస్ ద్వారా భర్తీ చేసేందుకు సోమవారం వివిధ ప్రదేశాల్లో ఇంటర్వ్యూలు, సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. గతేడాది డిసెంబర్ 19న వార్తా పత్రికల్లో ఇచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించి పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. కాల్ లెటర్ అందుకున్న అభ్యర్థులు తుమ్మలపల్లి కళాక్షేత్రం, గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్, ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, సత్యనారాయణపురంలోని ఏకేటీపీఎంసీహెచ్ స్కూల్ వద్ద గల నగరపాలక సంస్థ సర్కిల్-2 కార్యాలయం, మహాత్మాగాంధీ రోడ్‌లోని దండమూడి రాజగోపాలరావు(డీఆర్ఆర్) స్టేడియంలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. కాల్ లెటర్‌తో పాటు చిరునామా ధ్రువీకరణ పత్రం, అర్హత పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

# వరాల మాసం.. దీక్షా పర్వం

### పవిత్ర రంజాన్ మాసం ఆసన్నం

- నేటి సాయంత్రం నెలవంక దర్శనంతో నెల ఆరంభం
- 12 నుంచి ఉపవాస దీక్షలు
- రోజా, నమాజ్, జికర్, దువాలతో గడపనున్న ముస్లింలు

సాక్షి, మచిలీపట్నం: త్యాగనిరతికి చక్కటి మార్గం పవిత్ర రంజాన్ మాసం. నేటి సాయంత్రం (సోమవారం) నెలవంక కనిపిస్తే ఆధ్యాత్మిక నెల ప్రారంభమవుతుంది. సూర్యాస్తమయం వేళ మగ్రిబ్ నమాజు తర్వాత మాసం ఆరంభమైతే అప్పటి నుంచే ముస్లింలు ఆధ్యాత్మికంగా గడుపుతారు. మంగళవారం నుంచి ఉపవాస దీక్షలు (రోజా) పాటించే అవకాశం ఉండటంతో అందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రాత్రి ఇషా నమాజు తర్వాత ప్రత్యేక తరావీ నమాజు చేస్తారు. క్రమశిక్షణ, శాంతికి అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇష్టమైన వంటకాలు తినడం, పానియాలు తాగడం వంటి వాటిని త్యాగం చేసుకొని సామాన్యం జీవితం గడుపుతారు. అల్లాహ్‌ను ఆరాధిస్తూ ఇమామ్ ఆధ్వర్యంలో పంక్తిలో నమాజ్ చేస్తారు. ముస్లింలకు ఇదొక శిక్షణ మాసం. మహమ్మద్ ప్రవక్త సొల్లెల్లాహు అలైహి వసొల్లం ఆచరణలను తమ నడవడికలో ఇమిడ్చుకునేందుకు ప్రయత్నిస్తారు. ఈ నెలలో ముస్లింలు అల్లా నుంచి వరాలు అందుకునే సౌభాగ్యం కలుగుతుంది. కఠోర దీక్ష, చిత్తశుద్ధితో ప్రార్థించిన వారికి చక్కటి జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తుందని మత పెద్దలు అంటారు. చెడు జోలికి వెళ్లకుండా, ఎవరికీ కీడు చేయకుండా, తమ శక్తి కొలది దాన ధర్మాలు చేస్తారు. దైవ సాన్నిధ్యంలో గడుపుతారు. ఇదే మాసంలో అవతరించిన దివ్య ఖురాన్ ఎక్కువగా పఠిస్తారు.



మచిలీపట్నం సూకర్లబాదులోని రజా మసీదును విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

**మూడు భాగాల 'రంజాన్'..**

- పేదవారి ఆకలి, దప్పికలు తెలిపే మాసం రంజాన్ మూడు దశ(అశ్ర)ల్లో పాటిస్తారు.
- మొదటి 10 ఉపవాసాలను రహమత్‌కే రోజే (దైవ కరుణ ఉపవాసాలు) అంటారు. సృష్టికర్త దయ, అనుగ్రహాలు పొందేలా దైవారాధనలు చేస్తారు.
- 11 నుంచి 20వ ఉపవాసాలను మగ్ఫిరత్‌కే రోజే అంటారు. అంటే క్షమాపణలు కోరేవని అర్థం.
- 21 నుంచి చివరి ఉపవాసాలను జహన్నమ్ సే ఫనా మాంగ్నేకే రోజే అంటారు. అంటే పరలోకంలో నరకాగ్ని నుంచి కాపాడమని అల్లాను వేడుకోవడం.

**రేపటి నుంచి రోజా..**

ఇస్లామిక్ నెల ప్రతి చంద్ర దర్శనం నుంచి ఆరంభమై తిరిగి అమావాస్య తర్వాత కనిపించే నెలవంకతో ముగుస్తుంది. సోమవారం చంద్ర దర్శనంతో రంజాన్ ప్రారంభం అయితే.. మరుసటి రోజు నుంచి రోజా (ఉపవాసాలు) మొదలు పెడతారు. అర్ధరాత్రి తర్వాత 2–3 గంటల మధ్య నిదురలేచి వంటలు చేసుకొని తెల్లవారు జామున 4.58 గంటల్లోపు భోజనం (సహేరి)తిని ఆ తర్వాత ఉపవాసం ఆరంభిస్తారు. సాయంత్రం 6:35గంటల వరకు ఎలాంటి ఆహారం, పచ్చి మంచినీళ్లు కూడా తాగకుండా నిష్ఠతో పూర్తి చేస్తారు.

**ఆధ్యాత్మిక సందడి..**

రంజాన్ మాసం ప్రారంభంతో ఆధ్యాత్మిక సందడి పెరగనుంది. రోజా, నమాజ్, జికర్, ఖురాన్ పఠనం, దువాలతో ఆధ్యాత్మింగా గడపనున్నారు. సహేరి, ఇఫ్తార్ విందుల హడావుడి పెరగనుంది. రాజకీయ పార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థలు కుల మతాలకు అతీతంగా కార్యక్రమాలు నిర్వహిస్తారు. రంజాన్ మాసంలో హలీమ్, హరీస్ విక్రయించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తారు. దీంతో పాటు ఖర్జూరం, ఇతర పండ్ల వినియోగం పెరగనుంది.

### సౌకర్యాల కల్పన

పవిత్ర రంజాన్ మాసంలో మసీదుల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో పాటు తగిన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. సీఎం వైఎస్ జగన్ సూచనల మేరకు కలెక్టర్ పి. రాజాబాబు ఇటీవలే రెవెన్యూ, గ్రామ పంచాయతీ, మున్సిపల్, విద్యుత్, పోలీసు అధికారులతో రంజాన్ మాసం నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆయన ఆదేశించారు.

### నెల పొడుపు తర్వాత రోజు నుంచి..



నెల పొడుపు చూసిన మరుసటి రోజు నుంచి ఉపవాసదీక్షలు ప్రారంభమవుతాయి. సోమవారం సాయంత్రం నెలపొడుపు కనిపించే అవకాశముంది. మంగళవారం నుంచి ఉపవాసాలను ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నాం. రంజాన్ మాసం చాలా పవిత్రమైన నెల. ఈ నెల రోజులు మానవ జీవనాన్ని ఎంతగానో ప్రభావితం చేసే అనేక విషయాలను ఖురాన్ వివరించింది.

– నయీమ్ ఖదీర్, ఇమామ్, షాహీమసీద్, విజయవాడ

# మము దీవించు మల్లేశ్వరా

### పూర్ణాహుతితో ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న మహా శివరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం 9 గంటలకు మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ శర్మ పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో రామారావు దంపతులు, ఈఈ ఎల్.రమాదేవి పాల్గొన్నారు. అనంతరం యాగశాలలో ధాన్యకోట్నోత్సవం నిర్వహించగా, ఆలయ చైర్మన్ రాంబాబు, ఈవో రామారావు దంపతులు పాల్గొన్నారు. అనంతరం వసంతోత్సవాన్ని నిర్వహించగా, ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది ఒకరిపై మరొకరు గులాల్‌లు చల్లుకుంటూ వేడుకను ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను పల్లకీపై ఊరేగింపుగా దుర్గాఘాట్‌కు తీసుకెళ్లారు.

**దుర్గాఘాట్‌లో అవభృదోత్సవం**

దుర్గాఘాట్‌లో పవిత్ర కృష్ణానదిలో గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్లకు అవభృదోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆది దంపతుల ఉత్సవ మూర్తులకు మంగళ స్నానాలను జరిపించారు. అనంతరం ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకున్నారు.



దుర్గాఘాట్‌లో అవభృదోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



ధాన్యకోట్నోత్సవం నిర్వహిస్తున్న చైర్మన్ రాంబాబు, ఈవో రామారావు

**నేడు ద్వాదశ ప్రదక్షిణలు..**

మహా శివరాత్రిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. సోమవారం సాయంత్రం స్వామి వారికి పంచహారతుల సేవ అనంతరం ద్వాదశ ప్రదక్షిణలు, అనంతరం పవళింపు సేవ, శయనోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

■ జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలోని బలుసుపాడు రోడ్‌లో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో 5వ తరగతి(ఇంగ్లిష్ మీడియం), ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 5వ తరగతి పరీక్షకు మొత్తం 487 మంది విద్యార్థులకు గానూ 434 మంది హాజరయ్యారు. అలాగే ఇంటర్‌మీడియెట్ పరీక్షకు 394 మంది హాజరుకావాల్సి ఉండగా, 370 మంది హాజరయ్యారు.

# ఎన్నికల్లో బీసీల సత్తా చూపించాలి

### ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): యాదవులకు అండగా నిలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రాబోయే ఎన్నికలలో ఓట్లు వేసి రుణం తీర్చుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక చుట్టుగుంట టింబర్ మర్చంట్ అసోసియేషన్ హాలులో ఆదివారం సాయంత్రం యాదవుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యాదవులను చంద్రబాబు నాయుడు మోసం చేశారని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి యాదవులకు రాజ్యసభ సీటు ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే అన్ని పదవులలో బీసీలకు సముచిత స్థానం కల్పించారని అన్నారు. రాబోయే ఎన్నికలలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు యాదవులందరూ అండగా నిలిచి అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంతమంది యాదవుల అభిమానం చూస్తుంటే తనకు ఆనందంగా ఉందన్నారు. తాను యాదవులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీలకు అండగా నిలిచిందన్నారు. టీడీపీ ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు బ్యాక్ బోన్ అని సముచిత స్థానం కల్పించారన్నారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేటర్లు యాదవ సంఘం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి అనిల్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది

## క్లుప్తంగా

### సావిత్రిబాయి పూలే చిరస్మరణీయురాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): బలహీన వర్గాల మహిళల అభ్యున్నతికి విశేష కృషి చేసిన సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఏపీ పీటీడీ (ఆర్టీసీ) బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు ఆధ్వర్యంలో ఆదివారం సంఘ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే చిరస్మరణీయురాలని పేర్కొన్నారు. మహిళలు అభివృద్ధి చెందాలంటే విద్య అవసరమని గుర్తించి ఆ రోజుల్లో ప్రత్యేకంగా పాఠశాల స్థాపించారని గుర్తు చేశారు. అదే విధంగా అనాథ పిల్లలకు ఆశ్రమాలను ఏర్పాటు చేసి వారికి విద్యాబుద్ధులు నేర్పించారని తెలిపారు. నాటి సతీ సహగమనాన్ని వ్యతిరేకించి వితంతు మహిళలకు పునర్వివాహాలు చేసిన మహనీయురాలు అని కొనియాడారు. కార్యక్రమంలో పి.పార్వతి, ధనలక్ష్మి, ప్రమీల, ఎం.పార్వతి, యశోద, డి.అంకినీడు, పి. రాంబాబు, పి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### దాలిపర్రులో ఎస్జీటీ ఉపాధ్యాయుడు సస్పెన్షన్

పెడన: ఘంటసాల మండలం దాలిపర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)గా విధులు నిర్వహిస్తున్న జి. శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణల గురించి ఘంటసాల మండల విద్యాశాఖాధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా సస్పెండ్ చేశామని డీఈవో పేర్కొన్నారు. గ్రామంలోని పలువురు వద్ద నుంచి అధిక మొత్తం నగదు అప్పుగా తీసుకోవడమే కాకుండా ఐపీ పెట్టారు. అదీ కాకుండా పాఠశాలకు చెప్పా పెట్టకుండా గైర్హాజరవుతూ వచ్చారు. గ్రామస్తులు ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి రాగా జిల్లా విద్యాశాఖాధికారి విచారణ చేయించి శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు డీఈవో తెలిపారు.

# ప్రణాళికతో చదివితే మెరుగైన ఫలితాలు

- ఈ నెల 18 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- శ్రద్ధ చూపితే మంచి మార్కులు సాధించే అవకాశం
- సబ్జెక్టు నిపుణుల సూచన



పదో తరగతి విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లాలో పదో తరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ఏడు పేపర్లతో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రణాళిక ప్రకారం సన్నద్ధమైతే మెరుగైన ఫలితాలు సాధించడం కష్టమేమీ కాదంటున్నారు సబ్జెక్ట్ నిపుణులు. పదో తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో సబ్జెక్టు నిపుణులు చెబుతున్నారు. ఆ దిశగా ముందుకు సాగితే మంచి మార్కులను సాధించేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. ఆయా సబ్జెకుల ఉపాధ్యాయులు ఇచ్చిన సూచనలు ఇవే.

### రైటింగ్ స్కిల్ పరీక్షిస్తారు



విద్యార్థుల్లోని సృజనాత్మకతను రైటింగ్ స్కిల్‌లో పరీక్షిస్తారు. లెటర్ రైటింగ్, కాన్వర్సేషన్, డైరీ ఎంట్రీ, ఎడిటర్ లెటర్, బ్రయోగ్రాఫికల్ స్కెచ్, ఫ్రేమింగ్ డబ్ల్యుహెచ్ ప్రశ్నలు లేకుంటే ఇన్ఫర్మేషన్ ట్రాన్స్‌ఫర్‌పై ప్రశ్నలు ఇస్తారు. ఇచ్చిన గ్రాఫ్ లేదా చార్ట్‌కి పేరాగ్రాఫ్ రాయాలి. వీటిపై పట్టు సాధిస్తే 30 మార్కులు సాధించే వీలుంది. 33వ ప్రశ్న ఏ, బీ రీడింగ్ నుంచి 35వ ప్రశ్న కచ్చితంగా సి రీడింగ్ నుంచి వస్తుంది.

– ఎం.సువర్ణకుమార్, ఆంగ్ల ఉపాధ్యాయులు

### సాధన ద్వారానే లెక్కల్లో మార్కులు



మ్యాథ్స్‌లో 1, 2, 4 మార్కుల ప్రశ్నలకు చాయిస్ ఉండదన్న విషయాన్ని విద్యార్థులు గమనించాలి. 8 మార్కుల ప్రశ్నలకు మాత్రమే చాయిస్ ఉంటుంది. ప్రస్తుత విధానంలో ఇస్తున్న ప్రశ్నపత్రం ఏ, బీ గ్రేడ్ విద్యార్థులు అధికంగా మార్కులు పొందేందుకు, సీ డీ గ్రేడ్ విద్యార్థులు ఉత్తీర్ణులు కావడానికి అనువుగా ఉంది. ఏ, బీ గ్రేడ్ విద్యార్థులు 95కు పైగా మార్కులు సాధించాలంటే 4, 8 మార్కుల ప్రశ్నలపై దృష్టి సారించాలి. బాగా సాధన చేయాలి.

– జి.ఆనంద్‌కుమార్, గణిత ఉపాధ్యాయులు

### ప్రశ్నపత్రాన్ని చదవాలి



తెలుగులో ఈ ఏడాది పద్యం పురాణం, ప్రతి పదార్థం తొలగించారు. దాని స్థానంలో పాఠ్యాంశంలో ఉన్న పద్యం ఇచ్చి ప్రశ్నలు ఇస్తారు. లేఖా ప్రక్రియ లేదా కరపత్రం సాధన చేస్తే సులభంగా ఎనిమిది మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. అక్షర దోషాలు, కొట్టివేతలు లేకుండా జవాబులు రాయాలి. భావ వ్యక్తీకరణ, సృజనాత్మకతకు 36 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నపత్రాన్ని అవగాహన చేసుకున్న తరువాత వచ్చిన ప్రశ్నలు ముందుగా రాసుకుంటే విద్యార్థులు మంచి మార్కులు పొందవచ్చు.

– కె.వాసుదేవరావు, తెలుగు పండిట్

### ప్రమాణాలు పరీక్షించేలా ఇస్తారు



సోషల్‌లో పట్టికలు, గ్రాఫ్‌లు, మ్యాప్ పాయింటింగ్, సమాచార విశ్లేషణ వంటి వాటిని బాగా సాధన చేయాలి. భారతదేశ, ప్రపంచ పటాల్లో భౌగోళిక ప్రదేశాలు గుర్తించేలా సాధన చేస్తే తక్కువ సమయంలో ఎనిమిది మార్కులు సాధించవచ్చు. మ్యాప్ పాయింటింగ్‌లో కూడా ప్రశ్నలు నేరుగా ప్రదేశాలు గుర్తించమని ఇవ్వకపోవచ్చు. పాఠ్యాంశం చివర ఉన్న ప్రశ్నలను యథాతథంగా ఇవ్వకుండా, విద్యా ప్రమాణాలను పరీక్షించే విధంగా ఇస్తారు.

– డీడీకే రంగమణి, సోషల్ ఉపాధ్యాయురాలు

### పట్టు సాధించాలి



భౌతికశాస్త్రంలో కాంతి, విద్యుత్ యూనిట్లు, సూత్రాల ఉత్పాదన, గణన, నిత్యజీవిత వినియోగం, భేదాలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. పాఠ్య పుస్తకంలో పట్టికల రూపంలో ఉన్న సమాచారంపై విద్యార్థికి ఉన్న అవగాహన తెలుసుకునేందుకు ఆరు నుంచి ఎనిమిది మార్కుల వరకు ప్రశ్నలు వచ్చే అవకాశముంది. ప్రయోగాలు, డయాగ్రమ్స్‌పై దృష్టి సారిస్తే ఎనిమిది మార్కులు సాధించడానికి వీలుంటుంది.

– ఎస్.శ్రీనివాసరావు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు

### పూర్తిగా అర్థం చేసుకోవాలి



హిందీ పాఠ్యాంశాలను చదవడం, రాయడం, బాగా సాధన చేయడంపై శ్రద్ధ వహించాలి. పాఠ్యాంశాన్ని పూర్తిగా అర్థం చేసుకొని చదివితే ప్రశ్నలు ఎలా అడిగినా సమాధానాలు రాయవచ్చు. సులభంగా మార్కులు తెచ్చుకోవడానికి అవకాశం ఉన్న లేఖలు రాయడంపై సాధన చేయాలి. పద్యభాగ సారాంశాలు రెండు ఇస్తారు. ఒకటి రాయాలి.

– వి.అరుణకుమారి, హిందీ ఉపాధ్యాయురాలు

### చాయిస్ ప్రశ్నలు కూడా రాయాలి



ఈ ఏడాది పేపరు-1, పేపర్-2గా వేర్వేరు రోజుల్లో నిర్వహిస్తున్నారు. 1వ ప్రశ్న నుంచి 17వ ప్రశ్న వరకు బయాలజీ ప్రశ్నలుంటాయి. విద్యార్థులు ప్రయోగాలు, భేదాలు, చిత్రపటాలు, టేబుల్స్‌పై శ్రద్ధ వహించాలి. ప్రశ్నకు, మార్కులకు అనుగుణంగా సమాధానాలు రాసే నేర్పు కలిగి ఉండాలి. అధిక మార్కులు సాధించాలంటే చాయిస్ ప్రశ్నలు కూడా రాయాలి.

– ఎం.అనసూయ, ఎన్ఎస్ ఉపాధ్యాయురాలు

# భారతీయ చిత్రకళ ప్రపంచానికే ఆదర్శం



ప్రదర్శనలోని చిత్రాలు



జ్యోతి ప్రజ్వలన చేసి చిత్రకళ ప్రదర్శన ప్రారంభిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: భారతీయ చిత్రకళ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, జీఆర్‌కే సాంస్కృతిక సేవా సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు అన్నారు. విజయవాడ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం చిత్ర కళా ప్రదర్శన, సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన నారాయణరావు మాట్లాడుతూ భారతీయ చిత్రకళ అతి ప్రాచీనమైనదని తెలిపారు. ఆధునిక చిత్రకళలో వస్తున్న మార్పులను స్వాగతించాలని సూచించారు. తిరుమల తిరుపతి దేవస్థానం చిత్రకళాశాల అధ్యాపకుడు డాక్టర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచం కళ్లు తెరవకముందే భారతదేశంలో చిత్ర ఆనవాళ్ళు కనిపించాయని పేర్కొన్నారు. అజంతా ఎల్లోరా లాంటి ప్రాంతాల్లో అద్భుతమైన చిత్రకళా రీతులు కనిపించాయని వెల్లడించారు. ప్రపంచ రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ ఆధునిక చిత్రకళ అంశంగా ప్రసంగించారు. అంతర్జాతీయ ఛాయా చిత్రకారుడు తమ్మా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఒక చిత్రం ద్వారా, ఒక ఫొటో ద్వారానో అనంతమైన చరిత్ర తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. చిత్రకళా ప్రముఖులు కాటూరి వెంకటేశ్వరారావు, యేలూరి శేషబ్రహ్మం, అచ్యుతన్న మురళీధర్, సంస్థ అధ్యక్షుడు కొలుసు సుబ్రహ్మణ్యం చిత్రకళారీతులు, చిత్రకారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షుడు ఒడుగు దుర్గా మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పావులూరి చిదంబరం, సభ్యులు శీలం శ్రీనివాసరెడ్డి, కొతారం పార్వతి, ఆరేపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**చిత్రకారులకు సత్కారం**

విజయవాడ మాజీ అధ్యక్షుడు ఆర్ట్స్ సొసైటీ అల్లు రాంబాబు, మాజీ ప్రధాన కార్యదర్శి విజయవాడ ఆర్ట్ సొసైటీ ఉప్పరాపల్లి వేణుగోపాలరావు, చిత్రకారులు యడవల్లి రామకృష్ణ, సంస్థ సభ్యులు మొగలాపు మధు, కోనేరు కల్పన, చింతపల్లి రవీంద్ర, బి.నామమల్లేశ్వరరావు, జిల్లేపల్లి కిరణ్, తమ్మిన పరమాత్మలను నిర్వాహకులు సత్కరించారు. చిత్రకళా ప్రదర్శనలో ప్రదర్శించిన చిత్రాలు ఆలోచనాత్మకంగా ఉన్నాయి. సంస్థ నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో చిత్రాకారులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే ఫలితాలు సాధ్యం

**ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యదర్శి రాంబాబు**




మాట్లాడుతున్న రాంబాబు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఐక్యంగా పోరాటాలు చేయడం ద్వారానే గోల్డ్ అప్రైజర్స్ తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకోగలరని ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆల్ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ ద్వితీయ మహాసభ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీలో సంవత్సరం పాటు కేంద్రంపై ఆందోళనలు చేసిన రైతులను స్ఫూర్తిగా తీసుకుని గోల్డ్ అప్రైజర్స్ ఉద్యమించాలని సూచించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ అధికారంలోకి వస్తే బ్యాంకులను ప్రైవేటీకరణ చేస్తారని ఆరోపించారు. దీని వల్ల బ్యాంకు సిబ్బంది ఉద్యోగాలకు భద్రత లేకుండాపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ కమిటీ ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై పోరాటాలు చేసే వారికి, వారి డిమాండ్ల గురించి చట్ట సభల్లో చర్చించే వారికే ఎన్నికల్లో ఓట్లు వేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎస్.ప్రకాష్ ఆచారి, ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ బ్యాంకుల్లో పనిచేస్తున్న గోల్డ్ అప్రైజర్స్‌కు ఉద్యోగ భద్రతతో పాటుగా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాన్ని బ్యాంకుల యాజమాన్యాలు కల్పించాలని కోరారు. ఏపీ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.ఉదయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ (ఏపీజీఏయూ) గౌరవ అధ్యక్షుడు పడాల రమణ, ఏపీజీఏయూ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.నాగపద్మ, ఏపీజీఏయూ సలహాదారు వి.కోటేశ్వరరావు, ఏపీ స్వర్ణకార సంఘం కార్యదర్శి కె.రంగాచారి, వివిధ జిల్లాల నుంచి గోల్డ్ అప్రైజర్స్ సభలో పాల్గొన్నారు. సభకు ముందుగా పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు నుంచి సిద్ధార్థ ఆడిటోరియం వరకు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గోల్డ్ అప్రైజర్స్ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు.

# క్వాలిటీ ఫీడ్స్‌లో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ అధికారులు

గుడివాడరూరల్: మండలంలోని రామనపూడి గ్రామంలో ఉన్న క్వాలిటీ ఫీడ్స్ కంపెనీలోని గోడౌన్‌లో ఆదివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. గుడివాడ ఫైర్ అధికారి జక్కంపూడి ఆంజనేయుల కథనం మేరకు.. కంపెనీలోని గోడౌన్‌లో ఉన్న ఊక, సీడ్స్ బస్తాల ప్రాంతంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు, కంపెనీ యజమానులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సిబ్బందితో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతానికి కోట్లాది రూపాయల సరుకును కాపాడామని, ప్రమాదం ఎలా జరిగింది, ఎంత నష్టం జరిగిందనే విషయాలను విచారణ అనంతరం వెల్లడిస్తామని ఫైర్ అధికారి స్పష్టం చేశారు. అదే విధంగా మండలంలో ఉన్న చాలా కంపెనీల వాళ్లు ఫైర్ అధికారుల నిబంధనలు పాటించడం లేదని, రానున్న వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లేదంటే భారీ అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. త్వరలోనే అన్ని కంపెనీల్లో తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రైలు కింద పడి యువకుడి మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: నూజివీడు రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. రైలు పట్టాలపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఏలూరు రైల్వే పోలీసులకు ఆదివారం సమాచారం అందించారు. దీంతో ఘటనాస్థలికి చేరకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, వివరాలు ఆరా తీశారు. మృతుడు ఏలూరు జిల్లా పెదపాడు మండలం తిమ్మనవీడుకు చెందిన ఊటుకూరి నరేష్ (31)గా గుర్తించారు. గుర్తు తెలియని రైలు ఢీకొనటం వల్ల లేదా రైలులో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తూ జారి పడటం వల్ల కానీ మృతి చెంది ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు.

ఈ ఘటనపై ఏలూరు రైల్వే హెచ్ కానిస్టేబుల్ ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# దుర్గగుడి ఘాట్‌రోడ్డులో అగ్ని ప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



ఘాట్‌రోడ్డులో ఫైరింజన్‌కు ప్రమాద దృశ్యం

- మంటలు ఆర్పేందుకు వచ్చిన ఫైర్ ఇంజిన్‌కు బ్రేక్ ఫెయిల్
- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఘాట్‌లోని ఓం టర్నింగ్ వద్ద ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంటలను అదుపు చేసేందుకు వచ్చిన ఫైర్ ఇంజిన్ తిరిగి కొండ దిగువకు వెళ్లే క్రమంలో బ్రేక్ ఫెయిల్ కావడంతో ఘాట్‌రోడ్డులో ప్రమాదానికి గురైంది. ఈ ఘటన చోటు చేసుకున్న సమయంలో ఘాట్‌రోడ్డులో భక్తులెవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఘటన గురించి తెలుసుకున్న దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు, పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఘాట్‌రోడ్డును మూసివేయడమే కాకుండా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. నడిచి వెళ్లే భక్తులను సైతం మహామండపం లిఫ్టు మార్గం వైపు మళ్లించారు. ప్రమాదానికి గురైన ఫైర్ ఇంజిన్‌ను క్రేన్ సాయంతో కిందకు దింపారు. ఆదివారం మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన అయిన కొన్ని నిమిషాలకు ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ ప్రసాదాల కౌంటర్, చీరల కౌంటర్ మధ్య ఉన్న రిటైనింగ్ వాల్ దిగువ నుంచి భారీగా పొగలు రావడం అక్కడే విధులు నిర్వహిస్తున్న దేవస్థాన శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది గమనించారు. తొలుత చిన్న పాటి మంటలే అని భావించినా కొద్ది నిమిషాల్లోనే భారీగా దట్టమైన పొగ, మంటలు పైకి కనిపించాయి. ఫైరింజన్ వచ్చి మంటలు అదుపు చేసింది.

# కృషితో 'డాక్టరేట్' అందుకున్న కృత్తివెంటి

- నేటి నుంచి ఢిల్లీలో వరల్డ్ లెటర్స్ సెమినార్
- కేంద్ర సాహిత్య అకాడమీ సెక్రటరీగా తొలి తెలుగు వ్యక్తి
- రెండు దశాబ్దాల పాటు సాహిత్యానికి సేవలు అందిస్తున్న వైనం



డాక్టరేట్ అందుకున్న శ్రీనివాసరావు



సెమినార్‌లో రాష్ట్రపతి ముర్ముతో శ్రీనివాసరావు (ఫైల్)

మోపిదేవి(అవనిగడ్డ): కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామానికి చెందిన కృత్తివెంటి శ్రీనివాసరావు భారతీయ భాషలకు, సాహిత్యానికి విశేషమైన సేవలు అందించినందుకు ఛత్తీస్‌ఘఢ్ యూనివర్సిటీ డాక్టరేట్ అందించి గౌరవించింది. పేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఆయన అకుంఠతదీక్ష, పట్టుదలతో అంచలంచెలుగా ఎదిగి ఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమీ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించి రెండు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నారు. తొలి సారిగా తెలుగు వ్యక్తి ఈ పదవిలో డాక్టరేట్ అందుకోవడం తెలుగు వారందరికీ గర్వకారణం. ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు ఢిల్లీలో వరల్డ్ లెటర్స్ సెమినార్ జరగనుంది. దేశం నలుమూలల నుంచి సాహితీ ప్రియులు పాల్గొంటారు. కృత్తివెంటి వెంకట రామకృష్ణారావు, జయలక్ష్మి దంపతులకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. నాలుగో సంతానంగా శ్రీనివాసరావు జన్మించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య అభ్యసించి, ఆరు నుంచి పదో తరగతి వరకు మోపిదేవి జెడ్పీ పాఠశాలలో చదువుకున్నారు. ముంబయిలో బంధువుల ఇంట ఉండి రోజువారీ వేతనంతో పనిచేస్తూ డిగ్రీ పూర్తిచేశారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం నుంచి ఇంగ్లిష్‌లో డాక్టరేట్ అందుకున్నారు. తొలుత కేంద్ర సాహిత్య అకాడమీలో టైపిస్టుగా ఉద్యోగంలో చేరి తన ప్రతిభతో పోగ్రాం ఆఫీసర్‌గా, రీజనల్ కార్యదర్శిగా ఎదిగి ఢిల్లీ కేంద్ర సాహిత్య అకాడమీ సెక్రటరీ చౌదరి వద్ద పీఏగా చేరారు. అనతికాలంలోనే సెక్రటరీగా ఉద్యోగోన్నతి పొందారు. దేశ, విదేశాల్లో అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించి, ప్రసంగిస్తూ బాగా ఆకట్టుకున్నారు. భారతీయ భాషలకు అందించిన విశేష సేవలకు, రెండు దశాబ్దాల పాటు కేంద్ర సాహిత్యాన్ని అభివృద్ధి పథంలో నడిపించినందుకు ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన బస్తర్ షాయిద్ మహేంద్ర కర్మ యూనివర్సిటీ, జగదల్పూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదగా ఈనెల ఐదో తేదీన డాక్టర్ ఆఫ్ లిటరేచర్ డిగ్రీ (డీ లిట్) గౌరవ పట్టాతో సత్కరించింది. భాషా సాహిత్యవేత్తలను ప్రోత్సహిస్తూ 24 ప్రధాన భాషలతో పాటు పలు ప్రాంతాల గిరిజన భాషల అభ్యున్నతికి కూడా కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శిగా ఎంతో సేవలు అందిస్తున్నారు. ఆయన ఇద్దరు కుమార్తెలు డాక్టర్లు కావడం విశేషం. డాక్టర్ హేమలత డెంటిస్టు కాగా, భార్గవి ఎంబీబీఎస్ చేస్తున్నారు. ఢిల్లీలో ఉన్నా జన్మభూమిపై మమకారంతో అప్పడప్పుడు స్వగ్రామం పెదప్రోలు వచ్చి బంధు మిత్రులను కలుస్తుంటారు. డాక్టరేట్ అందుకున్న కృత్తివెంటికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం



మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

నాగాయలంక: బైక్ అదుపుతప్పి యువకుడు దుర్మరణం చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం కథనం మేరకు.. మండలంలోని నాలి గ్రామానికి చెందిన కొప్పనాతి మురళీకృష్ణతో పాటు (24) గోపి అనే మరో యువకుడు బైక్‌పై సంగమేశ్వరం గ్రామంలో భోజనాలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీరాస్వామి తూముల మలుపు వద్దకు వచ్చేసరికి బైక్ అదుపు తప్పి ఇద్దరూ పడిపోయారు. దీంతో తలకు తీవ్ర గాయమై మురళీకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన గోపిని తొలుత అవనిగడ్డ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్సకై విజయవాడ తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

## క్లుప్తంగా

### త్రిశక్తి పీఠంలో సామూహిక చండీహోమం



కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో అమ్మవారు కాళీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం నుంచి అర్ధనారీశ్వరీ రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు ఆదివారం కాళీ మాతగా దర్శనమిచ్చారు. మాఘమాసం ఆదివారం అమావాస్య కావడంతో ఆలయ ఆవరణంలో పండితుడు మార్తి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో సామూహిక చండీహోమం నిర్వహించారు. 150 దంపతులు చండీహోమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు భారతుల విజయకిరణ్, సూపరింటెండెంట్ మధుసూదనరావు, కమిటీ సభ్యులు రాజా, మల్లేశ్వరరావు, జి.సత్యం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### సాహిత్యం సమకాలీనమై ఉండాలి



విజయవాడకల్చరల్: సాహిత్యం సమకాలీనమై ఉండాలని ప్రస్థానం సాహిత్య మాసపత్రిక సంపాదకుడు తెలకపల్లి రవి అన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం సాహిత్య ప్రస్థానం 20 ఏళ్ల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభను నిర్వహించారు. తెలకపల్లి రవి మాట్లాడుతూ సాహిత్యంలో సామాజిక జీవన చిత్రీకరణ కనిపించాలని సూచించారు. సాహితీ స్రవంతి అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ.. సాహిత్య ప్రస్థానం విలువలతో కూడిన వ్యాసాలను ప్రచురించిందన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ జి.అనిత, ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ, సాహితీవేత్త శాంతిశ్రీ సంచిక విశేషాలను వివరించారు.

### నేర ప్రవృత్తిని మానుకోవాలి



గుణదల(విజయవాడతూర్పు): నేర ప్రవృత్తిని మానుకుని సన్మార్గంలో నడుచుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని సెంట్రల్ ఏసీపీ భాస్కరరావు తెలిపారు. మాచవరం పోలీస్ స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలిసో తెలియకో చేసిన పొరపాట్ల కారణంగా పోలీసు రికార్డుల్లోకి నమోదు చేయబడతారన్నారు. ఆ పొరపాట్లు సరిచేసుకుని మంచి ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. సత్ప్రవర్తన కలిగి ఉంటే రౌడీ షీటు తొలగిస్తామని స్పష్టం చేశారు. సన్మార్గంలో నడుచుకోవడం ద్వారా మంచి భవిష్యత్ లోకి అడుగుపెట్టవచ్చని హితవు పలికారు. అనంతరం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మాచవరం సీఐ గుణరామ్, సిబ్బంది హాజరయ్యారు.

### చెట్టు కొడుతూ జారిపడిన వ్యక్తికి గాయాలు



ఆటోనగర్(విజయవాడతూర్పు): భారతీనగర్‌లోని ఓ హోటల్ ఆవరణలో చెట్టుకొడుతున్న వ్యక్తి జారిపడి గాయాల పాలైన సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ఈ సంఘటనలో రామవరప్పాడుకు చెందిన వినీత్ గాయాల పాలయ్యాడు. పటమట పోలీసుల వివరాల మేరకు.. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో హోటల్ ముందు ఉన్న చెట్లను నరికేందుకు పెద్ద ఇనుప నిచ్చెన మీదకు ఎక్కాడు. చెట్టుకు కొడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు నిచ్చెన జారింది. కింద పడిన వినీత్ కుడి చేయి విరిగింది. తలకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడే పార్కు చేసిన రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ పద్మ సంఘటనా స్థలానికి వచ్చి, ప్రమాదం జరిగిన తీరును స్థానికులను ఆమె అడిగి తెలుసుకున్నారు. గాయాల పాలైన వ్యక్తి వినీత్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మహిళల జీవనోపాధికి చేయూత

పటమట అంబేడ్కర్ కాలనీకి చెందిన వెలగలేటి కుమారి హోల్‌సేల్ మార్కెట్‌లో పూలు కొని తెచ్చి, దండలు కట్టి మార్కెట్‌లో విక్రయిస్తుంది. ఒకప్పుడు పూలు కొనేందుకు పెట్టుబడి డబ్బులు లేక అప్పు చేయాల్సి వచ్చేది. రోజువారీ వడ్డీలకు తీసుకునేది. కానీ ఇప్పుడు వైఎస్సార్ చేయూత పథకంలో ఏటా రూ.18,750 రావడంతో అప్పు చేయకుండా వాటినే పెట్టుబడి పెట్టి వ్యాపారం చేస్తోంది. ఆమె భర్త కూడా అదే పని చేస్తుంటారు. ముగ్గురు పిల్లలు కాగా, ఇద్దరికి పెళ్లిళ్లు చేయగా, ఒకరు ఆమె వద్దే పనిచేస్తున్నారు. కోవిడ్ సమయంలో అప్పు కూడా దొరకని రోజుల్లో ప్రభుత్వం అందించిన డబ్బులు ఎంతగానో ఉపయోగపడ్డాయని కుమారి చెబుతున్నారు.



పూల కడుతున్న వెలగలేటి కుమారి, పటమట అంబేడ్కర్ కాలనీ

- చిరు వ్యాపారాలు చేస్తూ రాణిస్తున్న మహిళలు
- తూర్పులో 8,683 మందికి రూ.16.28 కోట్లు పంపిణీ
- సంతోషం వ్యక్తం చేస్తున్న మహిళలు
- ఇప్పటి వరకూ రూ.81.26 కోట్లు చేయూత కింద అందించిన వైనం



మాట్లాడుతున్న దేవినేని అవినాష్, వేదికపై డెప్యూటీ మేయర్ దుర్గ, కార్పొరేటర్లు (ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ చేయూత పథకం కింద ఆర్థికంగా ప్రభుత్వం భరోసా ఇవ్వడంపై మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఎంతో మంది చేయూత, ఆసరా డబ్బులతో చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ జీవిస్తున్నారు. టిఫిన్ బళ్లు, పుల్కా బళ్లు, కిరాణా షాపులు, టైలరింగ్ షాపులు నిర్వహిస్తూ ఎంతో మంది మహిళలు జీవనోపాధి పొందుతూ రాణిస్తున్నారు. ప్రభుత్వ సాయంతో కోవిడ్ సమయంలో కూడా ఆర్థిక ఇబ్బందులు పడలేదని పలువురు మహిళలు చెబుతున్నారు. అంతేకాదు గతంలో మాకు ఎన్నడూ సంక్షేమ పథకాలు అందలేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక పథకాలు అందిస్తున్నారని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**తూర్పులో 8,683 మంది లబ్ధి**

తూర్పు నియోజకవర్గంలో అర్హులైన 8,683 మందికి చేయూత నాలుగో విడత మంజూరయ్యాయి. ప్రభుత్వం రూ.16.28 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేసింది. ఇప్పటికే మూడు విడతల్లో రూ.64.98 కోట్లు విడుదల చేయగా, మొత్తంగా నాలుగేళ్లలో వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మహిళలకు రూ.81.26 కోట్లు మహిళల ఖాతాల్లో జమచేశారు. ఏడాదికి రూ.18750 చొప్పున ఒక్కో మహిళకు నాలుగేళ్లలో రూ.75 వేలు లబ్ధిచేకూరడంతో ఎంతో మేలు జరిగిందంటున్నారు.

**పెట్టుబడికి వచ్చాయి**



చేయూత డబ్బులతో పుల్కాబండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాం. ఇప్పటికీ నాలుగు విడతల్లో రూ.75 వేలు వచ్చాయి. గతంలో రోజువారీ తీసుకునే వాళ్లం. ఇప్పుడు అలాంటి అవసరం లేదు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు పెట్టుబడిగా ఉపయోగించుకుంటున్నాం.

–బి.రమాదేవి, లంబాడీపేట, పటమట

**కిరాణా షాపు నిర్వహిస్తున్నా**



చిన్న కిరాణాషాపు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నా. ప్రభుత్వం ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లు ఇచ్చింది. ఆ డబ్బులు నాకు ఎంతో ఉపయోగపడ్డాయి. సరుకులు తెచ్చుకునేందుకు అప్పులు చేయాల్సిన పనిలేకుండా ఉపయోగపడుతున్నాయి. మా ఉన్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు.

–కొప్పుల మేరీ, అంబేడ్కర్‌నగర్, పటమట

**టిఫిన్ బండితో ఉపాధి**



నాకు ఇప్పటి వరకూ మూడు సార్లు వైఎస్సార్ చేయూత డబ్బులు వచ్చాయి. మొదటి ఏడాది వయస్సు రీత్యా రాలేదు. ఆ డబ్బులు నాకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. పటమట సెంటర్‌లో చిన్న టిఫిన్ బండి నిర్వహిస్తున్నా. సరుకులు కొనుగోలుకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. మేము ఎలాంటి దరఖాస్తు చేయకుండానే, అర్హతను బట్టి ఇవ్వడం సంతోషంగా ఉంది.

–రమావత్ రమాదేవి, అంబేడ్కర్‌కాలనీ, పటమట

**సామాన్లు కొనుగోలుకు ఉపయోగిస్తున్నా**



నేను టైలరింగ్ చేసి జీవనం సాగిస్తుంటాను. ప్రభుత్వం అందించే వైఎస్సార్ చేయూత డబ్బులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. టైలరింగ్‌కు అవసరమైన సామాన్లు వాటితో కొనుగోలు చేస్తున్నా, పెట్టుబడి అవసరాలకు అప్పులు చేయకుండా ఉపయోగపడుతున్నాయి. ఎలాంటి సిఫార్సు లేకుండానే పథకాలు అందుతున్నాయి.

–కె.పద్మావతి, గంగానమ్మ గుడి వద్ద, పటమటలంక

# 99 శాతం ఎన్నికల హామీల అమలు



మాట్లాడుతున్న దేవినేని అవినాష్, వేదికపై డెప్యూటీ మేయర్ దుర్గ, బుచ్చిబాబు తదితరులు

**వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్**

ఆటోనగర్(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పేర్కొన్నారు. రామలింగేశ్వర నగర్‌లోని 15వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలు కరోనా సమయంలోనూ నవరత్నాలు అమలు చేశారన్నారు. కృష్ణా పరివాహక ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రతి ఒక్కరికీ ఇళ్లపట్టాలు ఇస్తానని హామీ ఇచ్చారు. గత 10 ఏళ్లు గద్దె రామ్మోహన్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉండి ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. అంతే కాకుండా అభివృద్ధికి ఒక్క పైసా కూడా ఖర్చు చేయకపోగా ప్రజలను మోసం చేశారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన చంద్రబాబు కూడా మహిళలను నట్టేట ముంచారని... వారి మెడలోని నగలను అమ్మి రుణాలు తీర్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పరిపాలనలో ఈ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయకుండా కేవలం జన్మభూమి కమిటీలతో ప్రజలను సర్వనాశనం చేశారని విమర్శించారు. ఈ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని, ముఖ్యంగా మీ 15వ డివిజన్‌లో జరిగిన అభివృద్ధిని చూసి నిర్ణయం తీసుకోవాలన్నారు. రూ.33 కోట్లతో అభివృద్ధి చేశామని చెప్పారు. చంద్రబాబు తనపై ఉన్న కేసుల మాఫీకి బీజేపీ పెద్దల వద్ద సాగిలపడ్డారన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో పూర్తిగా చనిపోయిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని దూషించిన వ్యక్తి చంద్రబాబు .. మరలా వాళ్ల కాళ్ల వద్దకు వెళ్లడం ఇంతకంటే నీచమైనవారు వేరొకరు ఉండరని ఘాటు వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అంతకు ముందు దేవినేని అవినాష్‌ను మహిళలు పూలతో ఘన స్వాగతం పలికారు.

**డివిజన్‌లో కనపడని ఎమ్మెల్యే గద్దె..**

10 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా ఉండి డివిజన్ ప్రజలకు గద్దె కనపడలేదని డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ విమర్శించారు. గత 14 డివిజన్ ఇప్పుడు 15వ డివిజన్‌ను దత్తత తీసుకొని చేతులు ముడుచుకొని ఇంటికి పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. కనీసం కరకట్ట వాసులకు ఆయన హయాంలో తాగునీరు కూడా ఇవ్వలేదన్నారు. రూ.5 కోట్లతో వాటర్ పైప్‌లైన్, రూ.14 కోట్లతో ఎస్టీపీ ప్లాంట్‌ను అభివృద్ధి చేశామన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో దేవినేని అవినాష్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు, ఆళ్ల చెల్లారావు, డివిజన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, వీబీ రెడ్డి, రంగారావు, బాలాజీ, నిమ్మల కృష్ణ, డాక్టర్ శ్రీను, శ్రీనివాసరెడ్డి, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీలోకి చేరికలు



కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడతూర్పు): ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు వైఎస్సార్ సీపీ లోకి చేరుతున్నారని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని తూర్పు కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 11వ డివిజన్‌కు చెందిన 25 కుటుంబాల కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజకమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధి విధానాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందని గుర్తు చేశారు. ప్రజా ధనాన్ని దోచుకున్న తెలుగు తమ్ముళ్లు రాష్ట్రాన్ని అథోగతి పాలు చేశారని దుయ్యబట్టారు. కనీస సంక్షేమ పథకాలు అందించడంలో టీడీపీ నాయకులు విఫలమయ్యారని విమర్శించారు. ఇక టీడీపీకి దత్త పుత్రుడుగా ఉన్న ప్యాకేజీ పవన్ కళ్యాణ్‌కు రాజకీయంపై అవగాహన శూన్యమని ఎద్దేవా చేశారు. అనంతరం కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో 11వ డివిజన్ ఇన్‌చార్జి పర్వతనేని పవన్‌కుమార్, సాయి, కళ్లేపల్లి విజయ్ కుమార్, పొన్నూరు కృష్ణ, ముద్దన సురేంద్రబాబు, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

# నగరంలో 'సిద్ధం' జోష్



సీఎం వైఎస్ జగన్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు, కార్యకర్తలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం జరిగిన వైఎస్సార్ సీపీ సిద్ధం సభను ప్రత్యక్షంగా వీక్షించేందుకు లబ్బీపేటలో అతిపెద్ద ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. లబ్బీపేట వైవీ రావు ఆస్పత్రి రోడ్డులోని కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం కార్యాలయం వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయగా, వీక్షించేందుకు సమీప ప్రాంతాల వారు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. అంతేకాదు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభలో ప్రవేశిస్తున్న సమయంలో ఇక్కడ టపాసులు పేల్చి జై జగన్ అంటూ నినాదాలు చేశారు. సభలో జగన్ ప్రసంగిస్తున్న సమయంలోనూ అదే రీతిలో స్పందన వ్యక్తం చేశారు. చంద్రబాబు పొత్తులపై వైఎస్ జగన్ ప్రసంగిస్తున్న సమయంలోనూ నినాదాలతో హోరెత్తించారు. కాగా రోడ్డుపై రాకపోకలు సాగించే వారు సైతం అక్కడే నిలిచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. కొందరూ అక్కడే ఏర్పాటు చేసిన కుర్చీల్లో కూర్చొని ప్రసంగం అయ్యేంత వరకూ ఆసక్తిగా విన్నారు. 19వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ రెహానా నాహీద్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, నాయకులు ఎస్‌కే వలీ, ఎండీ నాహీద్, చింతగుంట విజయ్, బుర్రి జగ్జీవన్ రావు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొత్తులతో అవకాశవాద రాజకీయాలు

**వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్**



లబ్బీపేట(విజయవాడతూర్పు): రానున్న ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకోవడం చంద్రబాబు సిగ్గులేని నీచ, అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ ఆరోపించారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలందరూ ఆనందంగా, భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి జాగారం చేస్తే చంద్రబాబు మాత్రం బిక్కుబిక్కుమంటూ ఢిల్లీలో బీజేపీ పెద్దల అపాయింట్‌మెంట్ కోసం జాగారం చేశారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు 1999లో బీజేపీతో పొత్తు పెట్టుకొని 2001లో బయటకు వచ్చి మోదీని అరెస్ట్ చేయాలన్నారని గుర్తు చేశారు. మళ్లీ 2014లో పొత్తు పెట్టుకొని 2018లో బయటకు వచ్చి మోడీ మోసగాడు, పెళ్లాం, పిల్లలు లేనివాడు.. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశాడని ఏకంగా ఢిల్లీ వెళ్లి దీక్ష చేశాడని, తిరుపతి వచ్చిన అమిత్ షా కారుపై రాళ్లను వేయించారన్నారు. ఇప్పుడు మళ్లీ బీజేపీ, టీడీపీ పొత్తు పెట్టుకోవడం అంటే ఆ రెండు పార్టీల పరస్పర అవకాశవాద స్వార్థ రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. అమావాస్య రోజు పొడిచిన బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తు చిత్తవడం ఖాయమన్నారు. చంద్రబాబు అసలు నైజం తెలియక బాకాలు ఊదిన కొందరు మైనారిటీ సోదరులు కూడా కళ్లు తెరవాలని సూచించారు.

## విజయదుర్గా ఆలయంలో చండీహోమం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం చండీహోమం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఆలయ ప్రధాన అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మల పర్యవేక్షణలో అర్చకులు హోమాన్ని జరిపారు. పలువురు ఉభయ దాతలు, భక్తులు తమ నామగోత్రాలతో హోమాన్ని జరిపించుకున్నారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించి ఉభయదాతలకు వేద ఆశీర్వచనం అందజేశారు. అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో ప్రతి నెలా చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

## లారీ డ్రైవర్‌ను బెదిరించిన వారిపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కోళ్ల వ్యర్థాలతో వెళ్తున్న లారీని అడ్డగించి డ్రైవర్‌ను బెదిరించిన ముగ్గురు వ్యక్తులపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.... ఏలూరుకు చెందిన ఎస్.రామకృష్ణ అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి ఏలూరుకు లారీలో కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నాడు. ఆదివారం హైదరాబాద్ నుంచి లారీ గొల్లపూడి ఎట్కిన్‌సన్ స్కూల్ రోడ్డు వద్దకు రాగానే ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చి లారీని అడ్డగించారు. తాము మీడియా అని, లారీ ఓనర్‌కు ఫోన్ చేయమని డ్రైవర్‌ను ఒత్తిడి చేశారు. మీడియా కార్డులు చూపించి చికెన్ వేస్ట్ రవాణా చేయకూడదని బెదిరించారు. డ్రైవర్ లారీ ఓనర్‌కు ఫోన్ చేసి వాళ్ల చేత మాట్లాడించాడు. అనంతరం తమకు రూ.15వేలు ఇవ్వాలని లేదంటే చంపేస్తామని డ్రైవర్‌ను బెదిరించారు. డ్రైవర్ తన వద్ద రూ.2 వేలు మాత్రమే ఉన్నాయనగా వాటిని లాక్కున్నారు. ఇంతలో పోలీసు సైరన్ వినబడడంతో ముగ్గురు వ్యక్తులు పారిపోయారని లారీ డ్రైవర్ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై భవానీపురం పోలీసులు లారీ డ్రైవర్‌ను బెదిరించిన కటారి వెంకన్న, కాలసాని వెంకన్న బాబు, మహేష్ బాబు అను ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పర్యావరణానికి హాని కలిగించే కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

# రాష్ట్రంలో ప్లంబింగ్ సేవల అభివృద్ధికి కృషి

**ఏపీ అర్బన్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖరరెడ్డి**



ప్లంబింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులతో రాజశేఖరరెడ్డి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ప్లంబింగ్ నిపుణుల సేవలు వృద్ధి చెందేలా తనవంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖరరెడ్డి అన్నారు. ఇండియన్ ప్లంబింగ్ అసోసియేషన్ అమరావతి చాప్టర్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఎంజీరోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ తాను డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు జల వనరుల పునరుజ్జీవానికి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎలా అమలు చేశారో తెలిపారు. అసోసియేషన్‌కు అవసరమైనప్పుడు తన మద్దతు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది.

అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సందీపని వజ్జె మాట్లాడుతూ నీటి సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసిన వారిలో కార్యదర్శి కిరణ్ పర్చూరి, వైస్ చైర్మన్ బి.ఆనంద్ బాబు, కోశాధికారి పి.అనూష, సంయుక్త కార్యదర్శి ఆర్.కోమల్ గిల్డా, కార్యనిర్వాహక సభ్యులు రవికిరణ్ గోగినేని, వెంకటేశ్వరరావు రావిపూడి తదితరులు ఉన్నారు. నారేడ్కో, క్రెడాయ్, బీఏఐ వంటి నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యున్నతికి దేవినేని మురళీ కృషి



దేవినేని మురళీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అవినాష్, నాయకులు

గుణదల(విజయవాడతూర్పు): పేద విద్యార్థుల అభ్యున్నతికి దేవినేని మురళీ విశేష కృషి చేశారని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని పార్టీ కార్యాలయంలో దేవినేని మురళీ 36వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అండగా ఉంటూ వారి అభ్యున్నతి కోసం పాటు పడిన దేవినేని మురళీ ఆదర్శప్రాయుడని తెలిపారు. యునైటెడ్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ పేరిట ఓ సంస్థను ఏర్పాటు చేసి విద్యార్థుల హక్కుల కోసం పోరాటం చేశారన్నారు. ఆయన మరణించి 36 సంవత్సరాలైనా ఇంకా ప్రజల గుండెల్లో సుస్థిరంగా ఉన్నారని చెప్పారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మురళీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్లు కలపాల అంబేడ్కర్, వియ్యపు అమర్‌నాథ్, అంబడిపూడి నిర్మలాకుమారి, భీమిశెట్టి ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

**నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇస్త్రీపెట్టెల పంపిణీ**

గుణదల(విజయవాడతూర్పు): విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పేదలకు చేయూత నందించే దిశగా దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జీవనోపాధి నిమిత్తం 20 మంది పేదలకు రూ.2 లక్షల విలువైన ఇస్త్రీ పెట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు భరోసా కల్పించే దిశగా సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నగరంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గం పరిధిలో పేదల జీవనోపాధి నిమిత్తం బడ్డీ కొట్లు, తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లను పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు, పేద విద్యార్థులకు పుస్తకాలు అందజేశామన్నారు. అనంతరం ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కడియాల బుచ్చిబాబు, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, రజక సంఘ నాయకులు శ్రీనివాసరావు, ఉకోటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 18వ డివిజన్‌లో ఘనంగా మూడేళ్ల వేడుకలు



కార్పొరేటర్ వెంకట సత్యనారాయణను సన్మానిస్తున్న మహిళలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోట, 18వ డివిజన్ కార్పొరేటర్‌గా వెంకట సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డివిజన్‌లోని కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల మధ్య వెంకట సత్యనారాయణ కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా తన వెంట నడిచి డివిజన్ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డా అంజిరెడ్డి, బిక్షాలురెడ్డి, కె.నాగేశ్వరరావు, బాలరాజు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మద్యం విక్రయిస్తున్న వృద్ధురాలి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వృద్ధురాలిని కొత్తపేట పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితురాలి నుంచి 10 బీర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట శ్రీనివాస మహల్ సమీపంలో ఓ వృద్ధురాలు మద్యం విక్రయిస్తుండటంతో పోలీసులు దాడి చేశారు. వృద్ధురాలి చేతి సంచిలో 10 బీర్ బాటిల్స్‌ను గుర్తించిన సెక్టార్ ఎస్ఐ రాజనరేంద్ర నిందితురాలిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.


మేదరమెట్ల సమీపంలో 'సిద్ధం' సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

# అభిమాన జనసునామీ

బిందువు... బిందువు కలిసి సింధువైనట్లుగా... అవ్వాతాతలు... అక్కచెల్లెమ్మలు.. అన్నదమ్ములు... కార్మికులు... కర్షకులు... దివ్యాంగులు.. ఇలా ఒకరేమిటి అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా బాపట్ల జిల్లా మేదరమెట్ల వైపు కదిలారు. జాతీయ రహదారి వెంబడి మేదరమెట్ల-రేణంగివరం మధ్య జనసంద్రాన్ని సృష్టించారు. మేదరమెట్ల సమీపాన వందలాది ఎకరాల సువిశాల మైదానంలో నిర్వహించిన సిద్ధం సభకు ఉదయం 9.30 గంటల నుంచే కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలివచ్చారు. మధ్యాహ్నం రెండు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిక్కిరిసిపోయింది. ఆ తర్వాత సభకు వస్తున్న వారంతా జాతీయ రహదారిపై నిలబడిపోయారు. లక్షలాది మంది ప్రజలు వాహనాల్లోనే ఉండిపోయారు. సభ ముగిసిన అనంతరం కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి.


ర్యాంప్‌పై నడుస్తూ అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్


మేదరమెట్ల వద్ద జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర జనసంద్రం



సీఎం వైఎస్ జగన్ సెల్‌ఫోన్ లైటు వెలిగించి ఎన్నికలకు సిద్ధమా.. అనడంతో తమ సెల్‌ఫోన్లలో లైట్లు వెలిగించి సిద్ధం...సిద్ధం... అంటూ నినదిస్తున్న అభిమానులు, కార్యకర్తలు




సభా ప్రాంగణం బయట ఏర్పాటు చేసిన ఒక ఎల్‌ఈడీ స్క్రీన్ వద్ద సీఎం జగన్ ప్రసంగం వింటున్న జనం




యువోత్సాహం




యువత చెరగని అభిమానం... పెద్దల తరగని ఆత్మీయత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫొటోను బహూకరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు


సిద్ధం సభా ప్రాంగణం వెలుపల భారీగా నిలిచిపోయిన జనసందోహం

### నా కుటుంబానికి అన్ని పథకాలు అందాయి.



సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన అన్ని పథకాలు నా కుటుంబానికి అందాయి. నా భార్యకు వైఎస్సార్ చేయూత, డ్వాక్రా రుణ మాఫీ అందాయి. నాకు సెంట్రింగ్ పని నిమిత్తం పెట్టుకున్న రుణం రూ.3లక్షలు కూడా అందజేసిన మనసున్న వ్యక్తి సీఎం జగనన్న. తిరిగి జగనన్నను సీఎంను చేసుకునేందుకు పాటుపడతాం.

– షేక్ మీరావలి, సంతనూతలపాడు

### జగనన్నను చూడాలన్న కోరికతో వచ్చా



సీఎం జగన్ ఇచ్చినన్ని సంక్షేమ పథకాలను ఏ ముఖ్యమంత్రీ ఇవ్వలేకపోయారు. అందుకే జగనన్న అంటే ఎనలేని అభిమానం. ఆయన సభ ఎక్కడ జరిగినా, ఎంత దూరమయినా వెళుతుంటాను. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా మా కుటుంబానికి ఎంతో మేలు జరిగింది. రానున్న ఎన్నికల్లో ఆయన మళ్లీ సీఎం అవడం ఖాయం.

– సీహెచ్ రామ్మూర్తి, విశాఖపట్నం

### 3 చక్రాల బండిపై 80 కి.మీ. ప్రయాణించి వచ్చా..



మాది బాపట్ల పట్టణం ఇందిరానగర్ కాలనీ. దివ్యాంగులం అయిన మాకు జగనన్న సీఎం అయిన తర్వాత చేసిన మేలు జీవితంలో మరువలేం. మాకు గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు చక్రాల బండ్లు పంపిణీ చేశారు. జగనన్న మీద అభిమానంతో 80 కిలోమీటర్లు మూడు చక్రాల బండిమీద ప్రయాణం చేస్తూ వచ్చాను. అర్హులైన ప్రతి ఒక్క దివ్యాంగుడికి జగనన్న పాలనలోనే పెన్షన్లు సక్రమంగా వస్తున్నాయి. జగనన్న మాకు చేస్తున్న మేలును మేము జీవితంలో మరువలేం.

– చల్లా రామయ్య,
దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

### ఆరోగ్యం బాగోలేదు.. అయినా నా మనవడిని చూద్దామని వచ్చా..



నాది జె.పంగులూరు మండలం రేణంగివరం గ్రామం. నా వయస్సు 73 ఏళ్లు. నాకు మూడు రోజులుగా జ్వరం. ఒళ్లంతా నొప్పులు. నా మనవడిని చూడాలని ఎప్పటి నుంచో కోరిక. మా ఊరి దగ్గరకు వచ్చినప్పుడైనా చూద్దామనుకుంటే జ్వరం వచ్చింది. అయినా సరే చచ్చినా ఫర్లేదు అనుకుని బయల్దేరాను. అందరూ ముసలిదానివి ఆ జనంలో తొక్కుతారు. చచ్చిపోతావని చెప్పారు. అయినా సంతోషమే అంటూ వచ్చాను. దేవుడి దయవల్ల నన్ను పోలీసులు స్టేజీ దగ్గరకు తీసుకెళ్లి కూర్చొబెట్టారు. నేను నా మనుమడిని దగ్గరగా చూశాను. ఈ జన్మకు ఇది చాలు.

– భూమి రాములమ్మ

### 370 కి.మీ. ప్రయాణించి వచ్చా..



నాది తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా. నేను హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నా. ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. విద్యా వ్యవస్థలో జగనన్న తీసుకుంటున్న సమూలమైన మార్పుల కారణంగా జగనన్నకు అభిమానిగా మారాను. ఇంత అభిమానం ఉన్న నాకు జగనన్నకు ఓటేసే అవకాశం లేదు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అబ్బాయిని వివాహం చేసుకుని జగనన్నకు ఓటు వేసి ఆయనకు మద్దతుగా నిలవాలన్నది నా కోరిక. ఆయన మీద అభిమానంతో 370 కి.మీ ప్రయాణం చేసి అద్దంకి సిద్ధం సభకు వచ్చా. జగనన్నను దగ్గరగా చూడటంతో నా జన్మ ధన్యమైంది.

– తోకాటి నిదూష – కరీంనగర్

### దివ్యాంగుడిని అయినా దిగులు లేదు



దివ్యాంగుడిని అయినా నా జీవనంపై దిగులు పడకుండా ప్రభుత్వం నెల నెలా రూ.మూడు వేల పింఛన్ నగదు అందజేసి నాలో మనోధైర్యం నింపుతోంది. త్రిచక్ర వాహనాన్ని కూడా అందజేశారు. అలాగే నా కుటుంబంలో అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి. సంక్షేమం ప్రతి ఒక్కరికీ అందాలంటే జగనన్న తిరిగి ముఖ్యమంత్రి కావాలి.

– ఆర్.ఆంజనేయులు, ఒంగోలు

### బొందిలో ప్రాణం ఉన్నంత వరకూ జగన్‌తోనే..



మాది ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గం చింతగుంట్ల గ్రామం. మా అభిమాన హీరో, మా ఇంటి ఆశాదీపం అయిన మా జగనన్నను చూసేందుకు బైక్‌పై 100 కి.మీ.ప్రయాణించి వచ్చాం. మా బొందిలో ప్రాణం ఉన్నంత వరకూ జగనన్నతోనే ఉంటాం. సీఎం హోదాలో ఉన్న జగనన్న కామన్ మేన్‌గా నడుచుకుంటూ మా మధ్యలోకి రావడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది.

– రాంబాబు, నాగరాజు, అశోక్

చీరాల అర్బన్/చీరాల టౌన్/నెహ్రూనగర్/బాపట్లటౌన్: పట్నంబజారు

# రాజకీయ కుంభమేళా!

## సార్వత్రిక ఎన్నికలకు ముందే కనిపిస్తున్న వైఎస్సార్‌సీపీ సునామీ

- మేదరమెట్ల సభకు దక్షిణ కోస్తాలో 44 నియోజకవర్గాల నుంచి పోటెత్తిన జనప్రవాహం
- ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసిపోయిన వందలాది ఎకరాల సభా ప్రాంగణం
- వాహనాలతో కోల్‌కతా – చెన్నై జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్
- మేదరమెట్ల – రేణంగివరం ఆరు వరుసల రహదారిపై 18 కి.మీ. పొడవునా ఆగిన వాహనాలు
- మరో చారిత్రక విజయాన్ని చేకూర్చేందుకు సిద్ధమంటూ నినదించిన లక్షలాది గళాలు
- సీఎం జగన్ నాయకత్వంపై కార్యకర్తల్లో ఉన్న విశ్వాసానికి అద్దం పట్టిన సభ
- భీమిలి, దెందులూరు, రాప్తాడుకు మించి నాలుగో సభ విజయవంతం కావడంపై శ్రేణుల్లో జోష్



మేదరమెట్ల వద్ద సిద్ధం సభా ప్రాంగణానికి సమీపాన జాతీయరహదారిపై నిలిచిపోయిన అశేష జనసందోహంలో ఓ భాగం

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, బాపట్ల

దక్షిణ కోస్తా ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేస్తూ బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గ పరిధిలోని మేదరమెట్ల వద్ద ఆదివారం నిర్వహించిన 'సిద్ధం' సభ కుంభమేళాను తలపించింది. సార్వత్రిక ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ సునామీకి తాజా సభ మరో తార్కాణమని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. మేదరమెట్ల–రేణంగివరం మధ్య కోల్‌కతా–చెన్నై జాతీయ రహదారికి పక్కనే వందలాది ఎకరాల సువిశాల మైదానంలో నిర్వహించిన సిద్ధం సభకు ఉదయం 9.30 గంటల నుంచే కార్యకర్తలు, నేతలు, అభిమానుల ప్రవాహం మొదలైంది. మధ్యాహ్నం 2.45 గంటలకు సభా ప్రాంగణం మొత్తం ఇసుకేస్తే రాలనంతగా జనంతో కిక్కిరిసిపోయింది. ఆ తర్వాత సభకు వస్తున్న వారంతా జాతీయ రహదారిపై(అత్యవసర సమయాల్లో యుద్ధ విమానాలు దిగడానికి వీలుగా పది లేన్లతో నాలుగు కి.మీ. పొడవున అభివృద్ధి చేశారు) నిలబడిపోయారు. సభకు తరలివస్తున్న లక్షలాది మంది ప్రజలు వాహనాల్లోనే ఉండిపోయారు. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయ్యింది. మేదరమెట్ల–రేణంగివరం మధ్య 18 కి.మీ. పొడవున ఆరు వరుసల రహదారిపై వేలాది వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మేదరమెట్ల నుంచి అద్దంకి వైపు వెళ్లే నార్కెట్‌పల్లి జాతీయ రహదారిపై ఏడు కి.మీ. పొడవున వాహనాలు స్తంభించిపోయాయి. సీఎం జగన్ ప్రసంగం పూర్తయిన తర్వాత కూడా సభకు జనప్రవాహం కొనసాగడం గమనార్హం.

#### శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం..

బీజేపీతో టీడీపీ–జనసేన పొత్తు కుదిరాక వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ఈ సభకు జనం పోటెత్తడంతో పార్టీ శ్రేణుల్లో సరి కొత్త ఉత్సాహాన్ని నింపింది. వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి ఉత్తరాంధ్రలో జనవరి 27న నిర్వహించిన భీమిలి సభ, ఉత్తర కోస్తాలో ఫిబ్రవరి 3న జరిగిన దెందులూరు సభ, రాయలసీమలో ఫిబ్రవరి 18న నిర్వహించిన రాప్తాడు సిద్ధం సభలు ఒకదానికి మంచి మరొకటి గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. వాటికి మించి మేదరమెట్ల సభ సూపర్ హిట్ కావడం సీఎం జగన్ నాయకత్వంపై కార్యకర్తల్లో ఉన్న విశ్వాసానికి అద్దం పడుతోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల సన్నాహక సభలు ఈ స్థాయిలో గ్రాండ్ సక్సెస్ కావడంతో టీడీపీ–జనసేన–బీజేపీ నేతలు వణికిపోతున్నారు.

#### మారుమోగిన 'సిద్ధం'..

రాష్ట్రంలో 58 నెలల పాలనలో సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా ప్రజలకు చేసిన మంచిని వివరించడంతోపాటు చంద్రబాబు–పవన్ కళ్యాణ్‌పై పదునైన విమర్శలతో విరుచుకుపడుతూ సీఎం జగన్ చేసిన ప్రసంగానికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. 2014 ఎన్నికల్లోనూ ఆ మూడు పార్టీలు జట్టు కట్టాయని గుర్తుచేస్తూ రుణమాఫీ పేరుతో రైతులకు, మహిళలకు చంద్రబాబు చేసిన మోసాలను సీఎం జగన్ ఎండగట్టారు. ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానంటూ యువతను చంద్రబాబు వంచించిన వైనాన్ని ప్రస్తావించారు. ఇప్పుడు అదే కూటమి మరోసారి జత కట్టిందని, చంద్రబాబు హామీలకు శకుని చేతిలో పాచికలకు తేడా లేదంటూ విమర్శించడంతో జనం హర్షధ్వానాలు చేశారు. మాట నిలబెట్టుకుంటూ ఎన్నికల హామీల్లో 99 శాతం అమలు చేశామని, డీబీటీతో రూ.2.65 లక్షల కోట్లు పేదల ఖాతాల్లో జమ చేశామని.. పేదలు బాగుపడటం చూసి చంద్రబాబు కుళ్లుకుంటున్నారని సీఎం జగన్ విమర్శించినప్పుడు జనం నుంచి అనూహ్య స్పందన లభించింది. మరో చారిత్రక విజయానికి, మహా సంగ్రామానికి సిద్ధమా? అని సీఎం జగన్ ప్రశ్నించగా లక్షలాది మంది పిడికిళ్లు బిగించి సిద్ధమంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు.

### రైతన్నల రాజ్యం..



సీఎం జగన్ అన్నదాతల శ్రేయస్సును కాంక్షిస్తూ రైతు రాజ్యం తీసుకొచ్చారు. వైఎస్సార్ రైతు భరోసాతో పాటు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు అందజేశారు. ప్రతి కార్యక్రమంలో అక్క చెల్లెమ్మలకు పెద్దపీట వేసి మహిళా సాధికారతకు కృషిచేశారు. ఉద్యోగాలు, పదవులు, రుణాలు, ఇళ్ల స్థలాలు... అన్నింటా వారికే ప్రాధాన్యం ఇచ్చారు. పేదింటి బిడ్డలకు పెద్ద చదువులు చేరువ చేసి విద్యా దీపాలు వెలిగించారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ప్రతి నెలా ఒకటో తేదీనే టంఛన్‌గా రూ.3 వేలు చొప్పున సామాజిక పింఛన్లను ఇంటివద్దే పారదర్శకంగా అందించే విధానాన్ని దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టారు. లక్షల సంఖ్యలో సచివాలయ ఉద్యోగాలతోపాటు గ్రూపు 1, గ్రూపు 2, డీఎస్సీతో యువత కలలను నెరవేరుస్తున్నారు. సీఎం జగన్‌ను ప్రతి పేద కుటుంబం తమ పెద్ద బిడ్డ మాదిరిగానే భావిస్తూ ఆశీర్వదిస్తోంది.

– చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రీజినల్ కో–ఆర్డినేటర్, ఒంగోలు పార్లమెంటు సమన్వయకర్త.

### ముగ్గురినీ సముద్రంలో కలిపేస్తాం..



ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్న మొనగాడు సీఎం జగనైతే 14 ఏళ్లు అందరినీ వంచించిన మోసగాడు చంద్రబాబు. మొనగాడు కావాలో.. మోసగాడు కావాలో తేల్చుకోవాల్సిన సమయం వచ్చింది. సీఎం జగన్‌ను గద్దె దింపేంత వరకు విశ్రమించబోనంటున్న చంద్రబాబు తనకు దత్తపుత్రుడుతోడైనా ధైర్యం చాలక ఇప్పుడు ముగ్గురం కలిసే వస్తామంటున్నారు. ఆయన సింగిల్‌గా వస్తే చితకబాదుతాం. ఇద్దరొస్తే విసిరి కొడతాం. ముగ్గురూ కలిసి వస్తే సముద్రంలో కలిపేస్తాం. సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని 50 శాతానికిపైగా ప్రజలు కోరుకుంటున్నారు. ఎంత మంది కలిసి వచ్చినా ఆయన్ను ఏమీ చేయలేరు. టీడీపీ – జనసేన జెండాలు ఎత్తేసే సభలు నిర్వహిస్తున్నాయి.

– అంబటి రాంబాబు, జలవనరుల శాఖ మంత్రి

### వంచన చరిత్ర బాబుదే



సీఎం జగన్‌కు పాలన చేతకాదని విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు నాలుక మడత పెట్టి ఆయన ఒక బటన్ నొక్కితే నేను ఐదు బటన్లు నొక్కుతానని నమ్మబలుకుతున్నారు. కరోనా సమయంలో బడికి వెళ్లని పిల్లలకు ఎవరి అబ్బ సొమ్ములా అమ్మ ఒడి ఇచ్చారని విమర్శించిన చంద్రబాబు తాను ఒక్కరికైతే రూ.15 వేలు, ముగ్గురు పిల్లలుంటే రూ.90 వేలు చొప్పున ఇస్తామంటున్నారు. ఇలా నోటికి వచ్చినట్లు మాట్లాడి ప్రజలను మోసగించాలని ప్రయత్నిస్తున్నారు. రైతులు, డ్వాక్రా మహిళలనూ రుణమాఫీ పేరుతో వంచించిన చరిత్ర చంద్రబాబుదే. సీఎం జగన్ వైఎస్సార్ రైతు భరోసా ద్వారా మాటకు మించి పెట్టుబడి సాయాన్ని అన్నదాతలకు అందచేశారు. మాట ప్రకారం పొదుపు సంఘాల మహిళలను కూడా ఆదుకున్నారు.

– కాకాణి గోవర్ధన్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

### పేద బిడ్డలకు ప్రోత్సాహం..



సీఎం జగన్ నిరుపేద బిడ్డలకు ఇంగ్లిషు మీడియం చదువులను అందుబాటులోకి తెచ్చారు. ప్రపంచంతో మన విద్యార్థులు పోటీ పడేలా ప్రోత్సహిస్తున్నారు. చేయూతతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. నిజమైన సాధికారత అంటే కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవటమే. మహిళల రక్షణ కోసం 'దిశ' తీసుకొచ్చారు. 1.40 లక్షల మంది మహిళల ఫోన్లలో దిశ రిజిస్టర్ కావడం సీఎం జగన్ కల్పిస్తున్న భరోసాకు నిదర్శనం.

– మేకతోటి సుచరిత, హోంశాఖ మాజీ మంత్రి

### నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు 'సిద్ధం'



బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు ఆత్మ గౌరవంతో తలెత్తుకుని ముందుకు సాగటానికి సీఎం జగన్ కల్పిస్తున్న భరోసానే కారణం. ప్రతి కార్యకర్త, నాయకుడు 45 రోజులు పాటు కష్టపడితే ఆ తరువాత ఐదేళ్లు సీఎం జగన్ వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటారు. 2024 తరువాత రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మాత్రమే ఉంటుంది. జగనన్నను ఎదుర్కొనే దమ్ములేక ఇద్దరు వ్యక్తులు ఢిల్లీ వెళ్లి కాళ్లా వేళ్లా పడుతున్నారు.

– అనిల్‌కుమార్ యాదవ్,
నరసరావుపేట పార్లమెంట్ సమన్వయకర్త

### ఊరూరా ఘన స్వాగతం..



నన్ను అద్దంకి పంపించి ఇంత పెద్ద వైఎస్సార్ కుటుంబాన్ని ఇచ్చినందుకు ధన్యవాదాలు. ప్రతి గ్రామంలో ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. ప్రతి ఇంటికి చేరిన సంక్షేమ పథకాలు సీఎం జగన్ మంచితనం, మానవత్వాన్ని చాటుతున్నాయి. 70 ఏళ్ల పెద్దమ్మ కూడా జగనన్నా అంటోందంటే వారి మనసుల్లో సీఎం జగన్ చిరస్థాయిలో నిలిచారనేందుకు నిదర్శనం.

– పాణెం హనిమిరెడ్డి,
అద్దంకి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

### ఒక నమ్మకం.. భరోసా



జగనన్న అంటే.. ఒక నమ్మకం.. ఒక భరోసా. పేదలకు అండగా ఉంటూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి చేయూతనందిస్తున్నారు. దాదాపు 36 సంక్షేమ పథకాల ద్వారా డీబీటీతో నేరుగా రూ.2.50 లక్షల కోట్లకు పైగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి పారదర్శకంగా జమ చేశారు. పిల్లల చదువులు మొదలుకొని మహిళలు సాధికారతతో ఎదిగేలా తోడుగా నిలుస్తున్నారు. పేదలకు ప్రధానంగా కావాల్సింది విద్య, వైద్యం. వీటిని భరోసాగా వారికి అందించిన ఘనత సీఎం జగన్‌దే.

– నందిగం సురేష్,
బాపట్ల పార్లమెంట్ సభ్యుడు

## సోషల్ మీడియాలో 'సిద్ధం' సంచలనం

### దేశంలో 'ఎక్స్' ట్రెండింగ్ తొలి స్థానంలో 'వైఎస్ జగన్ ఎగైన్' హ్యాష్ ట్యాగ్

#### హోరెత్తిన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సామాజిక మాధ్యమాలు

సాక్షి, అమరావతి: బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం సీఎం జగన్ నిర్వహించిన 'సిద్ధం' సభ సామాజిక మాధ్యమాలను ఊపేసింది. ఎక్స్ (ట్విట్టర్)లో వైఎస్ జగన్ ఎగైన్, వైనాట్ 175, సిద్ధం హ్యాష్ ట్యాగ్‌లు ట్రెండింగ్‌లో దేశంలో అగ్రస్థానంలో నిలిచాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో సిద్ధం సభ వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ అభిమానులు భారీగా పోస్టులు చేశారు. జన సముద్రాన్ని తలపించిన సభా ప్రాంగణం.. సీఎం జగన్ ర్యాంప్‌పై నడుస్తున్న ఫొటోలు.. ప్రసంగిస్తుండగా జనం నీరాజనాలు పలుకుతున్న ఫొటోలతో ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లు నిండిపోయాయి. సాధారణంగా ఎక్స్‌లో పోస్టులు చేయడం, వాటిపై స్పందించడానికే అధిక ప్రాధాన్యం ఇస్తారు. ప్రత్యక్ష ప్రసారాలను తక్కువగా చూస్తారు. 'సిద్ధం' సభలో సీఎం జగన్ ప్రసంగాన్ని 'ఎక్స్'లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా 11 వేల మంది వీక్షించడం సంచలనం రేపింది. అదే సమయంలో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ నిర్వహించిన సభను ఎక్స్ ద్వారా 2,400 మంది ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించగా, టీఎంసీ లోక్‌సభ అభ్యర్థులను పరిచయం చేస్తూ పశ్చిమ బంగా సీఎం మమతా బెనర్జీ నిర్వహించిన సభను 1,200 మంది తిలకించారు.




**లైవ్ సభల్లో టాప్..**

'ఎక్స్' చరిత్రలో అత్యధిక మంది ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన రాజకీయ సభల్లో సీఎం జగన్ మేదరమెట్ల సభ అగ్రస్థానంలో ఉందని నెటిజన్లు స్పష్టం చేస్తున్నారు. మరో సామాజిక మాధ్యమం యూట్యూబ్‌లో సాక్షి టీవీ ద్వారా మేదరమెట్ల సభను 56 వేల మంది ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఇదే రీతిలో యూట్యూబ్‌లో ఎన్‌టీవీ, టీవీ 9 లాంటి ఛానళ్లలో భారీ ఎత్తున సిద్ధం సభను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఇటు సామాజిక మాధ్యమాలు.. అటు వివిధ టీవీ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా లక్షలాది మంది 'సిద్ధం' సభను తిలకించారు. సీఎం జగన్‌పై వివిధ వర్గాల ప్రజల్లో ఉన్న ఆదరణ, విశ్వసనీయతకు నిదర్శనంగా ఈ సభ నిలిచిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.



ఉదయం 7గంటలకే సభా ప్రాంగణానికి వచ్చిన వృద్ధురాలు



సభా ప్రాంగణంలో సీఎం జగన్ కోసం ఎదురు చూస్తూ..

## మనవడి కోసం వచ్చాను

మేదరమెట్ల వద్ద ఆదివారం నిర్వహించిన 'సిద్ధం' సభలో సీఎం వైఎస్ జగన్ పాల్గొంటారని తెలుసుకున్న 70 ఏళ్లు పైబడిన ఓ వృద్ధురాలు ఉదయం 7గంటలకే సభా ప్రాంగణానికి చేరుకుంది. ఉదయాన్నే సభావేదిక వద్ద వృద్ధురాలు కలియతిరగడం చూసిన వారంతా ఆశ్చర్యానికి గురయ్యారు. ఇప్పుడే 'ఎందుకు వచ్చావ్ అవ్వా' అని అడిగిన వారందరికీ 'మా ఆలన పాలన చూస్తున్న నా మనవడిని చూసిపోయేందుకు వచ్చా'నని బదులిచ్చింది. సభా ప్రాంగణంలో ఉన్న ఈ వృద్ధురాలి ఫొటో సోషల్ మీడియాలో తెగ ట్రెండింగ్ అవుతోంది.

– అద్దంకి

### వేదిక వద్ద ప్రైవేట్ డ్రోన్

'సిద్ధం' సభా వేదిక వద్ద కుడి వైపు ఓ ప్రైవేట్ డ్రోన్ కనిపించింది. దానిని గుర్తించిన మంత్రి అంబటి రాంబాబు స్వాధీనం చేసుకోవాలని పోలీసులకు సూచించారు. అనుమతి లేకుండా ఇక్కడ డ్రోన్ ఎలా ఎగరవేస్తున్నారు? ఎవరు ఆపరేట్ చేస్తున్నారు? అని ప్రశ్నించారు. నారా లోకేష్ ఇలా దొంగచాటుగా డ్రోన్లను పంపకుండా ధైర్యముంటే నేరుగా రావాలని నరసరావుపేట పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్ సవాల్ చేశారు.

### నా రెండు కాళ్లూ సహకరించకున్నా జగన్ కోసం వచ్చా..



రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు వచ్చాను. నా రెండు కాళ్లు సహకరించకపోయినా మార్కాపురం నుంచి వచ్చాను. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పథకాలు మా కుటుంబానికి అందాయి. పంటల బీమా, డ్వాక్రా రుణ మాఫీ వంటి వాటితో మా జీవితాల్లో వెలుగులు నింపిన దేవుడు జగన్. ఆయనే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలి.

– ఎం.వెంకటేశ్వరరెడ్డి, మార్కాపురం

### తెలంగాణ నుంచి వచ్చా..



రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు మా ఇంట్లో వెలుగులు నింపాయి. బతుకుదెరువు కోసం నేను బేల్దారి మేస్త్రిగా తెలంగాణ రాష్ట్రం హన్మకొండలో పనిచేస్తున్నాను. నా కుటుంబం ఇక్కడే ఉంటుంది. ఇద్దరు ఆడపిల్లలున్నారు. అమ్మ ఒడి, ఇళ్ల పట్టా, వైఎస్సార్ చేయూత వంటి పథకాలు మాకు అందాయి. సీఎం జగన్ మా ప్రాంతానికి వస్తున్నాడని తెలిసి హన్మకొండ నుంచి ఆయనను చూసేందుకు సిద్ధం సభకు వచ్చాను.

– గంగుల అశోక్, మద్దిపూడి

### నా మనవడిని దగ్గరగా చూడాలన్న ఆశ నెరవేరింది..



జీవిత చరమాంకంలో ఉన్న మాలాంటి వృద్ధులకు అండగా నిలిచిన నా మనవడు జగన్‌ను దగ్గరగా చూడాలని సిద్ధం సభకు వచ్చాను. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం 6 గంటలకు పింఛన్ అందించి మాలాంటి వారికి ఆర్థిక ఇబ్బందుల్లేకుండా చూస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా కంటి శుక్లం ఆపరేషన్ చేయించుకున్నా. నా మనవడిని దగ్గరగా చూడాలనే ఆశ నెరవేరింది.

– చెన్నక్క, పొదిలి

### జగన్ నూరేళ్లూ చల్లగా ఉండాలి



రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి ప్రతి ఇంటికీ పెద్ద కొడుకుగా సీఎం జగన్ నిలిచారు. మా ఇంట్లో రైతు భరోసా వచ్చింది. ఇల్లు కూడా కట్టుకున్నాం. మంచి మనసున్న సీఎం జగన్‌ను చూసేందుకు వృద్ధాప్యంలో ఉన్నా, భార్యాభర్తలం ఇద్దరం వచ్చాం. ఆయన నూరేళ్లు చల్లగా ఉండాలి. మళ్లీ ఆయనే సీఎం కావాలన్నది మా కోరిక.

– అనంత సీతమ్మ, జె.పంగులూరు

### చేతులపై 'సిద్ధం'.. గుండెలపై 'జై జగన్'



చీరాల అర్బన్/చీరాల టౌన్: సిద్ధం సభలకు వస్తున్న వారు పలువురు తమ చేతులపై సిద్ధం టాటూ వేయించుకోవడం కనిపించింది. సభా ప్రాంగణంలో చేతులపై టాటూ, ముఖానికి పార్టీ సింబల్ వేయించుకునేందుకు ఎంతో ఉత్సాహం చూపారు. చేతులపై, గుండెలపై సిద్ధం, జై జగన్ పేరుతో టాటూలు వేయించుకున్నారు.

### లండన్‌లో సందడిగా సిద్ధం విజయోత్సవ సభ



యూకేలో వేడుకలు జరుపుతున్న నేతలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభ విజయవంతం కావటంతో వైఎస్సార్‌సీపీ యూకే కమిటీ ఆధ్వర్యంలో విజయోత్సవ సభ జరిగింది. ఈస్ట్ హామ్‌లో ఆదివారం నిర్వహించిన సభకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు యూకే నలుమూలల నుంచి భారీఎత్తున తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ జెండాలు చేతపట్టి ద్విచక్ర వాహనాలు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు డాక్టర్ ప్రదీప్ చింతా, ఓబుల్‌రెడ్డి పాతకోట మాట్లాడుతూ మేదరమెట్లలో సిద్ధం సభ చూసిన తర్వాత జనం.. జగన్ కలిస్తే ప్రభంజనమేనని మరోసారి రుజువైందని అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ విభాగం చైర్మన్ వెంకట్ మేడపాటి ఫోన్ ద్వారా సభకు హాజరైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యూకే కమిటీ సభ్యులు శ్రీకాంత్ పసుపుల, మన్మోహన్ యమ్మసాని, పీసీ రావు కోడె, అనంత్‌రాజ్ పరదేశి, శ్రీనివాస్ తాళ్ల, సుబ్బారెడ్డి ఆకేపాటి, శ్రీనివాస్ దొంతిబోయిన, సురేందర్ అలవల, రవి మోచర్ల, రాజేష్ యాదవ్, వంశీకృష్ణ మద్దూరి, విజయ్ పెండేకంటి పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### దళితులు తలెత్తుకునేలా సీఎం జగన్ పాలన

- కానూరులో దళితుల ఆత్మీయ సమ్మేళనంలో హోం మంత్రి వనిత



చేతులు కలిపి సంఘీభావాన్ని చాటుతున్న నేతలు

నిడదవోలు: దళితులు తలెత్తుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత అన్నారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కానూరులో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యాన ఆదివారం నిడదవోలు నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా దళితులు తరలివచ్చారు. సభా ప్రాంగణం జై జగన్... నినాదాలతో మార్మోగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దళితుల ఇంట వెలుగులు నింపాయన్నారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా... అని దళితులను అవమానించిన వ్యక్తి చంద్రబాబు అని గుర్తుచేశారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ జగనన్న పాలనలో దళితులకు అత్యున్నత స్థానం కల్పించారన్నారు. దళితుల ఆకలి తీర్చే సీఎం వైఎస్ జగన్ కావాలో.. మోసం చేసే చంద్రబాబు కావాలో.. ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

### పొత్తు కుదరడం సంతోషదాయకం: పురందేశ్వరి



సాక్షి, అమరావతి: తామంతా అనుకుంటున్నట్టుగానే టీడీపీ, జనసేన పార్టీలతో బీజేపీకి పొత్తు కుదరడం సంతోషించదగ్గ విషయమని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయం వద్ద ఆదివారం ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల జాబితా రూపొందించిన నేపథ్యంలో పొత్తు కుదిరిన దృష్ట్యా ఆ అభ్యర్థుల పరిస్థితి ఏమిటని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. 'దుష్టశిక్షణ.. శిష్టరక్షణ జరగడానికి సాక్షాత్తు శ్రీరాముడంతటి వారే ఆంజనేయుడు వంటి వారితోపాటు ఉడత సాయం కూడా తీసుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు రాష్ట్రంలో అదే పరిస్థితి ఉంది. దుష్టశిక్షణ.. శిష్టరక్షణ జరగాలి. కార్యకర్తలు ఈ విషయాన్ని అర్థం చేసుకోగలరనుకుంటున్నా' అన్నారు. రాష్ట్ర హితం కోసం పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా క్రమశిక్షణ కలిగిన వారిగా తామంతా కట్టుబడి ఉంటామన్నారు. రాష్ట్రానికి సంబంధించి బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో ప్రక్రియ కొనసాగుతోందని, ప్రజల అభిప్రాయాల మేరకు దీనిని రూపొందిస్తున్నామని చెప్పారు.

### 14న వైఎస్సార్‌సీపీలో చేరుతున్నా

▶ మొదటి పేజీ తరువాయి

కిర్లంపూడిలోని తన నివాసంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ ఎంపీ పి.మిథున్‌రెడ్డి, కాకినాడ ఎంపీ వంగా గీత, కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు ఇటీవల తన నివాసానికి వచ్చి పార్టీలోకి ఆహ్వానించారని చెప్పారు. సీఎం జగన్ పిలుపు మేరకు పార్టీలో చేరి తన మద్దతు అందించాలని నిర్ణయించానన్నారు. తనకు కానీ, తన కుమారుడు గిరిబాబుకు కానీ ఎటువంటి పదవులూ ఆశించకుండానే వైఎస్సార్‌సీపీలో చేరుతున్నామని, పార్టీ విజయం సాధించిన తరువాత వారు ఏ పదవి ఇచ్చినా తీసుకోవడానికి సుముఖంగా ఉన్నానని ముద్రగడ చెప్పారు. ఈ నెల 14న ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య కిర్లంపూడి నుంచి బయలుదేరి సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరతానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ముద్రగడ చెప్పారు. ఆయన వెంట ముద్రగడ గిరిబాబు, గౌతు స్వామి ఉన్నారు.

### బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిని ఓడించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: 'బీజేపీతో టీడీపీ పొత్తు రాష్ట్రానికి వినాశకరం. బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి రాష్ట్రానికి మరణశాసనం రాస్తున్నాయి..' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'మతోన్మాద బీజేపీతో పొత్తు పెట్టుకోవడం అంటే ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా వ్యవహరించడమే. 2019 ఎన్నికల సమయంలో చంద్రబాబు దేశమంతా తిరిగి బీజేపీ మతోన్మాదాన్ని పెద్ద ఎత్తున చాటారు. ఇప్పుడు అదే బీజేపీతో కలవడం దారుణం. మత విద్వేషాలు రగిలించి మైనార్టీలమీద దాడులు చేస్తున్న బీజేపీతో కలిసి టీడీపీ మైనార్టీలను ఎలా ఆదుకుంటుంది? క్రిస్టియన్‌లకు, దళితులకు ఏం సమాధానం చెబుతారు? దళిత, ఆదివాసీ, బలహీనవర్గాలను ఎలా ఉద్ధరిస్తారు? రానున్న ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేనలను ప్రజలు చిత్తుగా ఓడించాలి' అని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

# రూ.266 కోట్లతో కడప విమానాశ్రయం అభివృద్ధి

## టెర్మినల్ భవనం, అభివృద్ధి పనులకు వర్చువల్‌గా ప్రధాని మోదీ శంకుస్థాపన

కడప కోటిరెడ్డిసర్కిల్/కడప కార్పొరేషన్: వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని విమానాశ్రయంలో రూ.266 కోట్లతో నిర్మించనున్న నూతన టెర్మినల్ భవనానికి ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ విమానాశ్రయం 25 లక్షల మంది ప్రయాణికుల వార్షిక సామర్థ్యం మేరకు ఆధునిక సొబగులద్దుకుంటోంది. ఇక్కడి రన్‌వేని 45 మీటర్ల వెడల్పున 2,515 మీటర్ల పొడవున విస్తరించనున్నారు. పనులు పూర్తయిన తరువాత ఈ విమానాశ్రయం పీక్ అవర్ సర్వింగ్ కెపాసిటీ 1,800 మంది ప్రయాణికులుగా ఉంటుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో విమానాశ్రయం విస్తరణకు రూ.75 కోట్లతో స్థలం సేకరించారు. దీంతో రన్‌వే పొడిగిస్తున్న నేపథ్యంలో విమానాల నైట్ ల్యాండింగ్‌కు కూడా అవకాశం లభిస్తుంది. ఇప్పటికే ఇక్కడి నుంచి నిరంతరాయ సర్వీసుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వయబులిటీ గ్యాప్ ఫండింగ్ కూడా భరించింది. 2015లో ప్రారంభమైన ఈ విమానాశ్రయం నుంచి 2017లో ట్రూ జెట్ సంస్థ ఉడాన్ స్కీమ్ కింద ఆర్‌సీఎస్ (రీజినల్ కనెక్టివిటీ స్కీమ్) అమలు చేసింది. 2021లో ఆ సంస్థ తన విమానాలను ఉపసంహరించుకుంది. 2022 మార్చి నుంచి ఇండిగోసంస్థ విమానాలను ప్రారంభించింది. ప్రధాని వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో పాల్గొన్న కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ విమానాశ్రయంలో అభివృద్ధి పనులతో పాటు టెర్మినల్ నిర్మాణంతో రూపురేఖలు మారిపోయి మహర్దశ పట్టనుందని చెప్పారు. ఈ విమానాశ్రయం ఏర్పాటుకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కృషిచేయగా, ఎయిర్‌పోర్టు అభివృద్ధికి ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు సుందరీకరణలోను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందన్నారు. ఎయిర్‌పోర్టుకు అతి సమీపంలో అటవీప్రాంతం ఉండడంతో అటవీశాఖ అనుమతులు తీసుకుని భూసేకరణ చేసినట్లు తెలిపారు. ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనులు చేపట్టిన ప్రధాని నరేంద్రమోదీకి, కేంద్ర విమానయానశాఖ మంత్రి జ్యోతిరావు సింధియాకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయరామరాజు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ సుజిత్‌కుమార్ పోదార్, ప్రొటోకాల్ ఆఫీసర్ సురేష్‌బాబు, టెర్మినల్ మేనేజర్ జోసెఫ్ పాల్గొన్నారు.



కడప విమానాశ్రయం నమూనా

**ముసుగు తొలగించారంతే: ఎంపీ అవినాశ్‌రెడ్డి**

అనంతరం ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎప్పటినుంచో పొత్తులో ఉన్న టీడీపీ, పవన్‌కళ్యాణ్, బీజేపీ ఇప్పుడు ముసుగు తొలగించారని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు పొత్తులు కొత్తేమీ కాదని, ఎన్నికలు వచ్చాయంటే ఆయనకు పొత్తులు గుర్తొస్తాయని చెప్పారు. 2019లో టీడీపీ ఓటమి పాలుకాగానే చంద్రబాబు తన అనుచరులైన సుజనాచౌదరి, సీఎం రమేశ్‌లను బీజేపీలోకి పంపారని గుర్తుచేశారు. అప్పటి నుంచి ప్రత్యక్షంగా పొత్తులో ఉన్న టీడీపీ, పవన్‌కళ్యాణ్, బీజేపీ.. పరోక్షంగా కాంగ్రెస్, ఇతర పార్టీలతో కూడా కలిసే ఉన్నట్లు చెప్పారు. ఎంతమంది కలిసొచ్చినా, ఎల్లో మీడియా వారికి ఎంత మద్దతు ఇచ్చినా గెలిచేది వైఎస్సార్‌సీపీయేనని ఆయన తెలిపారు. కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీతో పొత్తుకోసం టీడీపీ వెంపర్లాడిందని ఎద్దేవా చేశారు. సింహం సింగిల్‌గానే వస్తుందని, జగన్ సింగిల్‌గా పోటీచేసి మళ్లీ సీఎం కావడం తథ్యమని చెప్పారు.

**రూ.266 కోట్లతో చేపట్టనున్న పనులు**

| |
|---|
| 45 మీటర్ల వెడల్పు, 2,515 పొడవున రన్‌వే విస్తరణ |
| పార్కింగ్ స్టాండ్‌లు 7 |
| టెర్మినల్ భవనం విస్తీర్ణం 16,455 చదరపు మీటర్లు |
| చెక్ ఇన్ కౌంటర్లు 24 |
| కన్వేయర్ బెల్ట్‌లు 2 |
| ఎక్స్ బీఐఎస్ యంత్రాలు 7 |
| ఏరో బ్రిడ్జిలు 3 |
| ఏఆర్ఐ హెచ్ఏ రేటింగ్ 5 స్టార్లు |
| 375 కార్ల పార్కింగ్ సదుపాయం |
| పైకప్పు నిర్మాణంలో థర్మల్ ఇన్సులేషన్ పదార్థాలు, సాంకేతికతల వినియోగం |
| టెర్మినల్ భవనం లోపల సహజమైన వెలుతురు కోసం స్కైలైటర్ల ఏర్పాటు |
| ఎల్ఈడీ లైటింగ్ |
| డబుల్ గ్లేజింగ్ యూనిట్ల వాడకం ద్వారా తక్కువ ఉష్ణప్రాప్తికి ఏర్పాట్లు |
| భూగర్భజల సంరక్షణకు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థ ఏర్పాటు |
| ల్యాండ్ స్కేపింగ్, హెచ్‌వీఏసీ వ్యవస్థ ఏర్పాటు |
| నీటిశుద్ధి కేంద్రం, మరుగునీటిశుద్ధి కేంద్రం |
| ల్యాండ్ స్కేపింగ్ కోసం రీసైక్లింగ్ చేసిన నీటి వినియోగం |
| సోలార్ పవర్ ప్లాంట్ |

# బీజేపీతో బాబుది అనైతిక ఒప్పందమే

- పొత్తులేకుండా పోటీకి పనికిరాని చంద్రబాబు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పెనుమూరు (కార్వేటినగరం)/కుప్పం: స్వార్థరాజకీయాల కోసం చంద్రబాబు అనైతిక ఒప్పందాలు చేసుకుని ప్రజలను మభ్యపెడుతున్నారని రాష్ట్ర భూగర్భ, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. చంద్రబాబు రాజకీయ వికలాంగుడని, పొత్తులు లేకుండా పోటీకిరాడని చెప్పారు. ఆయన ఆదివారం చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కుప్పంలోను, అంతకుముందు మండల కేంద్రం పెనుమూరులోను విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అధికారదాహంతో నరేంద్ర మోదీతో సహా ఎవరి కాళ్లు పట్టుకోవడానికైనా వెనుకాడడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు ఏకమైనా వైఎస్సార్‌సీపీకి నష్టం లేదని చెప్పారు. మీ పొత్తులు, జిమ్మిక్కులను రాష్ట్ర ప్రజలు ముందే ఊహించారన్నారు.



పవన్‌కళ్యాణ్ సీఎం కావాలని అతని అభిమానులు, కాపులందరూ కోరుకుంటే పవన్‌కళ్యాణ్ మాత్రం చంద్రబాబు సీఎం కావాలని కోరుకుంటూ బీసీలకు తీరని అన్యాయం చేస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ ఒక్కడే ఒకవైపు ఉంటే టీడీపీ, జనసేన, బీజేపీతోపాటు అంతర్గతంగా కాంగ్రెస్ కూడా కుమ్మక్కై జగన్‌ను ఓడించడానికి సిద్ధపడ్డారని తెలిపారు. పొత్తులో భాగంగా పవన్‌కళ్యాణ్ కనీసం 15 శాతం సీట్లు కూడా తీసుకోలేకపోయారని చెప్పారు. గతంలో బాబును తిట్టిన నోటితోనే నేడు చంద్రబాబు నామస్మరణ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కూడా చంద్రబాబు చదివిన స్క్రిప్టునే చదివి రాష్ట్రానికి సువర్ణపాలన అందిస్తున్న జగనన్నపై దుమ్మెత్తిపోయడం మంచిది కాదన్నారు. ఇంత మంచిచేసిన ప్రభుత్వాన్ని కొనసాగించాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకీ ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వందలసార్లు బటన్ నొక్కితే 2024 ఎన్నికల్లో లబ్ధిదారులు రెండు బటన్లు నొక్కి తమ రుణాన్ని తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలకు ఓట్లు వేస్తే లంచాలు, కులవివక్ష, భూకబ్జాలు, పెత్తందారులను ప్రోత్సాహించినట్లేనని, టీడీపీ అధికారంలోకి వస్తే పేదవాడు పేదవాడిగా మిగిలిపోవాల్సిందేనని చెప్పారు. కుప్పంలో చంద్రబాబును ఓడించే బాధ్యత తమ భుజస్కంధాలపై ఉందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే సుభిక్షంగా ఉండే రాష్ట్రంలో కరువు తాండవిస్తుందని ఆయన పేర్కొన్నారు. 2014 ఎన్నికల్లో ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తరువాత వాటిని అమలు చేయలేదని వివరించారు. తమ బలం, బలగం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే అని ఆయన చెప్పారు. మంత్రి వెంట ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మన్ సెంథిల్, కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ ఉన్నారు.

# సీఎంగా ఏం ఉద్ధరించావు బాబు?

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స

చీపురుపల్లి: రాష్ట్రానికి 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు రాష్ట్రానికి ఏం ఉద్ధరించాడో చెప్పాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా, చరిత్రలో నిలిచిపోయే విధంగా ఏ ఒక్క కార్యక్రమం అయినా చేశాడా అని నిలదీశారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలంలోని గొల్లలములగాం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారని చంద్రబాబు, ఎల్లో మీడియా పదేపదే చెబుతోందని, ప్రభుత్వాలు అప్పులు చేయడం సహజమని, అయితే చేసిన అప్పులు ఏమయ్యాయో చూడాలని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అప్పులన్నీ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసమే ఖర్చు చేశారన్నారు. కానీ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన అప్పులన్నీ రాష్ట్రాభివృద్ధి కోసం వినియోగించకుండా స్వంతంగా దోచుకుతిన్నాడని ధ్వజమెత్తారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేవాలయంతో సమానమని చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా సచివాలయానికి వెళ్తే పరిష్కారమవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మరో దశాబ్దకాలం తరువాత ప్రపంచంతో పోటీపడేలా ప్రస్తుతం పునాది పడుతోందని తెలిపారు. ఎనిమిదో తరగతి నుంచే బైజూస్ వంటి విలువైన కంటెంట్‌తో ట్యాబ్‌లు ఇచ్చి పేద విద్యార్థులకు డిజిటల్ విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ఏపీలో అమలవుతున్న కార్యక్రమాలను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేసేందుకు మనవైపు చూస్తున్నారని చెప్పారు. ఎల్లో మీడియా, చంద్రబాబు కలిసి రాష్ట్రాన్ని దోచుకునేందుకు జగన్ దిగిపోవాలి, చంద్రబాబు కుర్చీ ఎక్కాలి అనే కుట్రతో పని చేస్తున్నారని ఆయన ఓ విద్యార్థిని పిలిచి ట్యాబ్ వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ట్యాబ్ వినియోగంపై విద్యార్థిని ఆరా తీస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

## మేం గెలిస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం

- కళ్యాణదుర్గం శంఖారావం సభలో టీడీపీ నేత నారా లోకేశ్
- జనం లేక సభ అట్టర్ ఫ్లాప్



జనం లేక వెలవెలబోతున్న టీడీపీ శంఖారావం సభా ప్రాంగణం

కళ్యాణదుర్గం: టీడీపీ అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఆదివారం జరిగిన టీడీపీ శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్ సిక్స్ పథకాల గురించి లోకేశ్ వివరించారు. నిరుద్యోగ యువతీ యువకులకు రూ.3 వేల భృతి ఇస్తామన్నారు. ప్రతి విద్యార్థి తల్లి ఖాతాకు ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చొప్పున జమ చేస్తామన్నారు. ప్రతి రైతుకూ పెట్టుబడుల కోసం రూ.20 వేలు అందిస్తామన్నారు. మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు గల మహిళలకు ప్రతి నెల రూ.1,500 చొప్పున ఇస్తామని చెప్పారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. సీఎం జగన్ చేసిన అరాచకాలన్నీ తన రెడ్ బుక్‌లో ఉన్నాయని, త్వరలోనే సుప్రీంకోర్టుకు అందజేస్తామని లోకేశ్ చెప్పారు. కాగా, జనం లేక ఈ సభ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. కళ్యాణదుర్గంలోని ఇందిరమ్మ కాలనీ, దేవీరమ్మ కాలనీ, మారెంపల్లి, వడ్డెర కాలనీల నుంచి ఒక్కొక్కరికి రూ.400 చొప్పున డబ్బులు ఇచ్చి కూలీలను సభకు తరలించినా, వారు లోకేశ్ ప్రసంగం మొదలు కాగానే వెళ్లిపోయారు. మరోవైపు ఈ సభకు మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాదినేని ఉమామహేశ్వర నాయుడు, వారి వర్గీయులు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. అదేవిధంగా పొత్తు కుదిరినప్పటికీ స్థానిక బీజేపీ నాయకులను సభా వేదికపైకి ఆహ్వానించకపోవడం విశేషం.

## నాడు విమర్శించి.. నేడు సిగ్గులేకుండా పొత్తులా?

- చంద్రబాబుకు అందితే జుట్టు.. అందకపోతే కాళ్లు
- మంత్రి ఆర్కే రోజా ధ్వజం



అనంతపురం సెంట్రల్: భార్యను చూసుకోలేనోడు దేశాన్ని ఏం పరిపాలిస్తాడని నాడు ప్రధాని నరేంద్ర మోదీని విమర్శించిన చంద్రబాబు.. నేడు సిగ్గులేకుండా పొత్తులు పెట్టుకున్నాడని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి ఆర్.కె.రోజా విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన స్కాముల్లో సాక్ష్యాధారాలతో దొరికిపోయి శాశ్వతంగా జైలు కెళ్లాల్సి వస్తుందని భయపడి, కేసుల నుంచి తప్పించుకోవడానికే బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఆమె ఆదివారం అనంతపురంలో పురావస్తుశాఖ మ్యూజియాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ అందితే జుట్టు.. అందకపోతే కాళ్లు పట్టుకునే నైజం చంద్రబాబుదని ధ్వజమెత్తారు. గతంలో రాష్ట్రానికి నరేంద్ర మోదీ వచ్చినప్పుడు నల్లబెలూన్లు ఎగురవేసి, అమిత్‌షా కారుపై రాళ్లు రువ్వించిన చంద్రబాబు ఇప్పుడు మోదీ కాళ్ల వద్ద టీడీపీని తాకట్టు పెట్టి జీహుజూర్ అంటున్నాడని విమర్శించారు. కాంగ్రెస్‌తో జతకట్టి రాహుల్‌ను ప్రధానిని చేస్తానని చెప్పడమే కాకుండా ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో ఆ పార్టీకి ఫండింగ్ కూడా చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్‌లకు రాష్ట్ర ప్రజల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావడం.. దోచుకోవడం, దోచుకున్నది దాచుకోవడమే వీరి లక్ష్యమని చెప్పారు. పార్టీని అమ్ముకుంటూ నాయకులు, కార్యకర్తలను మోసం చేయడం జనసేన అధినేతకు తగునా అని ప్రశ్నించారు. ఎర్రబుక్కులో రాసుకున్నామని చెబుతున్న లోకేశ్ ఓ ఎర్ర పుష్పమని, ఏం రాసినా దాన్ని మడిచి బీరువాలో పెట్టుకోవాల్సిందేనన్నారు. అధికారంలోకి వస్తే ఏం సంక్షేమాన్ని అందించాలని ఆలోచించాలేగానీ.. తామొస్తే కేసులు పెట్టి ఇరికిస్తాం, బట్టలు ఊడదీస్తామనేందుకు రాజకీయాలు ఎందుకని ప్రశ్నించారు. రౌడీయిజం చేస్తూ నీతిమాలిన, దిగజారుడు మాటలు మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్, లోకేశ్ జీవితంలో ఎమ్మెల్యేలు కాలేరని స్పష్టంచేశారు. ప్రజలెప్పుడూ అలాంటి వారిని ఇష్టపడరని ఆమె పేర్కొన్నారు.



# ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

## ఆరోగ్యశ్రీతో క్యాన్సర్‌ను జయించా



మాది పేద కుటుంబం. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలోని కలివరపుపేటలో ఉంటున్నాం. రెక్కాడితే గాని పూట గడవని పరిస్థితి. ఇద్దరు పిల్లలు చిన్న వయసులో ఉన్నప్పుడే నా భర్త మృతి చెందారు. కాయ కష్టం చేసి పిల్లలను పెంచాను. అమ్మయికి వివాహం చేశాను. కుమారుడు చేతికందొచ్చి కూలి పనులకు వెళుతున్నాడు. ఇక హాయిగా జీవనం సాగించవచ్చని అనుకుంటున్న పరిస్థితుల్లో బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చింది. వైద్యులను సంప్రదిస్తే లక్షల్లో ఖర్చవుతుందని అన్నారు. పూట గడవడమే కష్టంగా ఉన్న మాకు అంత డబ్బు సమకూర్చలేక చతికల పడ్డాం. ప్రాణాల మీద ఆశలు వదులుకున్నా. ఇంతలో మా వీధి వలంటీరు వచ్చి క్యాన్సర్ చికిత్సను కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చారని చల్లని కబురు చెప్పారు. వెంటనే వైద్యులను సంప్రదిస్తే విశాఖ నగరంలోని మహాత్మా గాంధీ ఆసుపత్రికి రిఫర్‌చేశారు. అక్కడ ఉచితంగా అన్ని తనిఖీలు చేసి కీమోథెరఫీ చేశారు. ఆరు నెలల క్రితం ఆపరేషన్ చేశారు. ఇప్పుడు ప్రతి నెలా ఇంజక్షన్లు ఇస్తున్నారు. ఆరోగ్యంగా ఉన్నాను. నా కోసం ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి ఆరోగ్యశ్రీ లో వైద్యం అందించింది. నేను ఇప్పుడు ఇలా ప్రాణాలతో ఉన్నానంటే దీనికి కారణం జగనన్న పుణ్యమే. జీవితాంతం ఆయన మేలు మరిచి పోలేను. ఇల్లు కూడా మంజూరు చేశారు. నాకు వితంతు పింఛన్ కూడా వస్తోంది. హాయిగా జీవిస్తున్నాము.

– వైశ్యరాజు శాంత లక్ష్మి, కలివరపుపేట, నరసన్నపేట
(మామిడి రవి, విలేకరి, నరసన్నపేట)

## మా బతుకుల్లో ఎంతో మార్పు



నా పేరు గుడివాడ వెంకటరత్నం. మాది విజయనగరం. ఉపాధి నిమిత్తం పది సంవత్సరాల క్రితం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు వలస వచ్చాం. నా భర్త గౌరినాయుడు మేస్త్రీగా పనిచేస్తున్నాడు. చంద్రబాబు ప్రభుత్వంలో మాకు ఏ లబ్ధీ రాలేదు. సీఎం జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఇంటి స్థలం వచ్చింది. రిజిస్ట్రేషన్ చేసి పట్టా నాకు అందజేశారు. వైఎస్సార్ ఆసరాలో రుణమాఫీ కింద రూ.15 వేలు చొప్పున లబ్ధి పొందాను. నాకు త్రివేణి, నవీన్ ఇద్దరు సంతానం. కూతురు త్రివేణి ఎంఎంకేఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో నాలుగో తరగతి చదువుతోంది. అమ్మఒడి పథకం కింద ఏటా రూ.15 వేలు వస్తోంది. మా అత్త రమణమ్మ వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల ద్వారా లబ్ధి పొందింది. మా లాంటి పేదలకు నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, దుస్తులు, బూట్లు కొనాలంటే భారమే. పాఠశాలలు తెరవగానే విద్యాకానుక కిట్టులో ఇవన్నీ అందజేస్తున్నారు. దీంతో మాకు భారం తగ్గింది. పాఠశాలల్లో గోరుముద్ద పథకం కింద పిల్లలకు మధ్యాహ్న భోజనం ఎంతో రుచికరంగా అందిస్తున్నారు. ఈ ప్రభుత్వ పాలనలో హాయిగా జీవిస్తున్నాం. మళ్లీ సీఎంగా జగనే రావాలని కోరుకుంటున్నాం.

– గుడివాడ వెంకటరత్నం, లక్ష్మీనగర్, పాలకొల్లు పట్టణం
(కె శాంతారావు, విలేకరి, పాలకొల్లు అర్బన్)

## మా ఇంట్లో ఇద్దరికి దివ్యాంగ పింఛన్లు



ఒకప్పుడు సాధారణంగా బతికిన ఉమ్మడి కుటుంబం మాది. చాలా కాలం కిందటే విడిపోయి ఎవరి బతుకు వారు బతుకుతున్నాం. కాలక్రమేణా ఉన్న కొద్ది ఆస్తి కరిగిపోయింది. మాది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట. ప్రస్తుతం భర్త, కుమారునితో కలిసి జీవనం సాగిస్తున్నాం. భర్త పళ్లంరాజు, కుమారుడు సాయిరామ్ పుట్టుకతోనే దివ్యాంగులు. వారు ఏ పనీ చేయలేరు. వారి ఆలనా పాలనా అన్నీ నేనే చూసుకోవాలి. ఈ పరిస్థితుల్లో ఉన్న మా కుటుంబానికి నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా పింఛన్ మంజూరు చేయగా నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దివ్యాంగ పింఛన్‌ను రూ.3 వేలకు పెంచి ఇవ్వడంతో ఇబ్బంది లేకుండా జీవనం సాగిస్తున్నాం. భర్త, కుమారుడికి ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున ఇద్దరికీ రూ.6 వేలు వికలాంగ పింఛన్ ప్రతి నెలా వస్తోంది. నేను చిన్నచిన్న పనులు చేసుకుంటుండడంతో ఇంటి భత్యం గడిచిపోతోంది. ఉన్న కొద్దిపాటి ఇంటి స్థలంలో చిన్న ఇల్లు కట్టుకొని జీవిస్తున్నాం.

– బచ్చు మంగతాయారు, కొత్తపేట
(జగత శ్రీరామచంద్రమూర్తి, విలేకరి,, కొత్తపేట)

## ముస్లింల రిజర్వేషన్‌లు తొలగించేందుకు బీజేపీతో బాబు రహస్య ఒప్పందం

- ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, కాసు మహేశ్‌రెడ్డి



నరసరావుపేట రూరల్: రాష్ట్ర ప్రజల భవిష్యత్తును పణంగా పెట్టి టీడీపీ అధినేత చంద్రబాబు బీజేపీతో పొత్తుకు సిద్ధమయ్యారని ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేశ్‌రెడ్డి విమర్శించారు. పల్నాడు జిల్లా చినతురకపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తెలుగువారి ఆత్మగౌరవం నినాదంతో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపిస్తే, నేడు చంద్రబాబు ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టి బీజేపీ పెద్దలతో కాళ్లబేరాలకు దిగాడని విమర్శించారు. బీజేపీ విధించిన మూడు షరతులకు టీడీపీ అంగీకరించిందని చెప్పారు. ముస్లింలకు కల్పిస్తున్న నాలుగుశాతం రిజర్వేషన్‌ను తెలుగు రాష్ట్రాల్లో సంపూర్ణంగా రద్దుచేస్తామని బీజేపీ కేంద్ర నాయకుడు అమిత్‌షా ఇప్పటికే ప్రకటించారని గుర్తుచేశారు. దీనికి చంద్రబాబు కూడా అంగీకారం తెలిపారన్నారు. అలాగే ప్రత్యేకహోదా ఊసే ఎత్తవద్దన్న బీజేపీ పెద్దల మాటలకు చంద్రబాబు మద్దతు ఇచ్చారని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కూడా చంద్రబాబు మద్దతు తెలిపి బీజేపీతో పొత్తును ఖాయం చేసుకున్నారని పేర్కొన్నారు. ముస్లిం రిజర్వేషన్ వలన లబ్ధిపొందిన గ్రామాల్లో చినతురకపాలెం ఒకటన్నారు. 2007 వరకు కనీసం ఇంజినీరింగ్ చదివిన వారు కూడా గ్రామంలో లేరని, పేదరికం కారణంగా ఉన్నతవిద్యకు గ్రామ విద్యార్థులు దూరమయ్యారని తెలిపారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ముస్లిం రిజర్వేషన్ నాలుగుశాతం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వలన గ్రామంలో విద్యావిప్లవం వచ్చిందన్నారు. నేడు 29 మంది వైద్యులు గ్రామం నుంచి వచ్చారని, దీనికి నాలుగుశాతం రిజర్వేషన్ కారణమని తెలిపారు. 2019 ఎన్నికల సమయంలో మోదీని తిట్టిన చంద్రబాబు ఇప్పుడు ఎందుకు బీజేపీతో కాళ్లబేరానికి వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీతో రహస్య ఒప్పందం మేరకు ముస్లిం రిజర్వేషన్‌ను రద్దుచేస్తే వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు.

## పొత్తుపై తుది చర్చలకు ఢిల్లీ నుంచి బీజేపీ ప్రతినిధులు

బాబు, పవన్‌తో చర్చించనున్న కేంద్ర మంత్రి షెకావత్, ఒడిశా నేత బినయ్ పాండే

సాక్షి, అమరావతి: టీడీపీ, జనసేనతో పొత్తు కుదిరిన నేపథ్యంలో బీజేపీకి కేటాయించే స్థానాలపై తుది చర్చలు జరిపేందుకు కేంద్ర మంత్రి షెకావత్, ఒడిశాకు చెందిన బీజేపీ ఎంపీ బినయ్ పాండే ఆదివారం విజయవాడ చేరుకున్నారు. టీడీపీ, జనసేన అధినేతలతో బీజేపీ జాతీయ నాయకత్వం తరఫున వీరిద్దరూ తాము బస చేసిన హోటల్‌లో సోమవారం చర్చలు జరుపుతారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చర్చలకు హాజరవుతారు. తొలుత విజయవాడలో కేంద్రమంత్రి షెకావత్ బస చేసిన హోటల్‌లో మూడు పార్టీల మధ్య చర్చలు జరుగుతాయి. తరువాత బీజేపీ లేదా టీడీపీ కార్యాలయంలో అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. కాగా.. ఆదివారం సాయంత్రం ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ సంఘటనా కార్యదర్శి మధుకర్ కేంద్రమంత్రి షెకావత్, బినయ్ పాండేలతో సమావేశమై పొత్తులో బీజేపీ కోరే సీట్లపై చర్చించారు.

**షెకావత్‌ను కలిసిన పవన్**

సీట్ల సర్దుబాటుపై తుది విడత చర్చల నిమిత్తం పవన్ కళ్యాణ్ ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి విజయవాడ చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి నేరుగా కేంద్రమంత్రి బసచేసిన హోటల్‌కు వెళ్లిన పవన్ వారిద్దరినీ మర్యాద పూర్వకంగా కలిశారు.

# సన్నిధి

వాగ్గేయకార వైభవం



## ఏది గొప్పది... స్వర్గమా! కాశీనా!!!

ముత్తుస్వామి దీక్షితార్ గొప్ప వాగ్గేయకారులు. పుస్తకం పట్టి శాస్త్రాధ్యయనం చేయక పోయినా గంగానదీతీరాన గురు శుశ్రూష చేస్తూ చాలా ధర్మ సూక్ష్మాలను తెలుసుకున్నారు. తదనంతర కాలంలో ఆయన గంగాదేవి గొప్పదనాన్ని కీర్తిస్తూ చేసిన కీర్తనలో ఆయన విషయగాఢత మనకు బోధపడుతుంది. ''...అక్రూర పూజితే అఖిల జనానందే/సకలతీర్థమూలే...'' అన్నారు.

అన్ని తీర్థాలూ గంగానదిలోనే ఉన్నాయన్నారు. ఎందుకలా...!!! తీర్థయాత్ర చేసివచ్చాం అంటారు గానీ భగవత్ దర్శన యాత్ర చేసివచ్చాం అనరు. తీర్థయాత్ర అంటే.. మజ్జనం అంటే.. స్నానం. తీర్థంలో స్నానం చేస్తారు. వేదాలకు భాష్యం చెబుతూ పెద్దలు ఒక మాటన్నారు. అంగీరసాది మహర్షులు ఊర్ధ్వలోకాలకు వెడుతూ... వెళ్ళే ముందు తమ తమ నియమాలను, తపోదీక్షను, తపఃఫలితాన్ని నీటిలో కొన్నిచోట్ల నిక్షేపించి వెళ్ళారు. అవి ఎక్కడ నిక్షేపింపబడ్డాయో అవి తీర్థములు. అటువంటి తీర్థాల్లోకెల్లా గొప్ప తీర్థమేది... అంటే మణికర్ణిక. అది ఎక్కడుంది... గంగానదిలో!

మణికర్ణికా వైభవం అంతా ఇంతా కాదు. 'మణికర్ణికాష్టకమ్' అని శంకరాచార్యులవారు ఒక అష్టకం చేశారు. ఆయన ఒక నదిని గురించి చెప్పడమే చాలా గొప్ప. సాధారణంగా ఆయన క్షేత్ర ప్రసక్తి తీసుకురారు. అటువంటిది గంగాష్టకమ్, నర్మదాష్టకమ్, యమునాష్టకమ్ చేశారు. ఒక్క మణికర్ణిక మీద ఒక అష్టకమ్ చేశారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తీర్థం ఎంత గొప్పదో చెప్పడానికి ఆయన ఒక శ్లోకంలో అద్భుతమైన వర్ణన చేశారు. ''కాశీ ధన్యతమా విముక్తనగరీ సాలంకృతా గంగయా/ తత్రేయం మణికర్ణికా సుఖకరీ ముక్తిర్హి తత్కింకరీ / స్వర్లోకస్తులితః సహైవ విబుధైః కాశ్యా సమం బ్రహ్మణా/ కాశీ క్షోణితలే స్థితా గురుతరా స్వర్గో లఘుత్వం గతః''. కాశీ చాలా చాలా గొప్ప నగరం. అసలు కాశీ ఒకసారి వెడితే చాలు.. అనుకుంటాం. కాశీ అంటేనే ప్రకాశం. కాశీ విముక్త నగరి. అంత గొప్పది కాశీ .... ఆ కాశీకి మళ్ళీ అలంకారం గంగానది. తత్రేయం మణికర్ణికా. అక్కడ మణికర్ణికా తీర్థం కూడా ఉంది. దీనికున్న గొప్పదనం ఏమిటంటే – ''మధ్యాహ్నే మణికర్ణికా స్నపనజం పుణ్యం న వక్తుం క్షమః/ స్వీయైరబ్ద శతైశ్చతుర్ముఖ ధరో వేదార్థ దీక్షాగురుః/యోగాభ్యాసబలేన చంద్రశిఖరస్తత్పుణ్య పారంగత/స్త్వత్తీరే ప్రకరోతి సుప్తపురుషం నారాయణం వా శివమ్''... మధ్యాహ్నం 12 గంటలవేళ మణికర్ణికాతీర్థంలో స్నానం చేస్తున్న వారి కోసం శివకేశవ రూపాల్లో పరబ్రహ్మం పోట్లాడుకుంటుందట... నే తీసుకువెడతా అంటే నే తీసుకువెడతా అని.. 'నీయందు ఎవరయినా స్నానం చేస్తే వారికి మోక్షం ఇస్తాను' అని ముక్తిదేవత ఒక సేవకురాలిలాగా చేతులు కట్టుకుని నిలబడి ఉంటుందట.

ఇంతమంది దేవతలతో కూడుకున్న స్వర్గలోకం గొప్పదా? కాశీపట్టణం గొప్పదా? అని ఒకప్పుడు బ్రహ్మగారికి సందేహం వచ్చిందట. పెద్ద త్రాసు సృష్టించి ఒక పళ్ళెంలో స్వర్గలోకాన్ని మరో పళ్ళెంలో కాశీ పట్టణాన్ని, గంగానదిని, మణికర్ణికా తీర్థాన్ని ఉంచాడట...'' కాశీ క్షోణితలే స్థితా గురుతరా స్వర్గో లఘుత్వం గతః'' కాశీ బరువుకు అది ఉంచిన పళ్ళెం కిందికి దిగితే.. స్వర్గలోకం ఉన్న పళ్ళెం పైకి తేలిపోయిందట. అటువంటి కాశీ పట్టణం ఉన్న ఈ దేశం గొప్పది, ఇక్కడ పుట్టడం కూడా గొప్ప అదృష్టం కదూ!

మంచిమాట

## తమ దగ్గర ఉన్నదే...



**మనసంతా అసూయతో నిండి ఉన్నవారు ఎవరిలోను గొప్పతనాన్ని అంగీకరించ లేరు. ఎవరి గురించి అయినా గొప్పవారు అని అనగానే వెంటనే ఏదో ఒక లోపం వారిలో వెతికి, ఆ ఒక్క దాని వల్ల వారు పనికిరాని వారు అని నిర్ధారించేస్తారు. మానవమాత్రులకి ఏదో ఒక చిన్న లోపం, దోషం కాకపోవచ్చు, ఉండే ఉంటుంది. సద్గుణాలని ఎన్ని ఉన్నా పక్కకి పెట్టి, ఆ చిన్న బలహీనతనే పతాక శీర్షికగా చేస్తారు.**

''అయ్యా! మీనుండి సహాయం పొందిన వారే మిమ్మలని గురించి చాలా చెడుగా మాట్లాడుతున్నారు. మీరు వారి గురించి ఒక్క మాట కూడా మాట్లాడరేమి?'' అని ప్రశ్నించిన వారికి ఒక మహానుభావుడు ఇట్లా సమాధానం చెప్పారు. ''ఎవరైనా తమ దగ్గర ఉన్న దానిని మాత్రమే ఇవ్వగలరు కదా! నా దగ్గర ఉన్న దానిని నేను పంచుతున్నాను. వారి దగ్గర ఉన్న దానిని వారు వెలిగక్కుతున్నారు.''

నిజమే కదా! తమ వద్ద లేని దానిని ఎవరైనా ఎట్లా ఇవ్వగలరు? గుండెల నిండా ప్రేమ, సానుభూతి, ఆప్యాయత, దయ మొదలైనవి ఉన్న వారు వాటినే వ్యక్తీకరించ గలుగుతారు. ద్వేషం, పగ, అసూయ ఉన్న వారు వాటినే ప్రకటించగలుగుతారు. మాటలలో వ్యక్తమయ్యే భావాలే మనిషి మనస్తత్వాన్ని, వ్యక్తిత్వాన్ని తెలియ చేస్తాయి.

**ఈ రోజు మనతో ఎవరి గురించి అయినా చెడుగా చెపుతున్నారు అంటే, రేపు మన గురించి ఎంతమందితో ఏం చెపుతారో! ఇది గుర్తించి మన జాగ్రత్తలో మనం ఉండాలి. ఇట్లా చెప్పేవారికి కాస్త సృజనాత్మకత కూడా ఉంటుంది. ఎదుటివారు నమ్మే విధంగా చక్కని కల్పనలు చేయగలరు. బట్టతలకి మోకాలికి ముడి పెట్టగలరు.**

వాస్తవాన్ని గ్రహించటానికి అటువంటివారి మాటలని వడగట్టవలసి ఉంటుంది. వాటికి వెంటనే ప్రతిస్పందించకుండా ఉండాలి. వీలైనంత దూరంగా ఉండటం మంచిది.

ఒక పాత్రలో దేనినైనా నింపుతూ ఉంటే నిండగానే అది పొంగి పొరలుతూ ఉంటుంది. అదేవిధంగా గుండె అనే పాత్రలో ఏది నిండితే అదే వెలుపలికి ఉబికి వస్తుంది. దానిని తట్టుకోగలగటం కష్టమైన పనే అని చెప్పవలసి ఉంటుంది. కొన్ని సందర్భాలలో ప్రేమని కూడా తట్టుకోటం కష్టం. అవతలి వారిని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. పాయసంలో పడ్డ ఈగ లాగా గిజగిజ లాడవలసి వస్తుంది. కొంచెం ఇబ్బందిగా మొహమాటంగా అనిపించినా ప్రమోదమే కాని, ప్రమాదం ఏమీ ఉండదు. అదే ద్వేషమైతే చెప్పనవసరం లేదు. వాతావరణాన్ని కలుషితం చేయటమే కాదు, కొన్నిమారులు ప్రమాదాలు కూడా తెచ్చి పెడుతుంది. ఇటువంటి వారు సమాజంలో కోకొల్లలుగా కనపడుతూనే ఉంటారు. ఎందుకు ఎదుటి వారి మీద విషం కక్కుతారో తెలియదు. ఎవరు బాగున్నా వీరికి నిద్రపట్టదు. ఏదో ఒక వంకర మాట అనవలసినదే. ఒకప్పుడు మాటలకే పరిమితం అయిన ఈ వ్యవహారం తరువాత అచ్చులో కనపడేది. ఇప్పుడు ఎలెక్ట్రానిక్ మీడియా వేదిక అయింది. ఇక వాట్సప్, ట్విటర్ వంటి వాటిలో విచ్చలవిడిగా విషబీజాలు వెదజల్లటం చూస్తున్నాం. అసలు బాధాకరమైన విషయం ఏమంటే వీటికే ఆదరణ ఎక్కువగా ఉంటోంది. దీనికి కారణం ఆకర్షణ ఒక్కటే కాదు, ఎందుకు ఆ విధంగా చెప్పారో తెలుసుకుందామనే కుతూహలం కూడా అని కొంతమంది విశ్లేషణ. స్పష్టంగా తెలుస్తూనే ఉందిగా – వారి మనస్సులన్నీ ప్రతికూల భావనలతో నిండి ఉన్నాయని!

ఎవరికైనా ఇవ్వాలనుకుంటే, తన దగ్గర ఏదో ఒకటి ఉండాలి కదా! ఉద్దేశం ఉంటే సరి పోదు. శక్తి ఉండాలి, సంపద కూడా ఉండాలి. అది కూడా ఎంత ఇచ్చినా తనకి తక్కువ కాదు అన్నంత నిండుగా ఉంటేనే సాధ్యం. అది ధనం కావచ్చు, విద్య కావచ్చు. వస్తుసంపద కావచ్చు, ప్రేమాభిమానాలు కావచ్చు. మంచివే పెంచుకుందాం. పంచుకుందాం.

**– డా. ఎన్. అనంత లక్ష్మి**

బౌద్ధవాణి

## ఆ సుఖం... నిజమైన సుఖం కాదు!



**అది** 'కురువుల' పట్టణం. దాని సమీపంలో యమునా నది. చల్లని నీడనిచ్చే మామిడి చెట్ల వనం. అందులో అగ్ని భరద్వాజుని ఆశ్రమం. ఆ సమయంలో బుద్ధుడు ఆ ఆశ్రమంలో ఉంటున్నాడు. అగ్ని భరద్వాజుడు బుద్ధునికి తగిన ఆశ్రమాన్ని ఏర్పాటు చేశాడు. ఒకరోజు బుద్ధుడు ఆ పట్టణంలోకి వెళ్ళి భిక్ష స్వీకరించి వచ్చి, ఈ వనంలో ఒక పెద్ద మామిడి చెట్టు కింద కూర్చొని ఉన్నాడు. సమయం మధ్యాహ్నం దాటింది.

అగ్ని భరద్వాజుని దగ్గరకు మాగందియుడు అనే తాపసి వచ్చాడు. పరస్పర కుశల ప్రశ్నల తర్వాత వారిద్దరూ కలిసి మామిడి తోటలో బుద్ధుడున్న చోటుకు వెళ్లారు. అప్పటికే మాగందియుని విషయం బుద్ధునికి తెలుసు. వారు వచ్చాక కొంత సంభాషణ కామసుఖాల మీద జరిగింది.

''మాగందియా! కామసుఖాలకంటే సుఖాన్నిచ్చే గొప్ప సుఖం వేరే ఉంది.'' అన్నాడు బుద్ధుడు. వారిద్దరూ శ్రద్ధగా వినడం మొదలుపెట్టారు.

''నేను యువరాజుగా ఉన్నప్పుడు నాకోసం మూడు ప్రత్యేక భవంతులు నిర్మించారు. వేసవిలో, వర్షాకాలంలో, హేమంత కాలాల్లో నివసించడానికి అనువైన భవనాలు అవి. ఆయా కాలాల్లో హాయిని చేకూర్చే భవనాలు. దివ్య సుఖాన్నిచ్చే భవనాలు నేను ఆ నాలుగు నెలూ ఆ భవనాలు దిగి వచ్చేవాడినే కాదు. చివరికి ఈ కామ సుఖాల బేలతనాన్ని తెలుసుకున్నాను. నాలో కామతృష్ణ తొలగిపోయింది. పిపాస నశించింది. రాగం వదిలిపోయింది. అప్పుడు కూడా ఆనందించాను. కామం, తృష్ణ, పిపాసలు ఇవ్వలేని ఆనందాన్ని కూడా పొందాను. ఆనందం, దుఃఖం భవనాల్లో లేవు. మన మనస్సులోనే ఉంటాయి.'' అని వారివైపు చూశాడు బుద్ధుడు. శ్రద్ధగా వింటూ కనిపించారు.

''మాగందియా! రాగం ద్వేషం, పిపాస ఉన్న మనస్సునే ప్రక్షాళన చేయాలి. కుష్ఠు వ్యాధి శరీరం, వేడి గ్రహించి హాయి పొందినట్లు రాగద్వేషాలతో ఉన్న మనస్సు కూడా వాటిని పొందినప్పుడు హాయి పొందుతుంది. రాజ భవనాల్లో నేను పొందిన హాయి అలాంటిదే! కుష్ఠు వ్యాధి తగ్గిన శరీరం వేడికి హాయి పొందదు. దానికి వేడితో పనిలేదు. అలాగే రాగరహిత హృదయానికి భవనాలు సుఖాలు అవసరం లేదు. ఆరోగ్యమైన శరీరానికి మంటల వేడి అవసరం లేనట్లే... ఆరోగ్యమైన మనస్సుకి కోర్కెలు అవసరం లేదు.


మాగందియా! ఈ కామభోగలాలసలు గతంలోనూ, భవిష్యత్‌లోనూ మనల్ని వెంటాడుతూనే ఉంటాయి. దుఃఖాన్ని కలిగిస్తూనే ఉంటాయి. ఇంద్రియాల్ని లోబరుచుకుంటూనే ఉంటాయి. వీటికి లోబడి పొందే సుఖం, కుష్ఠువారు వేడివల్ల పొందే సుఖం లాంటిది. ఆ సుఖం సుఖం కాదు. దుఃఖమే!'' అన్నాడు.

''భగవాన్! చల్లని మీ మాటల ద్వారా ఏది నిజమైన సుఖమో, ఏది సత్యమైన దుఃఖరహిత మార్గమో... తెలుసుకోగలిగాను. నన్ను కూడా ఇకనుంచి మీ అనుయాయిగా స్వీకరించండి'' అంటూ ప్రణమిల్లాడు మాగందియుడు.

**– డా. బొర్రా గోవర్ధన్**

# సినిమా

## హైదరాబాద్‌లో పాకిస్తాన్ జైలు!



● నాగచైతన్య

హైదరాబాద్‌లో పాకిస్తాన్ జైలు ఏంటి? అనే సందేహం తలెత్తడం ఖాయం. ఇంతకీ విషయం ఏంటంటే.. నాగచైతన్య హీరోగా నటిస్తున్న 'తండేల్' సినిమా కోసం హైదరాబాద్‌లో పాకిస్తాన్ జైలు సెట్ వేశారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ ఆ జైలు సెట్‌లోనే జరుగుతోంది. చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సాయి పల్లవి హీరోయిన్. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్‌పై బన్నీ వాసు ఈ సినిమా నిర్మిస్తున్నారు. చేపల వేటలో భాగంగా పొరపాటున పాకిస్తాన్ సముద్రంలోకి వెళ్లి పట్టుబడిన కొందరు మత్స్యకారుల వాస్తవ ఘటనలతో 'తండేల్' రూపొందుతోంది. పాకిస్తాన్ జైల్లో శిక్ష అనుభవించిన వారిలో ఓ వ్యక్తి పాత్రలో నాగచైతన్య నటిస్తున్నారు. ఈ మూవీ కోసం హైదరాబాద్‌లో పాకిస్తాన్ జైలు సెట్ వేశారు. ప్రస్తుతం ఈ సెట్‌లో షూటింగ్ జరుగుతోంది. హీరో, హీరోయిన్, ఇతర ముఖ్య తారాగణంపై సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. అలాగే పాకిస్తాన్ జైలు నుంచి విడుదలై భారతదేశానికి వచ్చిన మత్స్యకారులు ఒక రైల్వే స్టేషన్‌లో దిగే సన్నివేశాలను కూడా చిత్రీకరిస్తున్నారట మేకర్స్. హైదరాబాద్‌లోని రైల్వేస్టేషన్‌లో ఈ సీన్స్ తెరకెక్కిస్తున్నారని సమాచారం.

## డబుల్ ధమాకా?

హీరోయిన్ త్రిష తెలుగు ప్రేక్షకులకు డబుల్ ధమాకా ఇవ్వనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'విశ్వంభర'. 2006లో విడుదలైన 'స్టాలిన్' సినిమా తర్వాత రెండోసారి 'విశ్వంభర' కోసం జోడీ కట్టారు చిరంజీవి–త్రిష. కొన్నేళ్ల తర్వాత చిరంజీవి నటిస్తున్న పూర్తి స్థాయి సోషియో ఫ్యాంటసీ కాన్సెప్ట్ చిత్రమిది. ఇందులోని గ్రాఫిక్స్ ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తాయని టాక్. కాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయంపై విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఈ మూవీలో త్రిష ద్విపాత్రాభినయం చేయనున్నారని టాక్. ఆమె పాత్రకు కథలో చాలా ప్రాధాన్యం ఉందట.. అందుకే డబుల్ రోల్ చేస్తున్నారని భోగట్టా. ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. యూవీ క్రియేషన్స్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ సినిమా 2025 సంక్రాంతికి విడుదల కానున్న విషయం తెలిసిందే.



● త్రిష

## వెయ్యి కోట్లతో మైఖేల్

**– భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న తొలి బయోపిక్**



● జాఫర్ జాక్సన్

పాప్ కింగ్ మైఖేల్ జాక్సన్ బయోపిక్ నిర్మాణంలో ఉన్న సంగతి తెలిసిందే. 'మైఖేల్' టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మైఖేల్ జాక్సన్ సోదరుడు జెర్మైన్ జాక్సన్ తనయుడు జాఫర్ జాక్సన్ నటిస్తున్నారు. ''జాఫర్ అచ్చం మైఖేల్ జాక్సన్‌లానే ఉన్నాడు. జాఫర్ నడక.. డ్యాన్స్... ఇలా అన్నీ మైఖేల్‌లానే ఉంటాయి. అందుకే మైఖేల్ పాత్రకు జాఫర్ తప్ప వేరే ఎవరూ నప్పరు'' అని ఈ చిత్రదర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా, నిర్మాత గ్రాహం కింగ్ అన్నారు. ఇప్పటికే విడుదలైన జాఫర్ లుక్ చూసి, 'మైఖేల్ తిరిగి వచ్చాడా అన్నట్లు ఉంది' అని అభిమానులు సైతం పేర్కొన్నారు. కాగా, మైఖేల్ జీవితంలో ఉన్న వివాదాల్లో చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్నది ఒకటి. అయితే మైఖేల్ అమాయకుడని, చిన్నారులను వేధించలేదనే కోణంలో 'మైఖేల్' చిత్రాన్ని ఆంటోయిన్ తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఇప్పటి వరకూ హాలీవుడ్‌లో రూపొందిన బయోపిక్స్‌లో 'మైఖేల్' అత్యంత భారీ బడ్జెట్ బయోపిక్ అంటోంది హాలీవుడ్ ఫిల్మ్ సర్కిల్. రూ. వెయ్యి కోట్లకు పైగా బడ్జెట్ అని సమాచారం. వచ్చే ఏడాది ఏప్రిల్ 18న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు. భారీ అంచనాల నడుమ విడుదల కానున్న 'మైఖేల్' చిత్రం పెట్టిన పెట్టుబడికి రెండింతలు... అంటే రూ. రెండువేల కోట్లు వసూలు చేస్తుందనే అంచనాలున్నాయి. ఇక 2009 జూన్ 25న మైఖేల్ కన్ను మూసిన విషయం తెలిసిందే.

## ఆ తర్వాతే నాన్న దర్శకత్వంలో నటిస్తా!


**– ఆకాశ్ పూరి**



''మా నాన్న (దర్శకుడు పూరి జగన్నాథ్) దర్శకత్వంలో ఇప్పట్లో నటించకూడదనుకున్నాను. నాకు నేనుగా హీరోగా పేరు తెచ్చుకున్న తర్వాతే నాన్న డైరెక్షన్‌లో మూవీ చేస్తాను. నేను నటించే సినిమాల కథలను నాన్న వింటారు. అమ్మానాన్నల సపోర్ట్ నాకు పూర్తిగా ఉంది'' అని హీరో ఆకాశ్ పూరి అన్నారు. ఆయన తొలిసారి ఓ క్లాత్ బ్రాండింగ్‌కు అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆకాశ్ పూరి మాట్లాడుతూ– ''నా గత సినిమా 'చోర్‌బజార్' అంతగా ప్రేక్షకాదరణ పొందలేదు. అందుకే ఈసారి జాగ్రత్తగా కథ ఎంచుకుంటున్నాను. ఓ లవ్ స్టోరీతో పాటు యాక్షన్ మూవీ కథలు విన్నాను. అవి ఫైనలైజ్ చేసే పనిలో ఉన్నాం. నేనిప్పటికీ చిన్న పిల్లాడిలా కనిపిస్తానని అంటుంటారు.. హీరోగా సెట్ అయిన తర్వాతే విలన్ క్యారెక్టర్స్ చేయడం గురించి ఆలోచిస్తా. ప్రస్తుతం మా నాన్న దర్శకత్వంలో రామ్‌గారు నటిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' మూవీ చాలా బాగా వస్తోంది'' అన్నారు.

## నవ్వుతూనే ఉంటారు

''కామారెడ్డిలో ఉండే హీరోకి ఓ సమస్య వస్తుంది. దాని పరిష్కారానికి తను ఏం చేశాడు? ఎందుకు హైదరాబాద్ వచ్చాడు? అన్నది 'వెయ్ దరువెయ్' కథాంశం. కొన్ని నిజ జీవిత ఘటనలతో ఈ సినిమాను తెరకెక్కించాం. పూర్తి స్థాయి వినోదాత్మకంగా రూపొందించాం. రెండున్నర గంటల పాటు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అని డైరెక్టర్ నవీన్ రెడ్డి అన్నారు. సాయిరామ్ శంకర్ హీరోగా, యషా శివకుమార్, హెబ్బా పటేల్ హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'వెయ్ దరువెయ్'. లక్ష్మీ నారాయణ పొత్తూరు సమర్పణలో దేవరాజు పొత్తూరు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదలవుతోంది. చిత్రదర్శకుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ– ''సతీష్ వేగేశ్నగారి దగ్గర దర్శకత్వ శాఖలో చేశాను. 'వెయ్ దరువెయ్'తో దర్శకుడిగా మారాను. ఈ కథ వినగానే దేవరాజుగారికి నచ్చటంతో సినిమా చేయటానికి అంగీకరించారు. సాయిరామ్ శంకర్‌తో పాటు యూనిట్ అంతా బాగా సహకరించారు. భీమ్స్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు'' అన్నారు.



● నవీన్ రెడ్డి

## రాణి రుక్మిణీ దేవి

శ్రీవిష్ణు హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'శ్వాగ్'. హసిత్ గోలి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రీతూ వర్మ హీరోయిన్. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. కాగా ఆదివారం (మార్చి 10) రీతూ వర్మ బర్త్ డే. ఈ సందర్భంగా యూనిట్ శుభాకాంక్షలు తెలిపి, 'శ్వాగ్'లో ఆమె చేస్తున్న రాణి రుక్మిణీ దేవి లుక్‌ని రిలీజ్ చేసింది. ''పూర్తి స్థాయి వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రం 'శ్వాగ్'. ఇందులో వింజమర వంశంలోని మహారాణి రుక్మిణీ దేవి పాత్రలో రీతూ వర్మ నటిస్తున్నారు. ఇప్పటికే మా మూవీ టైటిల్, కాన్సెప్ట్ వీడియోకి అద్భుతమైన స్పందన వచ్చింది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, కెమెరా: వేదరామన్ శంకరన్, సహ నిర్మాత: వివేక్ కూఛిబొట్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కృతీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనునాగ వీర.



● రీతూ వర్మ

## కథే హీరోగా మారింది

**– నందినీ రెడ్డి**

''ప్రస్తుతం సినిమా కంటెంట్ మారుతోంది. కథే హీరోగా మారింది. 'లైన్ మ్యాన్'ని వాస్తవ ఘటనలతో చిత్రీకరించారు. ఇలాంటి సినిమా తీసిన యూనిట్‌కి అభినందనలు. ఈ మూవీ హిట్ కావాలి'' అన్నారు డైరెక్టర్ నందినీ రెడ్డి. త్రిగుణ్ హీరోగా వి. రఘుశాస్త్రి దర్శకత్వం వహించిన చిత్రం 'లైన్ మ్యాన్'. పర్పుల్ రాక్ ఎంటర్‌టైనర్స్‌పై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 15న తెలుగు, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి హీరో శివ కందుకూరి ముఖ్య అతిథిగా విచ్చేసి, బిగ్ టికెట్ లాంచ్ చేసి, సినిమా హిట్టవ్వాలని ఆకాంక్షించారు. త్రిగుణ్ మాట్లాడుతూ– ''మహిళలు లైన్ ఉమెన్‌గా రావడం చూసి 'లైన్ మ్యాన్' చేయాలనుకున్నాను'' అన్నారు. ''లైన్ మెన్‌ల జీవితం కష్టంగా ఉంటుంది. వారి జీవితాన్ని తెరపైకి తీసుకొస్తున్న యూనిట్‌కి థ్యాంక్స్'' అన్నారు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: ప్రచూర .పి, కాద్రి మణికాంత్, జ్యోతి రఘుశాస్త్రి, భళా స్టూడియో, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: గణేష్ పాపన్న, కెమెరా: శాంతి సాగర్ హెచ్‌జీ, సంగీతం: మణికాంత్.



● నందినీ రెడ్డి, త్రిగుణ్

## హే.. హలో..

''అంతా నూతన నటీనటులతో, సాంకేతిక నిపుణులతో రూపొందిన 'పతంగ్' ఘనవిజయం సాధించాలి. జోస్ జిమ్మి సంగీతం చాలా వినసొంపుగా ఉంది'' అని ప్రముఖ పాటల రచయిత, ఆస్కార్ అవార్డ్ విన్నర్ చంద్రబోస్ అన్నారు. పతంగుల పోటీతో రూపొందిన కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకత్వంలో విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి నిర్మించారు. నాని బండ్రెడ్డి క్రియేటివ్ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రంలో ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ముఖ్య తారలుగా నటించారు. ప్రముఖ గాయకుడు ఎస్పీ చరణ్ ఓ కీలక పాత్ర చేశారు. వేసవిలో ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ చిత్రంలోని 'హే హలో.. నమస్తే...' అంటూ సాగే పాట లిరికల్ వీడియో సాంగ్‌ని రచయిత చంద్రబోస్, దర్శకుడు కేవీ అనుదీప్ విడుదల చేశారు. ''సాఫ్ట్‌వేర్ ఫీల్డ్‌లో వున్న నేను నాని మీద నమ్మకంతో నిర్మాతగా మారాను'' అన్నార సంపత్ మక. ''ఈ చిత్రంతో జోస్ జిమ్మిని ఓ దశాబ్దం గుర్తుపెట్టుకుంటారు'' అని నాని అన్నారు.



● వంశీ పూజిత్, ప్రీతి, అనుదీప్, చంద్రబోస్, ప్రణవ్

# స్పోర్ట్స్



## పోరాడి ఓడిన శ్రీజ

సింగపూర్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నీలో తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ప్రపంచ మూడో ర్యాంకర్ వాంగ్ మాన్యు (చైనా)తో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 50వ ర్యాంకర్ శ్రీజ 6-11, 11-9, 5-11, 11-8, 8-11తో పోరాడి ఓడిపోయింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో సుతీర్థ ముఖర్జీ 4-11, 11-7, 9-11, 11-9, 10-12తో జియాజిన్ యాంగ్ (చైనా) చేతిలో ఓటమి చవిచూసింది. పురుషుల సింగిల్స్‌లో శరత్ కమల్ క్వాలిఫయింగ్‌లో విజేతగా నిలిచి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందాడు.

## జొకోవిచ్ శుభారంభం



ఐదేళ్ల తర్వాత ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో బరిలోకి దిగిన సెర్బియా టెన్నిస్ స్టార్ జొకోవిచ్ శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడిన జొకోవిచ్ 6-2, 5-7, 6-3తో ప్రపంచ 69వ ర్యాంకర్ అలెగ్జాండర్ వుకిచ్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు. 'మాస్టర్స్ సిరీస్' ఈవెంట్స్‌లో జొకోవిచ్‌కిది 400వ విజయం కావడం విశేషం. కేవలం రాఫెల్ నాదల్ (స్పెయిన్) మాత్రమే మాస్టర్స్ టోర్నీల్లో 400కంటే ఎక్కువ మ్యాచ్‌ల్లో గెలుపొందాడు.



## మళ్లీ టెస్టుల్లో నంబర్‌వన్‌గా...

**అన్ని ఫార్మాట్‌లలో టీమిండియానే 'టాప్'**

**దుబాయ్:** సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను 4–1తో కైవసం చేసుకున్న భారత్ తాజాగా సంప్రదాయ ఫార్మాట్‌లోనూ అగ్రస్థానానికి చేరుకుంది. దీంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అన్ని ఫార్మాట్‌ల ర్యాంకింగ్స్‌లోనూ భారత్ నంబర్‌వన్‌గా నిలిచింది. గతేడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు అగ్రస్థానంలో నిలిచిన భారత్... దక్షిణాఫ్రికా పర్యటనలో ఓటమితో రెండో స్థానానికి పడిపోయింది. మళ్లీ రోజుల వ్యవధిలోనే నంబర్‌వన్ ర్యాంకు దక్కించుకుంది. ఇదివరకే భారత్ అటు వన్డే, ఇటు టి20 ఫార్మాట్‌లలో టాప్ ర్యాంకులో కొనసాగుతోంది. నాలుగో టెస్టు విజయంతోనే టీమిండియా ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్‌లోనూ మొదటి ర్యాంక్‌కు ఎగబాకింది. తద్వారా క్రికెట్‌లో అన్నింటా భారత జట్టు టాపర్ అయ్యింది. ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత్ 122 రేటింగ్ పాయింట్లతో మొదటి స్థానంలో ఉండగా, ఆస్ట్రేలియా (117), ఇంగ్లండ్ (111) వరుసగా రెండు, మూడో ర్యాంకుల్లో ఉన్నాయి. వన్డేల్లో భారత్ (121), ఆస్ట్రేలియా (118), దక్షిణాఫ్రికా (110) టాప్-3 ర్యాంకుల్లో నిలిచాయి. టి20ల్లో టీమిండియా (266), ఇంగ్లండ్ (256), ఆస్ట్రేలియా (255) వరుసగా 1, 2, 3 స్థానాల్లో ఉన్నాయి.

## విజేత వెర్‌స్టాపెన్



**జిద్దా:** ఫార్ములావన్ తాజా సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ వరుసగా రెండో రేసులోనూ టైటిల్ సాధించాడు. సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రిలో నిర్ణీత 50 ల్యాప్‌లను వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా 1 గంట 20 నిమిషాల 43.273 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని తన కెరీర్‌లో 56వ విజయాన్ని నమోదు చేసుకున్నాడు. సీజన్ తొలి రేసు బహ్రెయిన్ గ్రాండ్‌ప్రిలోనూ వెర్‌స్టాపెన్ నెగ్గాడు. సీజన్‌లోని తదుపరి రేసు ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రి ఈనెల 24న జరుగుతుంది.

# ప్లేఆఫ్స్‌కు ఢిల్లీ



- జెమీమా, క్యాప్సీ మెరుపులు
- పరుగు తేడాతో బెంగళూరు ఓటమి
- రిచా ఘోష్ అర్ధ సెంచరీ వృథా

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గత ఏడాది రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ ఈ ఏడాదీ ప్లేఆఫ్స్ దశకు అర్హత సాధించింది. ఆదివారం ఆఖరి బంతిదాకా సాగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ పరుగు తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుపై గెలుపొందింది. ఈ సీజన్‌లో ఢిల్లీకిది ఐదో విజయం. మొదట ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. పవర్‌ప్లేలో ఓపెనర్లు మెగ్ లానింగ్ (26 బంతుల్లో 29; 5 ఫోర్లు), షఫాలీ వర్మ (18 బంతుల్లో 23; 3 ఫోర్లు, 1 సిక్స్) 54 పరుగులతో శుభారంభమిచ్చారు. తర్వాత 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జెమీమా రోడ్రిగ్స్ (36 బంతుల్లో 58; 8 ఫోర్లు, 1 సిక్స్), అలైస్ క్యాప్సీ (32 బంతుల్లో 48; 8 ఫోర్లు) క్రీజులో ఉన్నంతసేపు స్కోరు బోర్డును ఉరుకులు పెట్టించారు. మూడో వికెట్‌కు ఇద్దరు కలిసి 61 బంతుల్లోనే 97 పరుగులు జోడించారు. జెమీమా 26 బంతుల్లో అర్ధసెంచరీ సాధించింది. స్పిన్నర్ శ్రేయాంక 4 వికెట్లు తీసింది. అనంతరం బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసి ఓడింది. ఓపెనర్, కెప్టెన్ స్మృతి మంధాన (5) విఫలమైనా... టాపార్డర్‌లో సోఫీ మోలినెక్స్ (30 బంతుల్లో 33; 5 ఫోర్లు), ఎలీస్ పెరీ (32 బంతుల్లో 49; 7 ఫోర్లు, 1 సిక్స్) బెంగళూరును నడిపించారు. ఓవర్ వ్యవధిలో ఇద్దరు పెవిలియన్ చేరారు. ఈ దశలో రిచా ఘోష్ (29 బంతుల్లో 51; 4 ఫోర్లు, 3 సిక్సర్లు), సోఫీ డివైన్ (16 బంతుల్లో 26; 1 ఫోర్, 2 సిక్స్‌లు) మ్యాచ్‌పై ఆశలు రేపారు. చివరి ఓవర్లో బెంగళూరు విజయానికి 17 పరుగులు కావాల్సి ఉండగా, రిచా రెండు భారీ సిక్స్‌లు బాదింది. ఒక బంతి 2 పరుగుల విజయ సమీకరణం వద్ద రిచా రనౌట్ కావడంతో పరుగు తేడాతో ఢిల్లీ గట్టెక్కింది. నేడు గుజరాత్ జెయింట్స్‌తో యూపీ వారియర్స్ తలపడుతుంది. 10 పాయింట్లతో ముంబై ఇండియన్స్, ఢిల్లీ ఇప్పటికే 'ప్లే ఆఫ్స్' చేరగా... ఆరు పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్న యూపీ ప్లే ఆఫ్స్ దశకు అర్హత పొందే అవకాశాలు సజీవంగా ఉండాలంటే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో గుజరాత్‌పై తప్పనిసరిగా గెలవాలి.

# సాత్విక్–చిరాగ్ జోడీదే టైటిల్




- ఫ్రెంచ్ ఓపెన్‌లో రెండోసారి విజేతగా నిలిచిన భారత ద్వయం
- ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా డబుల్స్ టైటిల్ హస్తగతం

**పారిస్:** ఆద్యంతం ఆధిపత్యం చలాయిస్తూ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ ఈ ఏడాది తమ ఖాతాలో తొలి టైటిల్‌ను జమ చేసుకుంది. ఆదివారం ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో సాత్విక్–చిరాగ్ ద్వయం చాంపియన్‌గా నిలిచింది. కేవలం 37 నిమిషాల్లో ముగిసిన పురుషుల డబుల్స్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ జంట సాత్విక్–చిరాగ్ 21–11, 21–17తో లీ జె హుయ్–పో సువాన్ యాంగ్ (చైనీస్ తైపీ) జోడీని ఓడించింది. టైటిల్ గెలిచే క్రమంలో భారత జోడీ తమ ప్రత్యర్థులకు ఒక్కగేమ్ కూడా కోల్పోకపోవడం విశేషం. విజేతగా నిలిచిన సాత్విక్–చిరాగ్ శెట్టిలకు 62,900 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 52 లక్షలు), 11,000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్, మహారాష్ట్ర ప్లేయర్ చిరాగ్ శెట్టి 2022లోనూ ఫ్రెంచ్ ఓపెన్‌లో టైటిల్ గెలిచారు. ఈ ఏడాది సాత్విక్–చిరాగ్ మలేసియా మాస్టర్స్ టోర్నీ, ఇండియా ఓపెన్ టోర్నీలలో ఫైనల్ చేరి రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకున్నారు. మూడో టోర్నీలో మాత్రం ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా విజేతగా నిలిచారు.

శనివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన సెమీఫైనల్లో ప్రపంచ చాంపియన్స్ కాంగ్ మిన్ హుక్–సియో సెంగ్ జే (దక్షిణ కొరియా) జోడీని 21–13, 21–16తో చిత్తు చేసిన సాత్విక్–చిరాగ్... ఫైనల్లోనూ ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. సుదీర్ఘ ర్యాలీలు సాగకుండా కళ్లు చెదిరే స్మాష్‌లతో పాయింట్లను తొందరగా ముగించారు. తొలి గేమ్‌లో తొలి ఏడు నిమిషాల్లోనే సాత్విక్–చిరాగ్ 11–4తో ఆధిక్యంలోకి వెళ్లారు. ఆ తర్వాత అదే జోరును కొనసాగిస్తూ మరో నాలుగు నిమిషాల్లో తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నారు. రెండో గేమ్‌లో చైనీస్ తైపీ జోడీ నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైనా కీలకదశలో భారత ద్వయం పాయింట్లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది.

# బజరంగ్, రవి దహియాలకు షాక్

**ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ నుంచి అవుట్**





**సోనెపట్ (హరియాణా):** టోక్యో ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన రవి దహియా... కాంస్య పతకం నెగ్గిన బజరంగ్ పూనియాలకు షాక్! పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీల్లో బరిలోకి దిగే భారత జట్టును ఎంపిక చేసేందుకు నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్‌లో బజరంగ్ (65 కేజీలు), రవి (57 కేజీలు) అనూహ్యంగా ఓడిపోయారు. ఆదివారం నిర్వహించిన ట్రయల్స్‌లో సెమీఫైనల్లో బజరంగ్ 1–9తో రోహిత్ చేతిలో ఓడాడు. ఫైనల్లో రోహిత్‌పై సుజీత్ కల్కాల్ గెలుపొంది ఆసియా, వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగిన 57 కేజీల విభాగంలో తొలి బౌట్‌లో రవి దహియా 13–14తో అమన్ సెహ్రావత్ చేతిలో... రెండో బౌట్‌లో 8–10తో ఉదిత్ చేతిలో ఓడిపోయాడు. ఇతర ఒలింపిక్ వెయిట్ కేటగిరీల్లో జైదీప్ (74 కేజీలు), దీపక్ పూనియా (86 కేజీలు), దీపక్ నెహ్రా (97 కేజీలు), సుమిత్ మలిక్ (125 కేజీలు) విజేతలుగా నిలిచి భారత జట్టుకు ఎంపికయ్యారు. ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ ఏప్రిల్ 19 నుంచి 21 వరకు కిర్గిస్తాన్‌లో... వరల్డ్ క్వాలిఫయింగ్ టోర్నీ మే 9 నుంచి 12 వరకు ఇస్తాంబుల్‌లో జరుగుతాయి.

## ఆసీస్ లక్ష్యం 279: ప్రస్తుతం 77/4

**క్రైస్ట్‌చర్చ్:** రెండో టెస్టులో న్యూజిలాండ్ నిర్దేశించిన 279 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆస్ట్రేలియా మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 77 పరుగులు చేసింది. విజయానికి ఆసీస్ మరో 202 పరుగుల దూరంలో ఉంది. కివీస్ బౌలర్లలో హెన్రీ, సియర్స్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. మరో 6 వికెట్లు తీస్తే కివీస్‌కు విజయం దక్కుతుంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 134/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ 372 పరుగులకు ఆలౌటైంది.

## ముంబై 224 ఆలౌట్

**రాణించిన శార్దుల్ ఠాకూర్**



**ముంబై:** విదర్భ జట్టుతో ఆదివారం మొదలైన రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ ఫైనల్లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 64.3 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు పృథ్వీ షా (46; 5 ఫోర్లు), భూపేన్ లాల్వాని (37; 4 ఫోర్లు) తొలి వికెట్‌కు 81 పరుగులు జోడించారు. భూపేన్ అవుటయ్యాక ముంబై పతనం మొదలైంది.ముంబై 111/6తో ఇబ్బందుల్లో పడిన దశలో శార్దుల్ ఠాకూర్ (69 బంతుల్లో 75; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) విదర్భ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. 37 బంతుల్లోనే అర్ధ సెంచరీ చేసిన శార్దుల్ చివరి వికెట్‌గా వెనుదిరిగాడు. విదర్భ బౌలర్లలో హర్ష్ దూబే, యశ్ ఠాకూర్ 3 వికెట్ల చొప్పున తీయగా... ఉమేశ్ యాదవ్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విదర్భ ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 31 పరుగులు చేసింది.

## శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుకు మరో విజయం




**లుధియానా:** ఐ-లీగ్ జాతీయ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఖాతాలో 11వ విజయం చేరింది. ఢిల్లీ ఎఫ్‌సీతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 1-0 గోల్ తేడాతో గెలుపొందింది. ఆట 22వ నిమిషంలో రిల్వాన్ పాస్‌ను హెడర్ షాట్‌తో లాల్‌రొమావియా బంతిని గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. దాంతో శ్రీనిధి డెక్కన్ జట్టు 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత శ్రీనిధి జట్టు ఈ ఆధిక్యాన్ని చివరి నిమిషందాకా కాపాడుకుంది. మొత్తం 13 జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో ప్రస్తుతం శ్రీనిధి జట్టు 36 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఈనెల 17న జరిగే తదుపరి మ్యాచ్‌లో గోకులం కేరళ ఎఫ్‌సీతో శ్రీనిధి జట్టు తలపడుతుంది.

# భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# విద్య, ఉద్యోగ సమాచారం

### ఏపీఆర్‌జేసీ సెట్-2024

గుంటూరులోని ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్(ఇంగ్లిష్ మాధ్యమం) మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఏపీఆర్‌జేసీ సెట్–2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 10(బాలురు, బాలికలు) గురుకుల జూనియర్ కళాశాలలు ఉన్నాయి.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 1149.
» **గ్రూపులు:** ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఈఈటీ, సీజీటీ.
» **అర్హత:** 2023–24 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షలో ఉత్తీర్ణత ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, రిజర్వేషన్, స్పెషల్ కేటగిరీ, స్థానికత ఆధారంగా సీట్లును కేటాయిస్తారు.
» **పరీక్ష విధానం:** ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 150 మార్కులకు ఉంటుంది. విద్యార్థులు ఎంపిక చేసుకునే గ్రూప్ ఆధారంగా సంబంధిత సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 2.30 గంటలు. ప్రశ్నపత్రం తెలుగు/ఇంగ్లిష్, ఉర్దూ/ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది. పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.03.2024
» **ప్రవేశ పరీక్షతేది:** 25.04.2024.
» **వెబ్‌సైట్:** https://aprs.apcfss.in/

### ఐకార్-ఏఎస్ఆర్‌బీ, న్యూఢిల్లీలో 21 అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు

న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఏఎస్ఆర్‌బీ).. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐసీఏఆర్)లో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 21
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ లేదా డిగ్రీ స్థాయిలో ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టులు చదివి ఉండాలి.
» **పని అనుభవం:** కేంద్ర/రాష్ట్ర గుర్తింపు సంస్థ విద్యా సంస్థల్లో హిందీ,ఇంగ్లిష్‌లో మూడేళ్లు బోధించిన అనుభవం ఉండాలి. లేదా గుర్తింపు పొందిన సంస్థల్లో హిందీ నుంచి ఇంగ్లిష్ అనువాదం చేసిన అనుభవం ఉండాలి.
» **వయసు:** 35ఏళ్లు మించకూడదు. ఎస్సీ,ఎస్టీలకు ఐదేళ్లు,ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:**రాతపరీక్ష,ఇంటర్వ్యూ ద్వారా.
» **పరీక్ష విధానం:** ఆబ్జెక్టివ్–కమ్–డిస్క్రిప్టివ్ పరీక్ష, మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి 3 గంటలు. ఇంటర్వ్యూ 30 మార్కులకు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.04.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.05.2024
» **ఆబ్జెక్టివ్ కమ్ డిస్క్రిప్టివ్ పరీక్ష తేది:** 01.09.2024
» **వెబ్‌సైట్:** http://www.asrb.org.in

### కేంద్ర సాయుధ దళాల్లో 4,187 ఎస్ఐ పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. ఢిల్లీ పోలీస్-సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(సీఏపీఎఫ్ఎస్)లో.. సబ్–ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ) నియామక పరీక్ష–2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా ఢిల్లీ పోలీసు విభాగంతోపాటు కేంద్ర సాయుధ బలగాలైన (సీఏపీఎఫ్)–బీఎస్ఎఫ్, సీఐఎస్ఎస్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీలో సబ్–ఇన్‌స్పెక్టర్ పోస్టులను భర్తీ చేస్తారు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 4,187
» **పోస్టుల వివరాలు:** ఢిల్లీలో సబ్–ఇన్‌స్పెక్టర్ పోస్టులు(పురుషులు)–125, సబ్ –ఇన్‌స్పెక్టర్ పోస్టులు(మహిళలు)–61, సీఏపీఎఫ్ఎస్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌లు–4001.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన అర్హత ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 01.08.2024 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** రూ.35,400 నుంచి రూ.1,12,400.
» **ఎంపిక విధానం:** సీబీటీ రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ)/ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్(పీఈటీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.03.2024
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీలు:** 09.05.2024, 10.05.2024, 13.05.2024.
» **వెబ్‌సైట్:** https://ssc.nic.in

### తెలంగాణ టీఆర్‌టీ-డీఎస్సీ-2024

తెలంగాణ రాష్ట్రంలోని స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ–2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గత ఏడాది డీఎస్సీకి దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయనవసరం లేదు

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11,062.
» **పోస్టుల వివరాలు:**స్కూల్ అసిస్టెంట్‌లు(ఎస్ఏ)–2,629,ఎస్‌జీటీ–6,508,ఎల్‌పీ–727,పీఈటీ–182,ఎస్ఏ(స్పెషల్)–220,ఎస్జీటీ(స్పెషల్)–796

**అర్హతలు**

» సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టులకు డీఎడ్ పూర్తిచేసిన వారే అర్హులు. బీఈడీ వారు అర్హులు కాదు. స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) పోస్టులకు బీఈడీ పూర్తిచేసిన వారు అర్హులు. నాలుగేళ్ల బీఈడీ పూర్తిచేసిన వారు కూడా అర్హులే. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసేవారు ఇంటర్‌లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. దీనితో పాటు యూజీ డీపీఈడీ కోర్సు పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ పూర్తిచేసిన వారు బీపీఈడీ కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి. బీఈడీ,డీఎడ్ చివరి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
» తెలంగాణ, ఏపీ టెట్ లేదా సెంట్రల్ టెట్(సీటెట్)లో క్వాలిఫై అయి ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 46 ఏళ్లలోపు ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లు, మాజీ సైనికులకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(టీఆర్‌టీ)కు 80%, టెట్‌లో పొందిన మార్కులకు 20% వెయిటేజీ ఉంటుంది. దీని ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 02.04.2024.
» **పరీక్ష తేదీలు:** త్వరలో ప్రకటిస్తారు.
» **వెబ్‌సైట్:** https://schooledu.telangana.gov.in

### సింగరేణిలో 272 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్).. ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 272

**పోస్టుల వివరాలు**

» **ఎగ్జిక్యూటివ్ పోస్టులు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్),ఈ2గ్రేడ్–139, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎఫ్ అండ్ ఎ), ఈ2 గ్రేడ్–22, మేనేజ్‌మెంట్ ట్రైనీ(పర్సనల్),ఈ2 గ్రేడ్–22, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఐఈ), ఈ2 గ్రేడ్–10, మేనేజ్‌మెంట్ ఎస్టేట్స్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్–10, మేనేజ్‌మెంట్ ట్రైనీ(హైడ్రో–జియాలజిస్ట్), ఈ2 గ్రేడ్–02, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సివిల్), ఈ2 గ్రేడ్–18, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్–03, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఈ3 గ్రేడ్–30.
» **నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు:** సబ్–ఓవర్సీర్ ట్రైనీ (సివిల్), టీ–ఎస్ గ్రేడ్‌సి–16.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ /బీటెక్ /బీఎస్సీ (ఇంజనీరింగ్), సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎంఏ, డిగ్రీ, పీజీ డిప్లొమా, ఎంబీఏ, ఎంఎస్సీ, ఎంబీబీఎస్, డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** గరిష్ఠంగా 30 ఏళ్లు మించకూడదు. జీడీఎంవో పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల వయసు సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.03.2024
» **వెబ్‌సైట్:** https://scclmines.com/scclnew/index.asp

» 2049 పోస్టుల భర్తీకి ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్
» టెన్త్, ఇంటర్, డిగ్రీ అర్హతగా ఉద్యోగాలు
» రాత పరీక్ష, స్కిల్ టెస్ట్‌ల ఆధారంగా ఎంపిక

# పదితోనే కేంద్ర కొలువు

**స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో వివిధ ఉద్యోగాల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టే నియామక సంస్థ! ఎస్ఎస్‌సీ తాజాగా కేంద్రంలోని (పలు శాఖలు, విభాగాల పరిధిలో.. మొత్తం 2049 గ్రూప్–సి, గ్రూప్–డి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది! ఆయా పోస్టులను అనుసరించి పదో తరగతి మొదలు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణుల వరకు.. పోటీ పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర సమాచారం..**

**మొత్తం పోస్టులు 2,049**

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నియామక సంస్థ.. ఎస్ఎస్‌సీ తాజా నోటిఫికేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని మొత్తం 2,049 ఉద్యోగాలను భర్తీ చేయనుంది. రీజియన్ల వారీగానూ ఖాళీలను పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఉండే సదరన్ రీజియన్‌లో 90 పోస్టులు ఉన్నాయి.

**అర్హతలు**

- పోస్టుల స్థాయిని బట్టి 2024,మార్చి 18 నాటికి పదో తరగతి, ఇంటర్మీడియెట్, బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. 2024, జూన్ 13 నాటికి ఆయా అర్హతలు పొందే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.




- **వయసు:** పోస్టును అనుసరించి జూన్ 1, 2024 నాటికి కనీస వయసు 18 ఏళ్లు, గరిష్ఠ వయసు 30 ఏళ్లు ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేరకు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

**రెండు దశల ఎంపిక ప్రక్రియ**

ఎస్ఎస్‌సీ పోస్టుల భర్తీకి రెండు దశలుగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. తొలిదశలో ఆన్‌లైన్ విధానంలో రాత పరీక్ష నిర్వహిస్తారు. అందులో పొందిన మార్కులు, నిర్దిష్ట కటాఫ్ నిబంధనలను అనుసరించి.. మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ మెరిట్ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో టైపింగ్, డేటాఎంట్రీ, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ విభాగాల్లో స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు.

**200 మార్కులకు రాత పరీక్ష**

తొలి దశలో రాత పరీక్ష నాలుగు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ 25 ప్రశ్నలు–50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు–50 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–50 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు–50 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం ఒక గంట. ప్రతి తప్పు సమాధానానికి 1/2 మార్కు నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.

**అర్హతను బట్టి.. క్లిష్టత స్థాయి**

రాత పరీక్షలో పేర్కొన్న విభాగాలు, అంశాలు అన్ని పోస్టులలోనూ ఉమ్మడిగా ఉన్నప్పటికీ.. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న పోస్టుకు పేర్కొన్న అర్హత స్థాయిని బట్టి ప్రశ్నల క్లిష్టత స్థాయి ఉంటుంది. పదో తరగతి అర్హత పోస్టులకు, ఇంటర్ అర్హత పోస్టులకు, డిగ్రీ అర్హత పోస్టులకు వేర్వేరు ప్రశ్నలు ఎదురవుతాయి.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, మార్చి18
- **దరఖాస్తుల సవరణకు అవకాశం:** మార్చి 22 – మార్చి 24
- **పరీక్ష తేదీలు:** 2024 మే 6–8 తేదీల్లో జరుగనున్నాయి.
- **వెబ్‌సైట్:** https://ssc.nic.in

### రాత పరీక్షలో రాణించేలా

ఎంపిక ప్రక్రియలో కీలకమైన రాత పరీక్షలో విజయానికి.. అభ్యర్థులు ముందుగా ఆయా పోస్టులకు నిర్దేశించిన సిలబస్‌ను సమగ్రంగా అవగాహన చేసుకోవాలి. దాని ఆధారంగా ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి.

**జనరల్ ఇంటెలిజెన్స్**

ఈ విభాగంలో గుర్తులు,ప్రాబ్లమ్ సాల్వింగ్,రిలేషన్ షిప్, క్లాసిఫికేషన్, నంబర్ సిరీస్, సిమాటిక్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వెన్ డయాగ్రమ్స్, డ్రాయింగ్ ఇన్ఫరెన్సెస్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

**జనరల్ అవేర్‌నెస్**

దీనికి సంబంధించి జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ టాపిక్స్‌పై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ముఖ్యాంశాలపై దృష్టి పెట్టాలి.

**క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్**

ఈ విభాగంలో రాణించేందుకు అర్థమెటిక్‌తో పాటు ప్యూర్ మ్యాథ్స్ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. నంబర్ సిస్టమ్స్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, పర్సంటేజెస్, రేషియోస్, ఆల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ, లీనియర్ ఈక్వేషన్స్, టాంజెంట్స్ వంటి ప్యూర్ మ్యాథ్స్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

**ఇంగ్లిష్ లాంగ్వేజ్**

ఈ విభాగంలో రాణించేందుకు వ్యాకరణంపై పట్టు సాధించాలి. పార్ట్స్ ఆఫ్ స్పీచ్ మొదలు ప్యాసేజ్ కాంప్రహెన్షన్ వరకూ.. అన్ని రకాల గ్రామర్ అంశాలను చదవాలి. ముఖ్యంగా యాక్టివ్ అండ్ పాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, సినానిమ్స్, యాంటానిమ్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్‌లపై పట్టు సాధించాలి.

**రివిజన్, మాక్ టెస్టులు**

అభ్యర్థులు ప్రిపరేషన్‌లో నిరంతరం రివిజన్ కొనసాగించే వ్యూహం అనుసరించాలి. అదే విధంగా ఒక టాపిక్ లేదా యూనిట్ పూర్తయ్యాక నమూనా పరీక్షలు రాయాలి. అదే విధంగా అన్ని విభాగాలకు సంబంధించి మాక్ టెస్టులకు హాజరవ్వాలి. అర్థమెటిక్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ఇందుకోసం పదో తరగతి స్థాయిలోని గణిత పుస్తకాలతో తమ ప్రిపరేషన్ ప్రారంభించాలి. వాటి ద్వారా ముందుగా కాన్సెప్ట్‌లపై అవగాహన ఏర్పరచుకుని.. అప్లికేషన్ దృక్పథంతో ప్రాక్టీస్ చేయడం ద్వారా ఆయా అంశాలపై పట్టు లభిస్తుంది.

**సీహెచ్ఎస్ఎల్, సీజీఎల్ పేపర్స్ ప్రాక్టీస్**

అభ్యర్థులు గత అయిదేళ్లకు సంబంధించిన సీహెచ్ఎస్ఎల్, సీజీఎల్ పేపర్లను ప్రాక్టీస్ చేయడం వల్ల వేగం పెరుగుతుంది. అంతేకాకుండా ఎస్ఎస్‌సీ పరీక్షల్లో అడిగే ప్రశ్నల శైలిపై అవగాహన ఏర్పడుతుంది. తద్వారా పరీక్షకు పూర్తిస్థాయి సన్నద్ధత లభిస్తుది. దీంతోపాటు పోస్టులకు దరఖాస్తు సమయంలోనే స్కిల్ టెస్ట్‌పై స్పష్టత ఏర్పరచుకుని వాటికి సంబంధించి కూడా సన్నద్ధత పొందడం మేలు.

**స్టాక్ మార్కెట్లు**

దేశీ సూచీలు (గురువారం ముగింపు)

| సూచీ | మార్పు | ముగింపు |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 33 | 74,119 |
| నిఫ్టీ ▲ | 20 | 22,494 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

| సూచీ | ముగింపు | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 16,085 | ▽ | 188 |
| డోజోన్స్ | 38,723 | ▽ | 69 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,660 | ▽ | 33 |
| డాక్స్ | 17,811 | ▽ | 4 |
| షాంఘై | 3,046 | ▽ | 19 |
| నికాయ్ | 39,699 | ▲ | 101 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | [illegible] | 82.44 | 82.42 |
| £ | బ్రిటన్ పౌండ్ | [illegible] | 104.30 | 106.85 |
| € | యూరో | [illegible] | 89.21 | 91.56 |
| ¥ | జపాన్ ఎన్ (100) | [illegible] | 55.14 | 56.39 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | [illegible] | 55.49 | 53.57 |
| S$ | సింగపూర్ డాలర్ | [illegible] | 59.87 | 64.10 |
| SAR | సౌదీ రియాల్ | [illegible] | 21.17 | 22.74 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | [illegible] | 21.65 | 23.43 |
| ¥ | చైనా యువాన్ | [illegible] | 10.37 | 12.37 |

# షరతులు నచ్చితేనే రుణం..

ఎన్నో అవసరాలకు రుణాలు తీసుకోవడం నేడు సర్వ సాధారణంగా మారింది. డిజిటైజేషన్ కారణంగా కోరుకున్నంత రుణం నిమిషాల వ్యవధిలోనే బ్యాంక్ ఖాతాకు జమ అవుతోంది. అవసరంలో ఉన్న వారు రుణం వస్తే చాలన్నట్టు, మిగిలిన ముఖ్యమైన విషయాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. దీనివల్ల తర్వాతి కాలంలో పడే భారాన్ని చూసి ఆందోళన చెందే పరిస్థితి. షరతులు, నియమ, నిబంధనలు, ఫీజుల గురించి తెలుసుకోకుండానే రుణ ఒప్పందంపై నిస్సంకోచంగా సంతకాలు చేయకూడదు. రుణానికి సంబంధించి కీ ఫ్యాక్ట్ స్టేట్‌మెంట్ (కేఎఫ్‌ఎస్/ముఖ్య విషయాల సమాహారం)ను తప్పకుండా చదవాలి. దాన్ని అర్థం చేసుకున్న తర్వాతే బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీతో అంగీకారానికి రావాలి. కేఎఫ్‌ఎస్‌ను రుణ గ్రహీతలకు తప్పకుండా అందజేయాలంటూ ఆర్‌బీఐ తన నియంత్రణ పరిధిలోని అన్ని ఆర్థిక సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ఒక విధంగా రుణ గ్రహీతకు రుణంపై కళ్లు తెరిపించేదే కేఎఫ్‌ఎస్.

- రుణానికి సంబంధించి అన్ని వివరాలు
- అన్ని రకాల చార్జీల సమాచారం
- రిటైల్, ఎంఎస్‌ఎంఈ రుణాలకు కేఎఫ్‌ఎస్ తప్పనిసరి
- బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు తప్పకుండా ఇవ్వాల్సిందే
- ఇందుకు సంబంధించి ఆర్‌బీఐ ఆదేశాలు



కేఎఫ్‌ఎస్‌తో రుణ గ్రహీత నిర్ణయం సులభంగా మారుతుంది. ఒక బ్యాంక్ ఇస్తున్న రుణ ఆఫర్‌తో పోలిస్తే మరో బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ రుణ ఆఫర్‌లో ఏది మెరుగైనదో తెల్సుకోవచ్చు. కేఎఫ్‌ఎస్ అందించకపోయినా, ఒకవేళ కేఎఫ్‌ఎస్‌లో వైరుధ్యాలు ఉన్నా వాటిని రుణదాత దృష్టికి తీసుకెళ్లొచ్చు. ఫిర్యాదును 30 రోజుల్లో పరిష్కరించకపోతే, పరిష్కారం సహేతుకంగా లేకపోతే ఆర్‌బీఐ బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌ను సంప్రదించొచ్చు. ఒకవేళ డిజిటల్ రుణం అయితే దానికి కూలింగ్ ఆఫ్ పీరియడ్ అని ఉంటుంది. ఆ కాలంలో రుణ గ్రహీత తనకు మంజూరైన రుణాన్ని వెనక్కి తిప్పికొట్టొచ్చు. దీనికి ఎలాంటి పెనాల్టీలు పడవని గార్గ్ వివరించారు.

## ఇవి తెలుసుకున్న తర్వాతే..

■ **చెల్లింపుల సామర్థ్యం:** ఎంత రుణం కావాలన్న స్పష్టత ఒక్కటీ ఉంటే సరిపోదు. తీసుకునే ఆ రుణానికి నెలవారీ ఎంత మేర చెల్లించగలరు? అన్నది చాలా కీలకమైన అంశం అవుతుంది. దీని ఆధారంగానే కాల వ్యవధిని నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. తక్కువ కాలవ్యవధిని ఎంపిక చేసుకుంటే ఈఎంఐ ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలం ఎంపిక చేసుకుంటే ఈఎంఐ తగ్గుతుంది. దీనివల్ల చెల్లించాల్సిన వడ్డీ మొత్తం కూడా పెరుగుతుంది. బ్యాంకుల మధ్య వడ్డీ రేటు, ప్రాసెసింగ్ ఫీజు తదితర చార్జీలను పోల్చుకున్న తర్వాతే ఏ బ్యాంక్ నుంచి తీసుకోవాలన్నది నిర్ణయించుకోవాలి. ఎందుకంటే 0.5% వ్యత్యాసమున్నా 4–5 ఏళ్ల చెల్లింపుల్లో చెప్పుకోతగ్గంత తేడా వస్తుంది. తమ ఆదాయంలో అన్ని రుణాలకు చేసే చెల్లింపులు 40% మించకుండా చూసుకోవాలి.

■ **ముందస్తు చెల్లింపులు:**

రుణాన్ని నిర్ణీత కాలానికి ముందే లేదంటే నెలవారీ వీలున్నప్పుడల్లా అదనపు చెల్లింపులు చేసుకుంటూ వెళితే త్వరగా తీరిపోతుంది. దీనివల్ల వడ్డీ రూపంలో చెప్పుకోతగ్గంత ఆదా చేసుకోవచ్చు. కాకపోతే చాలా సంస్థలు ముందస్తు రుణ చెల్లింపులపై 2–4 శాతం చార్జీ విధిస్తుంటాయి. ఈ తరహా చార్జీ అమలు చేయని సంస్థ నుంచి తీసుకోవడం అనుకూలం.



## కేఎఫ్‌ఎస్ అంటే..?

2023 నవంబర్ 15న ఆర్‌బీఐ కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ బజాజ్ ఫైనాన్స్‌కు చెందిన 'ఈకామ్', 'ఇన్‌స్టా ఈఎంఐ కార్డ్' రుణ ఉత్పత్తులను తక్షణం నిలిపివేయాలని కోరింది. కీ ఫ్యాక్ట్ స్టేట్‌మెంట్ (కేఎఫ్‌ఎస్)ను రుణ గ్రహీతలకు బజాజ్ ఫైనాన్స్ అందించకపోవడంతో ఆర్‌బీఐ ఈ చర్యలకు దిగింది. కేఎఫ్‌ఎస్ అన్నది ఒక డాక్యుమెంట్ (పత్రం). ఇందులో రుణానికి సంబంధించి కీలక సమాచారం అంతా ఉంటుంది. నిజానికి రుణ ఒప్పందంలో (లోన్ అగ్రిమెంట్) అన్ని వివరాలు ఉన్నప్పటికీ, అందులోని పదజాలం అర్థం చేసుకోవడం అందరికీ సులభం కాదు. కీలక వివరాలన్నింటినీ సులభంగా అర్థమయ్యేలా కేఎఫ్‌ఎస్ చెబుతుంది. అందుకే దీన్ని కీలక సమాచార పత్రంగా చెబుతారు. రుణంపై వడ్డీ రేటు ఎంత, షరతులు, ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంటేషన్ చార్జీలు, నిర్ణీత కాలం కంటే ముందే సంబంధింత రుణాన్ని తీర్చివేస్తే విధించే చార్జీలు, రుణ వాయిదా చెల్లింపుల్లో ఆలస్యం అయితే పడే పెనాల్టీ చార్జీలు.. ఇలా రుణానికి సంబంధించి సమగ్ర వివరాలు అందులో వెల్లడించడం బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల బాధ్యత. సమస్యల పరిష్కార యంత్రాంగాన్ని కూడా అందులో తెలియజేయాలి. కేఎఫ్‌ఎస్ పారదర్శకతను తీసుకొస్తుంది. కీలక వివరాలన్నీ ఉండడంతో, రుణ గ్రహీత అన్నీ తెలుసుకుని సరైన నిర్ణయం తీసుకునేందుకు వీలు కలుగుతుంది. అందుకే దీన్ని రుణదాతలు అందరికీ అందించాలంటూ ఆర్‌బీఐ ఆదేశాలు తీసుకొచ్చింది. ''కేఎఫ్‌ఎస్ అంటే రుణానికి సంబంధించి అస్థిపంజరం వంటిది. రుణం తీసుకునే వ్యక్తి అన్ని కీళ్లను తెలుసుకోవాలి, వంపులు, కదలికలను తెలుసుకోవాలి''అని సింఘానియా అండ్ కో పార్ట్‌నర్ రాజీవ్ శర్మ వివరించారు. డిజిటల్ రుణాలకు సంబంధించి కేఎఫ్‌ఎస్ మరింత కీలకం. ఎందుకంటే రుణ ప్రక్రియలో ఒకటికి మించిన పార్టీలు భాగస్వాములై ఉంటాయి.

## ఏమి చూడాలి..?

రుణ కాల వ్యవధి, రుణానికి సంబంధించి నెలవారీ చెల్లించాల్సిన మొత్తం (ఈఎంఐ) గురించి కేఎఫ్‌ఎస్‌లో స్పష్టంగా ఉంటుంది. రుణానికి అనుబంధంగా ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకోవాలని బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ కోరుతోందా? అన్నది కేఎఫ్‌ఎస్‌లో పరిశీలించుకోవాలని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్ శెట్టి సూచించారు. ముఖ్యంగా రుణానికి సంబంధించి చెబుతున్న వడ్డీ రేటు వార్షికమేనా? అన్నది చూడాలి. రుణం చెల్లించకపోతే ఎదురయ్యే పరిణామాలు గురించి, అన్ని రకాల చార్జీల గురించి తెలుసుకోవాలి. రుణ గ్రహీత కోరితే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కేఎఫ్‌ఎస్ కాపీ, రుణ డాక్యుమెంట్లను ఈమెయిల్‌కు పంపిస్తాయని పరిజిత్ గార్గ్ చెబుతున్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా రుణం తీసుకుంటున్నట్టు అయితే, రుణ వివరాల పేజీ నుంచే దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని శర్మ సూచించారు. నెట్‌బ్యాంకింగ్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆదిల్ శెట్టి తెలిపారు.

■ **ఆదాయంలో అప్పుల రేషియో:**

బ్యాంక్‌లు రుణం ఇచ్చే ముందు రుణ గ్రహీత క్రెడిట్ స్కోరు, ఆదాయంలో అప్పుల రేషియోని చూస్తాయి. ఆదాయంలో అప్పులకు చేసే చెల్లింపులు 43 శాతం మించి ఉంటే అప్పుడు చెల్లింపుల్లో రిస్క్ ఉన్నట్టు అవి భావించొచ్చు. దాంతో రుణ దరఖాస్తు తిరస్కరణ లేదంటే అధిక వడ్డీ రేటును విధించొచ్చు.

■ **క్రెడిట్ స్కోర్:**

750 అంతకంటే ఎక్కువ స్కోరు ఉంటే దాన్ని ఉత్తమమైనదిగా పరిగణిస్తాయి బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు. అంతేకాదు రుణం సులభంగా, వేగంగా లభిస్తుంది. డిమాండ్ చేసి వడ్డీ రేటులో కొంత తగ్గింపు ప్రయోజనాన్ని సైతం పొందొచ్చు.

## పారదర్శకత కోసం..

''చారిత్రకంగా చూస్తే రుణ వ్యయాల విషయంలో పారదర్శకత ఉండేది కాదు. వడ్డీ రేటునే ప్రముఖంగా ప్రకటనల్లో పేర్కొనడం కనిపించేది. తక్కువ వడ్డీ రేటుకు వస్తుందని రుణం తీసుకున్న తర్వాతే.. వివిధ రకాల ఫీజుల భారం తెలిసొచ్చేది. పారదర్శకత లేకపోవడం వల్ల వారు వివిధ రుణ ఉత్పత్తులను పోల్చుకుని, వాస్తవ రుణ వ్యయాల గురించి అర్థం చేసుకోలేకపోయేవారు'' అని మై మనీమంత్ర ఎండీ రాజ్ ఖోస్లా పేర్కొన్నారు. అన్ని రకాల చార్జీల గురించి కేఎఫ్‌ఎస్‌లో పేర్కొనడం పారదర్శకత, వినియోగదారు అనుకూల రుణ వాతావరణానికి దారితీస్తుందన్నారు. ''ఇప్పటికైతే రుణాలపై వడ్డీ రేటు, ఇతర ఫీజులు, చార్జీలు, ప్రాసెసింగ్ ఫీజులు, డాక్యుమెంటేషన్ చార్జీలు తదితరమైనవి ఉండేవి. కేఎఫ్‌ఎస్‌ను అన్ని రకాల రిటైల్, ఎంఎస్‌ఎంఈ రుణాలకు విస్తరించాం. రుణాల పంపిణీలో పారదర్శకత పెంపు, కస్టమర్లు తగిన నిర్ణయం తీసుకునేందుకు ఇది వీలు కల్పిస్తుంది''అని ఆర్‌బీఐ ఎంపీసీ సమీక్ష అనంతరం ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ చెప్పారు.

## వడ్డీ రేటు వేరు, ఏపీఆర్ వేరు

ఈ రెండింటి మధ్య ఉన్న బేధాన్ని రుణ గ్రహీతలు అర్థం చేసుకోవాలి. యాన్యువల్ పర్సంటేజ్ రేట్ (ఏపీఆర్) అంటే అన్ని చార్జీలు కలిపినది. ఉదాహరణకు రూ.లక్ష రుణాన్ని బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి 36 నెలల కాలానికి 18 శాతం రేటుపై తీసుకున్నారని అనుకుందాం. అంటే నెలవారీ ఈఎంఐ రూ.1,500 అనుకుంటాం. కానీ కాదు. ఈ రుణం ఏపీఆర్ 20.16 శాతం అవుతుంది. అంటే చెల్లించాల్సిన ఈఎంఐ రూ.1,680 అవుతుంది. ప్రాసెసింగ్ ఫీజు, ఇన్సూరెన్స్, ఆరంభంలో విధించే పలు చార్జీలు అన్నీ కలసి ఈ స్థాయికి చేరింది. రుణంపై నికర వడ్డీ రేటుకు అన్ని రకాల చార్జీలు కలిపి ఏపీఆర్ ఎంత అన్నది కేఎఫ్‌ఎస్‌లో పేర్కొనాలన్నది ఆర్‌బీఐ ఆదేశం. అయితే, రుణ వాయిదా ఆలస్యంగా చెల్లిస్తే విధించే ఆలస్యపు రుసుము, కంటింజెంట్ చార్జీలు ఇందులో భాగంగా ఉండవని బ్యాంక్ బజార్ ఆదిల్ శెట్టి తెలిపారు. ఈఎంఐ బౌన్స్ చార్జీలు, రుణాన్ని ముందస్తుగా చెల్లించేట్టు అయితే విధించే చార్జీలు కూడా ఏపీఆర్‌లో కలసి ఉండవు.


## మెరుగైన అవగాహన

''కస్టమర్లలో అవగాహన పెంచేందుకు ఇదొక అవకాశం. రుణానికి సంబంధించి అన్ని ముఖ్యమైన వివరాలను తెలియజేయడం వల్ల రుణగ్రహీత అనుభవం మెరుగ్గా ఉంటుంది. ఎంఎస్‌ఎంఈ రుణ గ్రహీతలు మెరుగైన నిర్ణయం తీసుకునేందుకు వీలుంటుంది' 'అని గోద్రేజ్ క్యాపిటల్ ఎండీ, సీఈవో మనీష్ షా తెలిపారు. వ్యక్తిగత రుణాలు, సూక్ష్మ రుణాలు, డిజిటల్ రుణాలకే లోగడ కేఎఫ్‌ఎస్ తప్పనిసరి. ఇకపై అన్ని రిటైల్ రుణాలు, ఎంఎస్‌ఎంఈ రుణాలకు ఇది ఇవ్వాల్సి ఉంటుంది. ''రుణాలపై అసలు వ్యయాలు ఎంత మేర ఉన్నాయనేది రుణ గ్రహీతలకు దీనివల్ల తెలుస్తుంది. చెప్పకుండా విధించే చార్జీలకు కళ్లెం వేస్తుంది. ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయం రుణ గ్రహీతల్లో రుణ ఎకోసిస్టమ్ పట్ల విశ్వాసాన్ని పెంచుతుంది.''అని ఫైనాన్సింగ్ ప్లాట్‌ఫామ్ 'వెలాసిటీ' వ్యవస్థాపకుడు, సీఈవో అభిరూప్ మేధేకర్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా కేఎఫ్‌ఎస్ రిటైల్ రుణ గ్రహీతలకు మేలు చేస్తుంది. కార్పొరేట్ సంస్థలకు కేఎఫ్‌ఎస్‌తో ప్రత్యేకంగా అవసరం ఉండదు. ఎందుకంటే ఆయా సంస్థల వద్ద ఆర్థిక, న్యాయ నిపుణులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. కనుక బ్యాంకుల ఒప్పంద పత్రాలను అవి సమగ్రంగా సమీక్షించుకోగలవు. కానీ, చిన్న సంస్థలు, వ్యక్తులకు ఇది కష్టమైన పనే అవుతుంది. వ్యక్తులు అయితే బ్యాంక్ మార్కెటింగ్ సిబ్బంది చెప్పిందే నమ్మాల్సిన పరిస్థితి. ఇవన్నీ దృష్టిలో ఉంచుకునే కేఎఫ్‌ఎస్‌ను వ్యక్తులు, ఎంఎస్‌ఎంఈ రుణాలకు ఆర్‌బీఐ తప్పనిసరి చేసింది.



## యాక్సిస్ క్రిసిల్ డెట్ ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా యాక్సిస్ క్రిసిల్ ఐబీఎక్స్ ఎస్‌డీఎల్ జూన్ 2034 డెట్ ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇందులో కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. మార్చి 12తో ఈ ఎన్‌ఎఫ్‌వో ముగుస్తుంది. ఈ ఆఫర్ ద్వారా సమీకరించిన నిధులను నిర్దేశిత ఇండెక్స్ సెక్యూరిటీల్లో మాత్రమే ఇన్వెస్ట్ చేస్తారు. ప్రస్తుత ఈల్డ్ కర్వ్ .. మధ్య, దీర్ఘకాలిక పెట్టుబడులపై మెరుగైన రాబడులు అందుకునేందుకు అనువుగా ఉందని సంస్థ తెలిపింది. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పోర్ట్‌ఫోలియోను పటిష్టపర్చుకోవాలని భావిస్తున్న ఇన్వెస్టర్లకు ఇది అనుకూలమైన ఫండ్ కాగలదని తెలిపింది.




**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 11-3-2024 | |
|---|---|
| విశాఖ | 475–00 |
| చిత్తూరు | 503–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 433–00 |
| విజయవాడ | 433–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **10-3-2024 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 410–00 |
| వరంగల్ | 412–00 |
| రిటైల్ ధర | 4.70 |

## హీరో మోటోకార్ప్ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ. 4,650 **టార్గెట్:** రూ. 5,560

**ఎందుకంటే:** ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికం(క్యూ3)లో అంచనాలకు అనుగుణమైన నిర్వహణ పనితీరును ప్రదర్శించింది. వచ్చే ఏడాది(2024–25) ద్విచక్ర వాహన పరిశ్రమ రెండంకెల వృద్ధిని అందుకోగలదని కంపెనీ అంచనా వేస్తోంది. కొత్త మోడళ్లను ప్రవేశపెట్టడం ద్వారా పరిశ్రమను మించిన పురోగతిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వెరసి ఇప్పటినుంచీ మార్జిన్లలో మెరుగుదల(అప్‌ట్రెండ్)ను ఆశిస్తోంది. ఇందుకు ముడివ్యయాలు తగ్గడం, విభిన్న మోడళ్ల విడుదల దోహదం చేయగలదని విశ్వసిస్తోంది. మొత్తంగా ద్విచక్ర వాహన పరిశ్రమ ఆదాయాల్లో రెండంకెల వృద్ధి నమోదుకాగలదని భావిస్తోంది. కంపెనీపరంగా ఆధునిక మోడళ్ల వాహనాల విడుదల ద్వారా పరిశ్రమను మించిన అమ్మకాలను నమోదు చేయాలని ఆశిస్తోంది. దీంతో మార్కెట్ వాటాను పెంచుకోవాలనే ప్రణాళికల్లో ఉంది. వచ్చే ఏడాదిలోనూ 125 సీసీ, ఆపై సామర్థ్యంగల ద్విచక్ర వాహనాలకు డిమాండ్ నెలకొంటుందని అంచనాతో అడుగులు వేస్తోంది. ఈ ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో సంప్రదాయ ఇంటర్నల్ కంబాస్టన్ ఇంజిన్(ఐసీఈ) విభాగం మార్జిన్లు 16 శాతంగా నమోదయ్యాయి. క్యూ3 మార్జిన్లపై ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) అమ్మకాలు 2 శాతంమేర ప్రభావం చూపాయి. ఇందుకు పండుగల సీజన్ సహకరించింది. పూర్తి ఏడాదికి 1–1.5% ప్రభావం ఉండవచ్చు. ముడివ్యయాలు నిలకడను చూపితే ఇకపై మార్జిన్లు బలపడతాయని కంపెనీ యాజమాన్యం భావిస్తోంది.




## డేటామాటిక్స్ గ్లోబల్ | చాయిస్ బ్రోకింగ్ | కొనొచ్చు

**ప్రస్తుత ధర:** రూ. 576 **టార్గెట్:** రూ. 760

**ఎందుకంటే:** ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికం(క్యూ3)లో డేటామాటిక్స్ గ్లోబల్ సర్వీసెస్ ఆదాయం మందగించింది. అంచనాలకంటే స్వల్పంగా తగ్గి రూ. 369 కోట్లకు పరిమితమైంది. వార్షికంగా 1 శాతం, త్రైమాసికవారీగా 2 శాతం క్షీణించింది. ప్రధానంగా పశ్చిమ మార్కెట్ల నుంచి భారీ ఐటీ కాంట్రాక్టులపై నిర్ణయాలపట్ల కాలయాపన జరగడం ప్రభావం చూపింది. అయితే వివిధ విభాగాల నుంచి ఆదాయం సమకూరడం సానుకూల అంశంకాగా.. డిజిటల్ కార్యకలాపాల విభాగం వార్షికంగా దాదాపు 5 శాతం పురోగతిని అందుకుంది. క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో పన్నుకుముందు లాభం వార్షికంగా 13 శాతం క్షీణించి రూ. 44 కోట్లకు పరిమితమైంది. దీంతో కన్సాలిడేటెడ్ నికర లాభం 10 శాతం తక్కువగా రూ. 41 కోట్లకు చేరింది. ఈ కాలంలో 12 మంది కొత్త క్లయింట్లను జత చేసుకుంది. 24.5 కోట్ల డాలర్ల విలువైన పైప్‌లైన్(కాంట్రాక్టులు) ప్రకటించింది. అనిశ్చిత వాతావరణం, ఐచ్చిక వ్యయాలు నీరసించడం ప్రతికూల అంశాలు కాగా.. ఏఐ ఫస్ట్, ఆర్గనైజేషనల్ పునర్వ్యవస్థీకరణలను వృద్ధి చోదకాలుగా కంపెనీ గుర్తించి ప్రాధాన్యతను ఇస్తోంది. వెరసి ఈ ఏడాది ఆదాయంలో 4.5–5 శాతం వృద్ధిని ఆశిస్తోంది. చక్రీయ పరిస్థితులరీత్యా క్యూ4(జనవరి–మార్చి)లో పటిష్ట పనితీరును అంచనా వేస్తోంది. 11–12 శాతం పురోగతిని అందుకోనుంది. రానున్న మూడేళ్ల కాలం (2023–26)లో వార్షికంగా ఆదాయంలో 14.4 శాతం, నిర్వహన లాభంలో 19.5 శాతం, నికర లాభాల్లో 19.2 శాతం వృద్ధిని అందుకోగలదని అంచనా వేస్తున్నాం.



**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

# అత్యవసర నిధికి మార్గం ఏది?

**Q & A**



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్




**నేను ఆదాయపన్ను 30 శాతం శ్లాబు పరిధిలోకి వస్తాను. దీంతో అత్యవసర నిధిని ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి?**

– శివ్ గణేశన్

మీ అత్యవసర నిధిలో కొంత భాగాన్ని డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. రాబడులకు మార్గం అవుతుంది. అత్యవసర నిధి ఎప్పుడూ మూడు భాగాలుగా వర్గీకరించుకుని ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. మొదటి భాగాన్ని నగదు రూపంలోనే ఉంచుకోవాలి. రెండో భాగాన్ని బ్యాంకు ఖాతా లేదంటే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మూడో భాగాన్ని లిక్విడ్ ఫండ్ లేదా అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల రాబడులు సానుకూలంగా ఉంటాయి. డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడే రాబడులపై పన్ను వర్తిస్తుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ అయితే ఏటేటా వడ్డీ ఆదాయం పన్ను చెల్లింపుదారు ఆదాయానికి కలుస్తుంది. వారి శ్లాబు రేటు ప్రకారం పన్ను ఆధారపడి ఉంటుంది. అధిక పన్ను శ్లాబు పరిధిలోకి వచ్చే వారు ఫిక్స్‌డ్ డిపాజిట్ నుంచి వచ్చే వడ్డీ ఆదాయంపైనా 30 శాతం పన్ను చెల్లించాల్సి వస్తుంది. అలాగే, మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను విక్రయించినప్పుడు కూడా నమోదయ్యే లాభంపై ఇంతే మేర పన్ను చెల్లించాల్సి వస్తుంది. అయితే, ఎఫ్‌డీలతో పోలిస్తే డెట్ ఫండ్స్ కాస్త మెరుగైన రాబడులను ఇస్తాయి. కానీ, డెట్ ఫండ్స్‌లో రాబడులకు హామీ ఉండదు. ఫిక్స్‌డ్ డిపాజిట్స్ మాదిరి పెట్టుబడులకు రక్షణ హామీ కూడా ఉండదు. అయినా కానీ, లిక్విడ్ ఫండ్స్, అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ తక్కువ రిస్క్ విభాగంలోకి వస్తాయి. నాణ్యమైన డెట్ పేపర్లలో ఇన్వెస్ట్ చేసిన పథకాన్నే ఎంపిక చేసుకోవాలి. లేదంటే రిస్క్ తీసుకున్నట్టు అవుతుంది.

# ఆకర్షణీయంగా లార్జ్ క్యాప్స్

### పీజీఐఎం ఇండియా ఎంఎఫ్ సీఐవో వినయ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లార్జ్ క్యాప్ స్టాక్స్ సముచిత వేల్యుయేషన్లలోనే ట్రేడవుతున్నందున అవి ఆకర్షణీయంగా ఉన్నాయని పీజీఐఎం ఇండియా మ్యుచువల్ ఫండ్ సీఐవో వినయ్ పహాడియా తెలిపారు. స్మాల్, మీడియం క్యాప్ షేర్లు ప్రీమియం వేల్యుయేషన్లతో ట్రేడవుతున్నప్పటికీ ప్రస్తుతం మార్కెట్ రెండంచెలుగా ఉందని చెప్పారు. నాణ్యమైన, అధిక వృద్ధికి ఆస్కారం గల కొన్ని సంస్థలు సముచితమైన, ఆకర్షణీయమైన వేల్యుయేషన్స్‌లో ఉన్నాయని.. అదే సమయంలో తక్కువ వృద్ధి రేటు గల మరికొన్ని కంపెనీలు అధిక వేల్యుయేషన్లలో ట్రేడవుతున్నాయని వినయ్ చెప్పారు. నాణ్యంగా లేని మిడ్, స్మాల్ కంపెనీలకు దూరంగా ఉండాలని సూచించారు. మధ్యకాలికం నుంచి దీర్ఘకాలిక కోణంలో మెరుగైన, అధిక వృద్ధి రేటు గల కంపెనీల షేరు ధర, ఆయా సంస్థల ఆదాయాల వృద్ధికి అనుగుణంగా మంచి పనితీరే కనపర్చాయని చెప్పారు. అయితే, ఏడాది నుంచి 3 ఏళ్ల వ్యవధిలో మాత్రం అవి అంతగా రాణించలేదన్నారు. ఈ నేపథ్యంలో మూడు నుంచి అయిదేళ్ల వ్యవధి కోసం సముచిత వేల్యుయేషన్లలో లభిస్తున్న కంపెనీల్లో లార్జ్, మిడ్ క్యాప్ ఫండ్స్ ద్వారా పెట్టుబడులు పెడితే పోర్ట్‌ఫోలియో డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు పొందేందుకు ఆస్కారం ఉంటుందని చెప్పారు.

**ఫైనాన్షియల్స్, హెల్త్‌కేర్..**

రంగాలవారీగా చూస్తే ప్రస్తుతం ఫైనాన్షియల్స్, హెల్త్‌కేర్, వినియోగదారుల విచక్షణ మేరకు కొనుగోలు చేసే ఉత్పత్తుల సంస్థలు మొదలైన వాటిల్లో పెట్టుబడులకు అవకాశాలు కనిపిస్తున్నాయని వినయ్ చెప్పారు. యుటిలిటీలు, ఎనర్జీ, మెటీరియల్స్ వంటి రంగాల్లో అవకాశాలు తక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆదాయం .. వృద్ధి అవకాశాలు తక్కువగా ఉన్నవి, ఆయా రంగాల్లో అకస్మాత్తుగా చోటు చేసుకునే మార్పుల ప్రభావాలకు లోనయ్యేవి, భారీగా రుణ భారం ఉన్నవి, గవర్నెన్స్ ట్రాక్ రికార్డు సరిగ్గా లేనివి మొదలైన స్టాక్స్‌కి దూరంగా ఉండటం మంచిదని వినయ్ సూచించారు. మధ్యకాలికంగా చూస్తే ద్రవ్యోల్బణం అధిక స్థాయిలోనే ఉండొచ్చని వినయ్ చెప్పారు. సమీప భవిష్యత్తులో ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తే సంపద వృద్ధి కోసం ఈక్విటీలు, నాణ్యమైన కంపెనీల్లో పెట్టుబడులు ఉపయోగకరంగా ఉండగలవని పేర్కొన్నారు.

# ‘ఆగ్రా మెట్రో స్టేషన్’ నిర్మాణంలో హంటర్ డగ్లస్ కీలకపాత్ర

**శ్రీసిటీలో కంపెనీకి అధునాతన ప్లాంట్**

**శ్రీసిటీ (వరదయ్యపాళెం) (తిరుపతి జిల్లా):** యూపీ సీఎం ఆదిత్యనాథ్ ఈనెల 6న ఆగ్రాలో ప్రారంభించిన ‘తాజ్‌మహల్ మెట్రో స్టేషన్’ నిర్మాణంలో శ్రీసిటీలోని హంటర్ డగ్లస్ పరిశ్రమ కీలకపాత్ర పోషించింది. ప్రయాణికులకు ఆకర్షణీయంగా, ధ్వని ప్రశాంతత ఉండేలా కంపెనీ ప్రత్యేక ఉత్పత్తుల్లో ప్రముఖమైన లక్సలోన్ వుడ్ ఫినిషింగ్ రోల్–ఫార్మ్‌డ్ మెటల్ బ్యాఫిల్‌ను 10వేల చ.మీ విస్తీర్ణానికి సరిపడా హంటర్ డగ్లస్ సరఫరా చేసింది. అంతేకాకుండా లక్సలోన్ 300సీ లీనియర్ రోల్–ఫార్మ్‌డ్ మెటల్ సీలింగ్ సమకూర్చడం ద్వారా స్టేషన్ నిర్మాణానికి మరింత వన్నె తెచ్చింది. నాగ్‌పూర్, పూణే, ముంబై, అహ్మదాబాద్, నవీ ముంబై, బెంగళూరు, చెన్నై, జైపూర్, ఢిల్లీ, కాన్పూర్, కోల్‌కత్తా, ఆగ్రాతో సహా దేశమంతటా ప్రధాన మెట్రో స్టేషన్ల రూపకల్పనలో తమ కంపెనీ కీలకపాత్ర పోషిస్తున్నట్లు హంటర్ డగ్లస్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ పి.కె.సుందర మూర్తి తెలిపారు. ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు హంటర్ డగ్లస్ అందిస్తున్న సహకారాన్ని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రశంసించారు. గతంలో ఈ సంస్థ పంజాబ్‌లోని అంబాలా ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో రాఫెల్ ఫైటర్ జెట్ హ్యాంగర్, ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయ సదుపాయమైన సూరత్ డైమండ్ బోర్స్ ప్రాజెక్టులకు తన భాగస్వామ్యాన్ని అందించింది.


**హంటర్ డగ్లస్ ఉత్పత్తులతో ఆగ్రాలో నిర్మించిన తాజ్ మహల్ మెట్రో స్టేషన్**

# ప్రైవేట్ వర్సిటీల ఆఫ్ క్యాంపస్‌లకు నోటిఫికేషన్

**యూజీసీ మార్గదర్శకాలు విడుదల**

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ఆఫ్ క్యాంపస్ సెంటర్‌లు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రైవేట్ వర్సిటీల కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి కనీసం ఐదేళ్ల విద్యా కార్యకలాపాలు/ప్రధాన క్యాంపస్‌లో ప్రోగ్రామ్ పూర్తి చేసినప్పుడు మాత్రమే మరోచోట సెంటర్ నెలకొల్పేందుకు అర్హులని పేర్కొంది. స్టేట్ వర్సిటీ చట్టం పరిధిలో పనిచేస్తోన్న వర్సిటీలకు వర్తించే నిబంధనలే ఆఫ్ క్యాంపస్‌లకూ వర్తిస్తాయని స్పష్టం చేసింది. ఆఫ్ క్యాంపస్ సెంటర్‌లో అందించే నిర్దిష్ట ప్రోగ్రామ్‌ల కోసం చట్టబద్ధమైన అనుమతులు తీసుకోవడంతో పాటు కొత్త సెంటర్ స్థాపించే భూమికి కనీసం 30 ఏళ్ల పాటు యాజమాన్య హక్కులు, లీజు ఒప్పందం ఉండాలని వివరించింది. ఫ్యాకల్టీ, నైపుణ్యం, మౌలిక సదుపాయాలతో సహా ఉన్నత విద్యా ప్రమాణాలను తప్పనిసరిగా ప్రధాన క్యాంపస్‌తో సమానంగా నిర్వహించాలని మార్గదర్శకాలు జారీ చేసింది.

# నేడు, రేపు ఎంఎస్ఎంఈ వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

**సాక్షి, అమరావతి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు తమ వార్షిక కొనుగోళ్లలో 25 శాతం తప్పనిసరిగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నుంచి కొనుగోలు చేసేలా తీసుకొచ్చిన పబ్లిక్ ప్రొక్యూర్మెంట్ పాలసీపై అవగాహన కల్పించేందుకు విజయవాడలో రెండు రోజుల పాటు ఎగ్జిబిషన్–కమ్–వెండర్ డెవలప్‌మెంట్ జరుగనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ నెల 11, 12 తేదీల్లో ఆటోనగర్‌లోని ది ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ హాల్లో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో 15కుపైగా కేంద్ర ప్రభుత్వ బ్యాంకులు పాల్గొని, చిన్న పరిశ్రమల నుంచి కొనుగోలు చేసే ఉత్పత్తుల వివరాలు, ఆర్థిక సాయం అందించే పథకాలను వివరించనున్నట్లు ఫాప్సియా ప్రెసిడెంట్ వి.మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. 